# ప్లేటో

# ప్రేమగోష్ఠి

వాడ్రేవు చినవీరభద్రుడు



# ప్లేటో సింపోజియానికి తెలుగు

# ప్రేమగోష్ఠి

వాడ్రేవు చినవీరభద్రుడు

PREMA GOSHTHI
(SYMPOSIUM BY PLATO)

Translated into Telugu
Vadrevu China Veerabhadrudu

December, 2024

Image on the front cover:
Greek vase with muse playing the phorminx, a type of lyre,
pc: wikipedia

Inside line drawing:
Geometric Vase from Rhodes, pc: wikimediacommons

Cover design, Typesetting and Lay-out
Chinaveerabhadrudu Vadrevu

e-book released by

Vadrevu Chinaveerabhadrudu
First Floor, Plot.No.56, Navodaya Colony
Mehidipatnam
Hyderabad-500028
chinaveera@gmail.com
9490957129

for more resources please visit:
www.chinaveerabhadrudu.in

కల్యాణి నీలారంభంగారికి

# సౌందర్యలహరి

**పదిహేనేళ్ళ** కిందటి మాట. అప్పట్లో డా. రఘురామరాజు వడ్డెర చండీదాస్ Desire and Liberation మీద పుస్తకం రాస్తున్నారు. ఆ సందర్భంగా desire అనే భావనని అర్థం చేసుకోవడం కోసం ఆయన ఛాందోగ్య ఉపనిషత్తునీ, ప్లేటో[1] సింపోజియాన్నీ[2] అధ్యయనం చేస్తో ఉన్నారు. మేము కలుసుకున్నప్పుడల్లా ఆ రెండుగ్రంథాల గురించీ ఎప్పటికప్పుడు కొత్తగా లోతైన ఆలోచనలు పంచుకుంటూ ఉండేవారు. నేను కూడా అప్పటికి ఆ రెండుగ్రంథాలూ చదివి ఉన్నాను కాబట్టి నాకు స్ఫురించిన భావాలు నేను కూడా చెప్తుండేవాణ్ణి. ఆ రెండింటినీ తెలుగు చెయ్యమనీ, ఆ రెండింటితోపాటు చండీదాస్ రచన కూడా తెలుగు చెయ్యగలిగితే, మూడింటినీ కలిపి ఒక పుస్తకంగా తెద్దామనీ అనేవారు.

'సింపోజియం' ప్లేటో రచనలన్నిటిలోనూ అత్యుత్తమరచన. కావ్యత్వాన్ని అందుకున్న రచన. విద్యావంతుడైన ప్రతి ఒక్కడూ చదివితీరవలసిన రచన.

క్రీ.పూ. 4-6 లో ఏథెన్స్‌లో అగథాన్ అనే ఒక యువకుడికి నాటకరచనలో బహుమతి వచ్చిన సందర్భంగా మిత్రులంతా అతణ్ణి అభినందించడానికి కలుసుకుంటారు. ఆ సమావేశానికి సోక్రటీస్ కూడా వస్తాడు. ఆ సందర్భంగా ఏదైనా విషయం మీద అందరూ మాట్లాడితే బాగుంటుందని ఎవరో ప్రతిపాదిస్తారు. అప్పుడంతా ప్రేమ గురించి ప్రసంగిస్తారు. ఒకరి వెనక ఒకరు అయిదుగురు వక్తలు ప్రేమ గురించి అద్భుతంగా ప్రసంగించాక సోక్రటీస్ వంతు వస్తుంది. ఆయన ఎప్పటిలానే తనకి ప్రేమ గురించి ఏమీ తెలియదని మొదలుపెడతాడుగానీ, తన భాగ్యవశత్తూ డయోటిమ అనే ఒక స్త్రీ ద్వారా ప్రేమజ్ఞానం లభించిందని చెప్తాడు. ఆమె చెప్పినమాటలు వాళ్ళకి చెప్తున్నట్టుగా

సోక్రటీస్, సోక్రటీస్ ద్వారా ప్లేటో, ప్రేమ గురించి ఒక అజరామర ప్రసంగం చేస్తారు.

ప్రేమ మొదట దేహాల్ని ఆలంబన చేసుకునే ప్రభవిస్తుందనీ, అయితే ఆ క్రమంలో చివరికి మనం దేహాతీతమైన, కాలాతీతమైన ఒక మహాసౌందర్యసాక్షాత్కారానికి చేరుకుంటామనీ, ఆ సౌందర్యదర్శనం లభించడమే మానవజన్మకి సార్థక్యమనీ ఆ స్త్రీ తనకి బోధించిందని సోక్రటీస్ వారికి చెప్తాడు. సోక్రటీస్ ప్రసంగం ముగించగానే ఆల్సిబయాడిస్ అనే ఒక సుందరయువకుడు, ప్రజాభిమానాన్ని చూరగొన్న ఏథెన్సు పౌరుడు, సోక్రటీస్ శిష్యుడు, తాను ప్రేమ గురించి కాక, సోక్రటీస్ గురించే మాట్లాడతానంటూ, సోక్రటీస్ గుణగానం చేస్తాడు. అతడు ఆవిష్కరించిన సోక్రటీస్ అంతకు ముందు సోక్రటీస్ ఎటువంటి ప్రేమదర్శనం గురించి మాట్లాడేడో, ఆ దర్శనానికి నిలువెత్తు నిరూపణగా కనిపిస్తాడు.

ఒక్క ఛాందోగ్యమే కాదు, చాలా అంశాల్లో, సింపోజియం మనకి బృహదారణ్యకాన్నీ, తైత్తిరీయాన్ని కూడా స్ఫురింపచేస్తూంటుంది. 'ఫీడో' లో సోక్రటీస్ తత్త్వశాస్త్రమంటే మృత్యువుని అధ్యయనం చేసే శాస్త్రమంటాడు. కానీ సింపోజియానికి వచ్చేటప్పటికి తత్త్వశాస్త్రం అమరత్వ చర్చగా మారిపోయింది.

డా. రఘురామరాజుతో మాట్లాడినప్పుడల్లా ఉత్సాహం పొంగుకొచ్చి ఆ ఉత్సాహంలో 'పానగోష్ఠి' పేరిట సింపోజియాన్ని తెలుగు చెయ్యాలనుకున్నానుగానీ, నేను చెయ్యలేకపోయిన ప్రాజెక్టుల్లో అది కూడా ఒకటిగా మిగిలిపోయింది. 2016 లో ఆ ముచ్చట అంతా రాసుకొచ్చి 'ఇప్పుడు మళ్ళా ఉత్సాహం కలుగుతోంది. కాని ఈ సారి 'పానగోష్ఠి' అని కాదు, 'ప్రేమగోష్ఠి' అని చెయ్యాలనుంది' అని రాసాను. కాని ఆ తర్వాత కూడా మరొక ఆరేడేళ్ళు గడిచిపోయాయి. ఎట్టకేలకు, సింపోజియాన్ని తెలుగులో, ఇదుగో ఇలా, 'ప్రేమగోష్ఠి' పేరిట మీకు అందచేస్తున్నాను.

సింపోజియానికి ఇంగ్లిషులో చాలా అనువాదాలున్నాయి. వాటిల్లో బెంజమిన్ జోవెట్ అనువాదాలు సుప్రసిద్ధమే కాక, పబ్లిక్‌డొమైన్‌లో ఉన్నవి కూడా. అందుకని నా తెలుగుసేతకు ఆయన అనువాదాన్ని ఎంచుకున్నాను.

## 2

ఎన్నో ఏళ్ళుగా అనుకుంటూ వస్తున్న పని ఇన్నాళ్ళకు పూర్తి చేసినందుకు సంతోషంగా ఉంది. ఎందుకంటే, మొత్తం పాశ్చాత్యతత్త్వశాస్త్రమంతా ప్లేటో రచనలకు a series of

footnotes లాంటిది అని వైట్‌హెడ్ అన్న మాట మనం మరవలేం. ఆయనిలా అన్నాడు

> యూరపియన్ తత్త్వశాస్త్రం గురించి పెద్దగా పొరపడకుండా మనం చెప్పగల మాట ఏమిటంటే, ఆ సంప్రదాయం మొత్తం ప్లేటో రచనలకి వరసగా రాసుకుంటూ పోయిన ఫుట్‌నోట్స్ మాత్రమే. అతడి రచనలనుంచి పండితులు పిండుతూ వచ్చిన ఆలోచనా వ్యవస్థ గురించి నేనీ మాటలు చెప్పడంలేదు. ఆ రచనలనుంచి వాళ్ళేమేరకు పిండివడగట్టారన్నది అంతనిశ్చయమైన సంగతేమీ కాదు. నేను మాట్లాడుతున్నది ఆయన రచనలంతటా విస్తారంగా కనిపించే భావాల గురించి. ఆయన వ్యక్తిగత ప్రజ్ఞా పాటవాల గురించి. ఒక నాగరికత అనుభవించిన అత్యున్నతదశలో ఆయనకి లభించిన అవకాశాల గురించీ, అనుభవాల గురించీ, తనకి వారసత్వంగా లభించిన ఒక జ్ఞాన సంప్రదాయాన్ని ఆయన మరీ కరడుగట్టిన వ్యవస్థగా మార్చకపోవడం గురించీను. వాటివల్ల ఆయన తన సాహిత్యాన్ని ఒక అక్షయధ్వనికోశంగా మార్చేసాడు.

ఈ మాటల సారాంశమేమిటంటే, ప్లేటోని చదివి అర్థం చేసుకోడానికీ, ఆయన వెలిబుచ్చిన భావాల గురించి ఆలోచించడానికీ లేదా ఇద్దరు మిత్రులు కూచుని మాటాడుకోడానికీ, వాళ్ళు అకడమిక్ సంప్రదాయానికి చెందినవాళ్ళే కానక్కరలేదని. ప్లేటో రచనలు తత్త్వశాస్త్రరచనలు అన్న మాట ఎంత నిజమో, అవి సాహిత్యకృతులు అన్న మాట కూడా అంతే నిజం. అందుకనే 'ప్లేటోని చదివి ఆనందించే ప్రతి పాఠకుడిలోనూ ప్లేటో ఉన్నాడు' అని అన్నాడు రాధాకృష్ణన్.

మరొక సంగతేమిటంటే, ఆధునిక యూరపియన్ తత్త్వశాస్త్రవిద్యార్థికన్నా, మనకి ప్లేటో మరింత సన్నిహితంగా వినిపిస్తాడు. ఎందుకంటే, మనకు తెలిసినా తెలియకపోయినా మనలో ఉపనిషత్తుల ఆలోచనా స్రవంతి సజీవంగా ప్రవహిస్తూనే ఉంది. మనల్ని నిర్భ్రాంత పరిచే జీవితవాస్తవాల ఎదట నిలబడి ఉన్నప్పుడు కూడా, మనకి జీవితం పట్లా, మానవుడి పట్లా, సత్యం, శివం, సౌందర్యాల పట్ల ఆశ ఇంకా నిలబడటానికి కారణం యుగయుగాలుగా మనలో ఒక జీవితస్తోత్రం మన హృదయధ్వనితో మిళితమైపోయి వినిపిస్తూ ఉంది. మన పైపై అనుభవాల్ని దాటిన ఒక జీవితానందస్పృహ మన రక్తంలో భాగమైపోయిందని మనకి ఇటువంటి రచనలు చదివినప్పుడు మరింత బాగా అనుభవానికొస్తుంది.

బహుశా, అకడమిక్ నేపథ్యం లేకుండా తత్త్వశాస్త్రం చదవలేమోననే సంకోచం వల్ల కొంతా, ఆధునిక తెలుగు సాహిత్యాన్ని, ఆలోచననీ ఎదగనివ్వకుండా చేసిన యాంత్రికభౌతికవాదుల వల్ల కొంతా తెలుగుపాఠకుల్లో ప్లేటోపట్ల కుతూహలం కలగవలసినంతగా కలగలేదు.

అలాగని కృషి చేసినవారు అస్సలు లేరని చెప్పలేను. ఉదాహరణకి జి.వి.కృష్ణారావుగారు 1949 లోనే ప్లేటో దర్శనాన్ని వివరిస్తూ 'జేగంటలు' అనే గ్రంథం వెలువరించారు. అందులో ఆయన చేసి కృషి నిరుపమానం. ఆయన ప్లేటో రచనలతో పాటు తన సమకాలిక ప్లేటో పండితుల రచనలు కూడా చదివి ఎంతో సాధికారికంగా ఆ పుస్తకం రాసినట్టుగా మనకి కనిపిస్తుంది. కాని ఎందుచాతనో, ఆ కృషికి తెలుగులో కొనసాగింపు లేకపోయింది.

ప్లేటో సంభాషణలు కూడా తెలుగులో పూర్తిగా అనువాదం కాలేదు. నాకు తెలిసినంతవరకూ తెలుగు అనువాదాల్ని వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. వాటిని వరసగా చూస్తే ఇలా ఉన్నాయి.

ప్లేటో మొదటి దశలో (క్రీ.పూ. 399-90) రాసిన సంభాషణలు: అపాలజి, చార్మిడెస్, క్రీటో, యుథైఫ్రో, గోర్గియాస్, హిప్పియాస్ మైనర్, హిప్పియాస్ మేజర్, అయోన్, లాచెస్, లైసిస్, ప్రొటాగరస్. వీటిల్లో పిలకాగణపతి శాస్త్రిగారు అపాలజీని 'సమర్థన' పేరిట, క్రీటోని 'క్రీటో' పేరిట తెలుగు చేసారు. ఆ రెండు సంభాషణల్నీ కలిపి 'సోక్రటీస్ అమరవాణి' పేరిట దక్షిణ భాషా పుస్తక సంస్థవారు 1959 లో ప్రచురించారు. తిరిగి ఈ సంభాషణల్లోంచి 'అపాలజి'ని 'సోక్రటీస్ ఆత్మరక్షణ' పేరిట, వాటితో పాటు 'అయోన్', 'క్రిటో'లను కూడా కలిపి ఎ.గాంధిగారు 'ఐదు సుప్రసిద్ధ ప్లేటో రచనలు' పేరిట లోక్‌సత్తా సంస్థతో కలిసి పీకాక్ క్లాసిక్స్ తరపున 2003 లో వెలువరించారు. అంటే ప్లేటో మొదటిదశలో రాసిన 11 సంభాషణల్లో మూడు మాత్రమే తెలుగులోకి వచ్చాయి. రెండు సంభాషణలు రెండు సార్లు వచ్చాయి.

ప్లేటో మధ్య దశలో (క్రీ.పూ. 388-67) రాసిన సంభాషణలు: క్రెటాలైస్, యుథిడెమస్, మెనో, మెనెక్సినస్, పార్మెనిడిస్, ఫీడొ, ఫేడ్రస్, రిపబ్లిక్, సింపోజియం, థియెటటస్. వీటిలో సుప్రసిద్ధ 'రిపబ్లిక్' గ్రంథాన్ని జి.వి.కృష్ణారావుగారు 'ఆదర్శరాజ్యం' పేరిట అనువదించినదాన్ని సాహిత్య అకాదెమీ 1962 లో ముద్రించింది. మిగిలినవాటిలో

'మెనో', 'ఫీడొ' లు గాంధిగారి అనువాదంలో చోటుచేసుకున్నాయి. అంటే మధ్య దశ పది సంభాషణల్లో మొత్తం మూడు మాత్రమే తెలుగులోకి వచ్చాయి.

ప్లేటో చివరిదశలో (క్రీ.పూ. 360-47) రాసిన సంభాషణలు: క్రిషస్, సోఫిస్ట్, స్టేట్స్ మన్, టిమేయస్, ఫిలబస్, లాస్. ఈ ఆరింటిలో ఒక్క సంభాషణ కూడా తెలుగులోకి రాలేదు.

మొత్తం 35 సంభాషణల్లో 27 కు లెక్క తేలిస్తే, (ఈ లెక్కలో ఒకటి రెండు తేడాలు ఉండవచ్చు, ఎందుకంటే కొన్ని సంభాషణలు ప్లేటో రాసినవి అవునా కాదా అన్న చర్చ ఉంది) అత్యుత్తమమైనవిగా చెప్పదగ్గవి రిపబ్లిక్, సింపోజియం. కృష్ణారావుగారి వంటి పెద్దలు రిపబ్లిక్ ని అనువదించి సింపోజియంని వదిలిపెట్టడం నా భాగ్యంగా భావిస్తున్నాను.

## 3

ఇప్పటికి 2439 ఏళ్ళ కిందట ఏథెన్సులో ఒక రాత్రి కొంతమంది మిత్రులు మాట్లాడుకున్న మాటల్ని ఈ రోజు చదవడం అవసరమా? చారిత్రిక ప్రాధాన్యత తప్ప ఆ సంభాషణకేమైనా సమకాలీన ప్రాసంగికత ఉందా? ఈనాటి మనిషి, ఈనాటి ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకి ఆ సంభాషణలో లేశమాత్రమైనా సాంత్వన లభిస్తుందా?

ఈ ప్రశ్నలు కలగడం సహజం. మరీ ముఖ్యంగా ఇజ్రాయిల్, పాలస్తీనా ఒకరిమీద ఒకరు క్షిపణులు కురిపించుకుంటూ ఉన్న రోజుల్లో, జాతి, మత ద్వేషం చివరికి ఆసుపత్రుల్నీ, నిరపరాధుల్నీ కూడా వదిలిపెట్టని దృశ్యాలు మన కళ్ళముందు కనిపిస్తున్న కాలంలో, ఎప్పుడో గ్రీసులో కొంతమంది కూచుని ప్రేమ గురించీ, సౌందర్యం గురించీ తీరుబాటుగా మాట్లాడుకున్న మాటలు మనకి దారి చూపించడం అలా ఉంచి, అసలు అవి చదవడం అవసరమా? నీ కళ్ళముందు కురుస్తున్న అగ్నివర్షం గురించి మాట్లాడకుండా ఎప్పుడో ఎక్కడో ఒక సాయంకాలం కొంతమంది పానోన్మత్తుల మాటల గురించి మాట్లాడుకోవడం సమంజసమేనా అని కూడా అడగవచ్చు.

కానీ పైకి చాలా తీరుబాటుగా, సంతోషంగా, పరస్పరం పరాచికాలాడుకుంటూ మాట్లాడుకున్న ఈ మాటలు రాయడానికి కూచున్నప్పుడు ఏథెన్స్ ప్రశాంతంగా లేదనీ, ఒక సుదీర్ఘ, మహాయుద్ధంలో కూరుకుపోయి ఉందనీ తెలిస్తే మనం ఈ రచన మీద హడావిడిగా తీర్పు ఇవ్వడం పక్కన పెట్టి ఒక క్షణం ఆలోచనలో పడతాం.

ప్లేటో ఈ రచన ఏ సంవత్సరంలో రాసాడో ఇతమిత్థంగా చెప్పలేకపోయినా, ఆయన దీన్ని దాదాపుగా క్రీ.పూ. 385 ప్రాంతంలో రాసాడని ఒక అంచనా. అప్పటికి, దాదాపు నలభైఏళ్ళకింద మొదలైన పెలిపొనీషియన్ యుద్ధాలు ముగిసి సుమారు ఇరవయ్యేళ్ళయింది. ప్లేటో రాసిన ఈ సంభాషణ (క్రీ.పూ. 416) మొదటి పెలిపొనీషియన్ యుద్ధం జరుగుతూ ఉండగా (క్రీ.పూ. 431-421) సంభవించిన సంఘటన. ఆ యుద్ధంలో స్పార్టా ఏథెన్స్ మీద దాడిచేసినప్పటికీ ఏథెన్స్ నావికాబలం ముందు నిలబడలేక ఓడిపోయింది. అప్పటికి ఏథెన్స్‌ని ఇంకా క్రీ.పూ. ఆరవ-అయిదవశతాబ్ది విలువలు కాపాడుతూ ఉన్నాయి. గ్రీకు స్వర్ణయుగం అనగానే అందరికన్నా ముందు గుర్తొచ్చే పెరిక్లీజ్ ఉత్తేజమింకా ఏథెన్స్‌ని నిలబెడుతూనే ఉంది. అంటే ఒకవైపు యుద్ధం జరుగుతూ ఉండగా, ఆ యుద్ధ వాతావరణంలో, కొంతమంది భావుకులు కూచుని ఇలా సంగీతం, సాహిత్యం, సౌందర్యాల గురించి మాట్లాడుకున్నారన్నది మనం మరవకూడదు.

కాని ఈ సంభాషణ జరిగిన మరుసటి ఏడాది (క్రీ.పూ. 415) నుంచి ఏథెన్స్ అదృష్టం తల్లకిందులు కావడం మొదలయ్యింది. స్పార్టా మిత్రరాజ్యమైన సిరాక్యూజ్ ముట్టడిలో (క్రీ.పూ. 415-413) ఏథెన్స్ తన నౌకాబలాన్ని పూర్తిగా పోగొట్టుకుంది. ఈ సంభాషణలో ప్రముఖ పాత్ర వహించిన ఆల్సిబయడిస్ సిసిలీ దండయాత్రలో ప్రధాన పాత్ర పోషించాడుగానీ ఆ తర్వాత అతడు స్పార్టాకూటమికీ, అక్కణ్ణుంచి పర్షియాకీ అనుకూలంగా మారిపోయాడు. ఏథెన్స్ ఓటమి వెనక మరొక రెండు దుర్ఘటనలు కూడా ఉన్నాయి. ఒకటి, ప్రాచీన ఏథెన్స్‌లో అత్యంత పవిత్రంగా భావించే ఎల్యూసినియన్ పూజాక్రతువుల్ని కొందరు అవహేళన చేసారు. రెండవది ఏథెన్సు రహదారుల్లోనూ, చతుష్పథాల్లోనూ రక్షణసూచకాలుగా నిలబట్టే హెర్మస్ ప్రతిమల్ని ఎవరో ధ్వంసం చేసారు. ఈ రెండింటివెనకా ఆల్సిబయడిస్‌తో పాటు మరికొందరు యువకుల హస్తముందనీ, వాళ్ళు తప్పతాగినమత్తులో ఈ దురాగతాలకి ఒడిగట్టారనీ, వాళ్ళట్లా చెడిపోవటానికి సోక్రటీస్ కారణమనీ ఏథెన్స్ పాలకమండలి సోక్రటీ మీద విచారణ చేపట్టింది. ఆ విచారణలో సోక్రటీస్ తన వంతు వివరణ తానిచ్చుకున్నప్పటికీ పౌరన్యాయస్థానం దాన్ని అంగీకరించలేదు. ఆయనకి మరణశిక్ష విధించింది. క్రీ.పూ. 399 లో ఆ మరణశిక్ష అమలు చేసారు. దానికి అసలైన కారణం క్రీ.పూ. 404 నాటికి ఏథెన్స్ స్పార్టా చేతుల్లో పూర్తిగా ఓడిపోయి ధ్వంసమైపోవటం. ఒక నగరం లేదా రాజ్యం తన రాజకీయ ఓటమిని భరించలేనప్పుడు చేసే మొదటిపని తన జాతిని నడిపిన మహాత్ములెవరో వాళ్లని బలివ్వడం. అది క్రీ.పూ 399 లో అయినా, సా.శ. 1948 లో అయినా జరిగేది అదే.

పెలిపొనీషియన్ యుద్ధాలు మొదలు కావడం స్పార్టా రాజ్యకాంక్షతో మొదలయ్యాయి. కాని ఆ యుద్ధాలు ముగిసేటప్పటికి గ్రీకు చరిత్రమొత్తం మారిపోయింది. అప్పటిదాకా గ్రీకు విలువలకు అత్యున్నత పతాకగా నిలబడ్డ ఏథెన్సు ఆ యుద్ధాలు పూర్తయ్యేటప్పటికి పూర్తిగా పతనమైపోయింది. తిరిగిమళ్ళా ఆ తర్వాత మరొక పదేళ్ళు జరిగిన కొరింథియన్ యుద్ధాల తర్వాత (క్రీ.పూ. 394-386) ఏథెన్స్ తన స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోగలిగింది. కానీ రాజకీయంగా మాత్రమే. ఆ ప్రాచీన స్వర్ణయుగాన్ని మాత్రం ఏథెన్స్ తిరిగి కళ్లారా చూడలేకపోయింది.

దాదాపు ఇరవయ్యేళ్ళ కిందట, స్పార్టా చేతిలో ఓడిపోయినప్పుడు, ఏథెన్స్ తన ఓటమికి కారణాల్ని తన దేవతలకీ, తన క్రతువులకీ జరిగిన అవమానాల్లో వెతుక్కుని దానికి సోక్రటీస్ కారణమని ఆయన మరణానికి కారణమయ్యింది. ఆ వెనువెంటనే ప్లేటో సోక్రటీస్ నిర్దోషిత్వాన్ని సోక్రటీస్ ముఖతః నే చెప్పిస్తూ 'అపాలజి' రాసాడు. తాను యువతను పెడదోవపట్టించడం లేదని సోక్రటీస్ చాలా వివరంగా తన 'అపాలజి'లో చెప్పుకున్నాడు. సోక్రటీస్‌కి మరణశిక్ష అమలు చేసిన వెంటనే, బహుశా ఆ తర్వాత పదిపన్నెండేళ్లలో (క్రీ.పూ. 399-387) ప్లేటో ఆ సంభాషణ రాసి ఉంటాడు. ఒకసారి ఆ యుద్ధాలు ముగిసేక, తిరిగి మళ్ళా ఏథెన్స్ తన అవమానం నుంచి కోలుకుని ఎంతో కొంత స్వాతంత్ర్యాన్ని మళ్లా సాధించుకున్నాక, అప్పుడు (క్రీ.పూ. 386) ప్లేటో సింపోజియం రచనకు పూనుకున్నాడని మనకు అర్థమవుతుంది. అపాలజి, ఫీడొ వంటి సంభాషణలు రాసి ఉన్నప్పటికీ ప్లేటో తృప్తి చెందలేదనీ, సోక్రటీస్ నిర్దోషి అని పదే పదే మరింత బిగ్గరగా చెప్పాలని అనుకుంటూనే ఉన్నాడనీ మనకి అనిపిస్తుంది. సోక్రటీస్‌కి జరిగిన అన్యాయం దాదాపు పదిహేడేళ్ళుగా ఆయన్ని కలచివేస్తూనే ఉన్నప్పటికీ, కొరింథియన్ యుద్ధాల్లో ఏథెన్సు తిరిగి తన పరాక్రమాన్ని చూపించి తన గౌరవాన్ని నిలబెట్టుకున్నాక గానీ ఆయనకు వీలు కాలేదు.

చూడండి, ఎంత ఆశ్చర్యకరమైన విషయమో? ఎంత విషాదభరితమైన విషయమో! మద్యంగాని, లైంగికవ్యామోహంగానీ, అందచందాలూ, గౌరవప్రతిష్టలూ గాని సోక్రటీస్‌ని ఏ విధంగానూ ప్రలోభపర్చలేవనీ, ఒక్క సత్యం ముందు మాత్రమే ఆయన మోకరిల్లుతాడనీ చెప్పటానికి ఇంత హృద్యమైన, ఇంత సజీవమైన, ఇంత సంఘర్షణాభరితమైన సంభాషణ ప్లేటో రాయవలసి వచ్చింది. కాని సోక్రటీస్ నిర్దోషిత్వాన్ని సోక్రటీస్ ముఖతః కన్నా, ఏథెన్స్ మతధార్మిక మనోభావాల్ని గాయపరిచిన ఆల్సిబయడిస్ ముఖతః చెప్పించడమే సమంజసమని ప్లేటో భావించాడనీ, అందుకుగాను సింపోజియం రాసాడనీ మనం

సులభంగానే గ్రహించవచ్చు. అందుకనే తక్కిన సంభాషణల్లోలాగా ఇందులో నేరుగా సోక్రటీస్ మాట్లాడడు. అరిస్టొడెమస్ అనే వాడు తనతో చెప్పాడని అపొల్లొడొరస్ అనేవాడు ఒకప్పుడు తన సహచరుడికి చెప్పినమాటలు మళ్ళా గ్లోకన్ అనేవాడికి చెప్పినట్టుగా ఈ సంభాషణ రాసాడు. పైగా ఏథెన్సు నగరవీథులున్నది సంభాషణలకోసమేగా అని అనిపిస్తాడు. అపాలజి సోక్రటీస్ జూరీ ముందు వినిపించిన వాదన. అంటే నాలుగ్గోడలకి పరిమితమైన సమర్థన. కానీ సింపోజియం అలా కాదు. ఇది ఏథెన్సు నగరవీథులు మొత్తం వినబడేట్టుగా ఏథెన్సు పౌరులు మళ్ళా మళ్ళా బిగ్గరగా ఒకరికొకరు చెప్పుకున్నట్టుగా నడిచిన సంభాషణ. అప్పటికి గాని ప్లేటో మనసు శాంతించలేదనిపిస్తుంది.

ఇందులో సోక్రటీస్ శీలం ఎటువంటిదో చెప్పడమే కాదు, ఆల్సిబయడిస్ చెప్పిన మరొక ముఖ్యమైనమాట, అన్నిటికన్నా ముఖ్యమైనమాట, తనకి సోక్రటీస్ సమక్షంలో ఉన్నప్పుడు సత్యం ముఖ్యమనిపిస్తుందనీ, ఆయన్నుంచి బయటకు రాగానే ప్రజాదరణా, ప్రజామోదమూ ముఖ్యమనిపిస్తాయనీ చెప్పడం. ఆ రెండు విరుద్ధశక్తుల మధ్యా తానెంత నలిగిపోయాడంటే, సోక్రటీస్ చచ్చిపోతే బాగుణ్ణని తనకి చాలాసార్లు అనిపించిందని కూడా (పే. 88) చెప్తాడు. ఈ మాటల్లో అతిశయోక్తి లేదని మనం చెప్పగలం.

ఎందుకంటే బుద్ధుడు నిర్వాణం చెందినవెంటనే, ఆయన శిష్యుల్లో ఒకడు సుభద్రుడనేవాడు 'ఈయన బతికున్నంతకాలం అది చెయ్యకండి, ఇది చెయ్యకండి, అలా ఉండండి, ఇలా ఉండండి అని ప్రతిదానికీ ఆంక్షలు పెట్టేవాడు, ఇప్పుడు ఆయన మరణించాడు కాబట్టి, ఇక మనం స్వేచ్ఛగా ఉండొచ్చు' అని అన్నాడని మనకు తెలుసు. మన కాలంలోనే, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, చాలామందికి మహాత్ముడు ఒక మానసికభారంగా ఎలా పరిణమించాడో మనం చూసాం. చివరికి ఆయన్ని హత్యచేస్తే తప్ప వాళ్ల మనసు వాళ్లని కుదుటపడనివ్వలేదు.

తన కాలం నాటి ఏథెన్స్ మానసికదాస్యాన్ని సోక్రటీస్ కలవరపరిచాడనీ, తన రాజకీయదాస్యాన్ని భరించలేని ఏథెన్స్, తమ మధ్య మానసికస్వతంత్రుడిగా ఉన్న సోక్రటీస్‌ని బలిగొన్నదనీ ప్లేటో మరింత సూక్ష్మంగా, మరింత సాహిత్యప్రతిభతో సింపోజియం ద్వారా వివరిస్తున్నాడని మనం గ్రహించినప్పుడు ఈ రచన మరింత ఔన్నత్యాన్ని సంతరించుకుంటుంది.

కాబట్టి, ఇది శాంతికాలపు రచన కాదు, యుద్ధకాలపు రచన. నగరాలూ, జాతులూ, రాజ్యాలూ ఒకరినొకరు జయించాలని తలపడ్డప్పుడల్లా ముందు బలిచ్చేది నిరపరాధుల్నేనని ఆ నాటి ఏథెన్సు నుంచి నేటి గాజా దాకా సాక్ష్యం పలుకుతున్నాయి.

నిజానికి సింపోజియం వంటి రచన, సంతోషసమయంలోకన్నా, మృత్యుముఖం ఎదటనే మరింత సార్థంకంగా తోచే రచన. అరేబియన్ నైట్స్ గురించి రాస్తూ ప్రసిద్ధ రచయిత్రి ఎ.ఎస్.బయట్ ఒక ఉద్విగ్నకరమైన సంగతి చెప్పింది. సెర్బియా–క్రొయేషియా అంతర్యుద్ధ సమయంలో, 1994 లో సారజెవో మీద బాంబులు వర్షిస్తున్నప్పుడు, ప్రతి శుక్రవారం సాయంకాలం, సారజెవోలోనూ, ఇతర యూరపియన్ నగరాల్లోనూ, అమస్టర్ డామ్‌కి చెందిన ఒక నాటకబృందం యూరపియన్ కథల్ని చెప్పుకునే ప్రదర్శన ఒకటి నడిపిందట. ప్రతి శుక్రవారం కథకులు సమావేశమై మహత్తరమైన యూరపియన్ కథల్ని చదువుకోవడమో లేదా నాటకీకరణ చెయ్యడమో చేసేవారట. విధ్వంసం ఎదట, మృత్యువు ఎదట మానవాళికి ఆశనివ్వగల వాగ్దానం సాహిత్యం ఒకటే అని ఆ నాటకబృందం నమ్మి చేసిన పని అది. అరేబియన్ నైట్స్ కథల నేపథ్యం అదే కదా అని బయట్ గుర్తుచేస్తుంది. తన మీద పొంచి ఉన్న మృత్యువుని ప్రతి ఒక్కరాత్రీ వాయిదా వేసుకుంటూ పోవడమే కదా, షహ్రాజాదే చేసిన పని. అలా కథలు చదువుకోవడం వల్ల ప్రాణాలు రక్షించలేం. నిజమే, కాని ఒక ప్రాణశక్తిని పరస్పరం పంచుకోగలం కదా అంటుంది బయట్.

## 4

సింపోజియాన్ని ప్లేటో ఒక తత్త్వశాస్త్ర రచనగాకన్నా ఒక సాహిత్యకృతిగా తీర్చిదిద్దడం మీదనే దృష్టిపెట్టాడనడానికి రెండు కారణాలు కనిపిస్తాయి. మొదటిది, ప్లేటో తక్కిన రచనలు, రిపబ్లిక్‌తో సహా, ఏవీ చదవకపోయినా, ఒక్క సింపోజియం చదివితేచాలు ఆయన దర్శనంలోని కీలకాంశాలతో మనకి పరిచయం కలిగినట్టే. ఆయన తన దర్శనాన్ని మనముందుంచడమ్మీదనే ఎక్కువ దృష్టిపెట్టాడు తప్ప వాటిని వాదోపవాదాలద్వారా చర్చించడం మీద దృష్టిపెట్టలేదు. అంటే ఆయన తనకాలం నాటి సాధారణపాఠకుడు కూడా, సోఫిస్టు, ఫిలో–సోఫీ సంప్రదాయాల గురించి తెలియనివాడుకూడా, ఆ రచనను ఆద్యంతం చదివేలాగా రాసినట్టుగా మనకి అనిపిస్తుంది. అది ఆనాటి సాధారణ ఏథెన్సు పౌరుడికి ఎంత సులభగ్రాహ్యంగా ఉండిందో ఇనాటి సాధారణ పాఠకుడికి కూడా అంతే సన్నిహితంగా ఉండటంలో ఆశ్చర్యం లేదు.

రెండవది, మనం ఇంతకు ముందు వైట్‌హెడ్ చెప్పినట్టుగా, అసలు, ప్లేటో దర్శనంలోనే, తాత్త్విక, అంటే తార్కికంగా ఋజువు చెయ్యగల సత్యాలమీదకన్నా, మనం, ఇదీ అని నిరూపించలేకపోయినా, మన హృదయానికి సత్యం అనిపించే సత్యమే ఎక్కువ.

ఇలా బుద్ధితోకాక, హృదయం ద్వారా సత్యాన్ని సమీపించేట్టు చెయ్యడం సాహిత్యలక్షణం. సాహిత్యసత్యానికీ, శాస్త్రసత్యానికీ మధ్య ప్రాయికంగా ఉన్న ఈ తేడా వల్లనే, ఒక యుగాన్ని, ఒక జాతిని, ఒక జాతిహృదయస్పందనని అర్థం చేసుకోడానికి చరిత్రకారులకన్నా, సైంటిస్టులకన్నా, ఆ కాలం నాటి సాహిత్యకారులే ఎక్కువ దారిచూపించగలుగుతారు. అందుకనే ప్రాచీన ఏథెన్సుగురించి అర్థం చేసుకోడానికి మనకి అరిస్టొఫెనీస్, ప్లేటోలకన్నా మరెవ్వరూ ఎక్కువ విశ్వసనీయంగా కనిపించరని ఎడిత్ హామిల్టన్ రాసింది.

ఇప్పుడు సింపోజియంలో తత్త్వశాస్త్రం ఎంతవరకూ ఉందో, అది ఎక్కడ సాహిత్య రచనగా మారుతున్నదో చూద్దాం.

మామూలుగా మనకి ప్రపంచం గురించిన ప్రాథమికసమాచారం మన ఇంద్రియాలవల్ల వస్తుంది, ఇది ప్రత్యక్షజ్ఞానం. కాని దీని ద్వారా మనకి కలిగే పరిజ్ఞానం ప్రాథమికంగా పరిమితం. ఇది వట్టి అభిప్రాయం (గ్రీకులో doxa) మాత్రమే. ఈ అభిప్రాయాన్ని నిశితపరిశీలనకు, తార్కికవివేచనకు పెట్టి, అందులో నిజమెంతో తెలుసుకోడం ద్వారా లభించేది జ్ఞానం (గ్రీకులో episteme).

తత్త్వశాస్త్రం ఈ జ్ఞానం రెండురకాలుగా వస్తుందని చెప్తుంది. ఒకటి, ఇంద్రియ సంవేదనల్ని పరిశీలించుకోవడం ద్వారా. మనం చెప్పే శాస్త్రీయ వివేచన, వైజ్ఞానిక పరిజ్ఞానం ప్రధానంగా అనుభవాన్ని పరిశీలించడం ద్వారా, దానిలోని సార్వత్రిక అంశాల్ని వడగట్టడం చేస్తాయి. అంటే ఒక వ్యక్తికి ఒక నిర్దిష్టపరిస్థితుల్లో లభ్యమైన అనుభవం అదే నిర్దిష్ట పరిస్థితుల్లో మరొక వ్యక్తికి కూడా లభ్యమైతే, అప్పుడు ఆ అనుభవం వాస్తవికం అనిపించు కుంటుంది. అయితే జ్ఞానం అన్నివేళలా అనుభవం ద్వారానే రాదు. హేతువివేచన ద్వారా, తర్కంద్వారా, ఊహాగానాలద్వారా కూడా రావచ్చు. అంటే బుద్ధి ద్వారా లభిస్తుందన్న మాట.

ప్లేటో చెప్పేదేమంటే మనకి ఇంద్రియాలద్వారా లభిస్తున్న సంవేదనల్ని బుద్ధి ఒక జ్ఞానంగా మారుస్తున్నప్పుడు కూడా అదే చివరిజ్ఞానం కాదు. బయటిప్రపంచం గురించి మనకి ఇంద్రియాల ద్వారా తెలుస్తున్న విషయాల్ని బుద్ధితో సరిదిద్దుకుంటున్నా కూడా, అది కూడా ఎంతోకొంతమేరకు పరిమితజ్ఞానమే. మార్పుకి లోనయ్యే జ్ఞానమే. కానీ ఎటువంటి మార్పుకీ లోనుకాని, 'యథార్థమైన' సత్యం ఒకటి ఉంటుందని ప్లేటో భావించాడు. దాన్ని బయటిప్రపంచంలో చూస్తున్న వాస్తవం తాలూకు ఆదర్శవంతమైన భావంగా అతడు పిలిచాడు.

ఉదాహరణకి మనం ఒక బల్ల చూసామనుకోండి. దాని పొడుగు, వెడల్పు, ఎత్తు, మందం, ఉపరితలాన్ని బట్టి దాన్ని బల్ల అని గుర్తుపట్టడానికి లేదా మొదటగా దాన్ని తయారుచేసినవాడు బల్ల అని పిలవడానికి బల్ల అనే ఒక భావం ఉండి ఉండాలి. కాని వాస్తవంగా తయారైన ఏ ఒక్క బల్లా కూడా ఆ బల్ల అనే భావాన్ని పూర్తిగా సంతృప్తి చెందించలేదు. కాబట్టే కాలం గడిచేకొద్దీ బల్లలు తయారుచేయడంలో మరింత మెరుగుతనం, మరింత నాణ్యత వచ్చిచేరుతున్నాయి. ఇంతవరకూ బాగానే ఉంది. కాని ఒక బల్లని తయారుచేయడంలో మనిషి సాధిస్తున్న ఈ అభివృద్ధి పరిణామం వల్ల జరుగుతున్నది తప్ప, అతడి మనసులో నిరపేక్షంగా ఒక ఆదర్శవంతమైన బల్ల ఉందని ఎలా నమ్మడం? ఆ ఆదర్శభావనని తార్కికంగా ఎలా నిరూపించడం? ఈ ప్రశ్నమీదనే తత్త్వశాస్త్రం గత రెండున్నరవేల ఏళ్ళుగా తలపట్టుకుంటూనే ఉంది.

ఇక్కడ సింపోజియంలో చర్చ కూడా ఇదే. ఇక్కడ బల్ల అనే వస్తువు స్థానంలో సౌందర్యం అనే భావనని పెట్టి చూడండి. ఈ చర్చ మొత్తం కంటికి కనిపించే సౌందర్యం నుంచి మనం కంటితో చూడలేని ఒక నిరపేక్ష, అప్రమేయ సౌందర్యం వైపు ప్రయాణించడమని మనకు సునాయాసంగా అర్థమవుతూనే ఉంటుంది. ఇలా దృగ్గోచర సత్యం నుంచి ఇంద్రియాలు అందుకోలేని సత్యం వైపుగా మనిషి ప్రయాణించాలని చెప్పే భావన కూడా మనకి కొత్తగా అనిపించదు. ఎందుకంటే దాదాపుగా ఉపనిషత్తులు మాట్లాడింది కూడా అదే కాబట్టి.

కాని ప్లేటో చెప్తున్నట్టుగా ఆ ఆదర్శవంతమైన భావనని, ఆ అంతిమసత్యాన్ని మనం హేతుబద్ధంగా ఎలా చేరుకోగలమో మనకి అంత స్పష్టంగా తెలియదు. కంటికి కనిపిస్తున్న పరిమిత సత్యం ద్వారా కొన్ని సార్వత్రిక సూత్రాల్ని మనం హేతువుద్వారా ఏర్పరచుకోగలం, కానీ, ఆ సార్వత్రికాల్ని కూడా దాటిన ఒక నిరపేక్షసత్యాన్ని హేతువు ద్వారా ఎలా అందుకోగలమనేది ప్లేటో తన రచనల్లో ఎక్కడా సంతృప్తికరంగా వివరించలేదు.

ప్లేటో రచనలన్నిటిలోనూ ప్రతిపాదించిన తత్త్వశాస్త్రం స్థూలంగా ఆ పరమసత్యం గురించిన అన్వేషణనే. అయితే సింపోజియంలో అదనంగా ప్రతిపాదించిన విషయమేమిటంటే, ఆ అంతిమసత్యం మంచిది అని కూడా చెప్పడం. దాన్ని తెలుసుకోవడం మనకి శుభప్రదం అని చెప్పడం.

ఇక్కడ మనకి వచ్చే ప్రశ్న ఏమిటంటే, మనం ఇంద్రియాలద్వారా చూస్తున్న దానికన్నా అతీతంగా ఉండే ఆ పరమసత్యం మన ఆలోచనలకీ, ఇష్టాయిష్టాలకీ అతీతమైంది కదా.

ఈ సృష్టిక్రమాన్ని, ప్రపంచాన్ని నడిపిస్తున్న ఆ అంతర్గత తర్కం లేదా ఆ సూత్రం, అంటే ఆ సత్యం ప్రధానంగా మంచికోసమే, అని ఎలా భావించగలం? అంతేకాదు, ఆ మంచి వల్లనే మనకి సత్యం గురించిన జ్ఞానం కూడా కలుగుతోందంటాడు ప్లేటో.

రెండవ సమస్య, ఆ అత్యున్నతజ్ఞానం స్వతహాగా మంచిదే అని భావించడానికి నిరూపణ ఏమిటి? అంటే ఈ ప్రపంచాన్ని నడిపిస్తున్న అంతర్గత తర్కం మంచిదే అయితే అది ప్రతి ఒక్కసారీ మానవుడికి మేలు చేసేదిగా ఎందుకుండదు?ఉదాహరణకి తుపాన్లు, అగ్నిపర్వతవిస్ఫోటనాల్లాంటి ప్రాకృతిక వైపరీత్యాలు మనుషులకీ లేదా తక్కిన ప్రాణులకీ మేలుచేసేవి కావుకదా. వాటివల్ల కూడా ఏదో ఒక మేలు ఉండేఉంటుంది, కాని మనం గ్రహించలేకపోతున్నాం అని చెప్పవచ్చుగాని, అప్పుడది అభిప్రాయమే అవుతుంది తప్ప, జ్ఞానంగా నిలబడదు.

ఇక్కడే దర్శనాలకీ, మతాలకీ మధ్య విభజనరేఖ కూడా. చాలా దర్శనాలు ఆ పరమసత్యం లేదా ఆ పరమసూత్రం మంచిచెడులకి అతీతమని భావిస్తాయి. కాని ఆ పరమసత్యం స్వయంగా దయాపూరితమని భావించడం మతాలకి కీలకం.

మూడో సమస్య, అటువంటి ఒక నిరపేక్ష సత్యం ఉందని తెలుసుకోడం జ్ఞానం, సరే, కాని ఆ జ్ఞానం ద్వారా మనకి సత్యం తెలుసుకున్న సంతోషం కలగవచ్చు, నిజమే, కానీ, ఆ సంతోషం మానవజీవితాన్ని సార్థకం చేసే అత్యున్నత సంతోషం (గ్రీకులో eudaimonia) అని ఎలా చెప్పగలం? అసలు అటువంటి జ్ఞానం ఒకటి ఉందనిగాని, దాన్ని తెలుసుకోవడంలో సంతోషం ఉందనిగాని తెలియకుండానే అసంఖ్యాక మానవులు పుట్టిగిట్టుతున్నప్పుడు అదే మానవుడు అభిలషించే అత్యుత్తమసంతోషం అని ఎలా చెప్పగలం? అసలు సత్యాన్ని తెలుసుకోడంలో ఒక సంతోషమంటూ ఉంటే ఆ సంతోషం ఎందుకు కలుగుతోంది?

ప్లేటో తక్కిన రచనల్లో ఈ ప్రశ్నలకి తార్కికంగా జవాబులు చెప్పడానికి ప్రయత్నించాడు. కాని సింపోజియంలో మాత్రం సాహిత్యపరూపంలో జవాబివ్వడానికి పూనుకున్నాడు. అది రెండు స్థాయిల్లో చేసాడు. మొదటిది అరిస్టొఫేనీస్ ద్వారా ఒక కథ చెప్పించడం ద్వారా. మనం మరొక మనిషితో కలయికని ఎందుకు కోరుకుంటాం అనే ప్రశ్నకి ముందుగా ప్లేటో అరిస్టొఫెనీస్ ద్వారా చెప్పించిందేమంటే, మనం జీవులుగా అపరిపూర్ణులమనీ, మనలో అర్థభాగం విడివడి ఉందనీ, రెండుగా విడివడ్డ ఆ అర్థభాగాలు ఒకదానితో ఒకటి కలిసిపోవాలని కోరుకుంటూ ఉంటాయనీ చెప్పించాడు.

కాని ఆ తర్వాత సోక్రటీస్‌తో ఆ మెటఫర్ ని తార్కికంగా పూర్వపక్షం చేయిస్తాడు. అరిస్టొఫెనీస్ చెప్పిన మెటఫర్ మన కోరికని పూర్తిగా వివరించలేదని చెప్పిస్తాడు. మనిషిలో కలిగే కోరిక తనలోని అసంపూర్ణతని భరించలేక, మరొక అర్థభాగంకోసం, ప్రాకృతికంగా పడే వేదన కాదనీ, అది స్పష్టంగా, తన మంచికోసం మనిషి చేపట్టే అన్వేషణ అనీ చెప్పిస్తాడు. మనిషి కోరిక వెనక ఉన్నది ప్రధానంగా తన మంచి అనీ, ఆ మంచి వెనక ఉన్నది తన సంతోషమనీ చెప్పిస్తాడు. తనకి మంచి చెయ్యకపోతే, అవసరమైతే, తన శరీరంలోని భాగాన్ని కూడా తీసెయ్యడానికి మనిషి సిద్ధపడతాడని కూడా చెప్తాడు.

కాబట్టి సంతోషంకోసం కోరిక మంచికోసం కోరికగా, మంచికోసం కోరిక ఆ మంచి ఏదో తెలుసుకునే జ్ఞానంకోసం కోరికగా పరిణమిస్తోందనీ చెప్తాడు. ఇక్కడ సోక్రటీస్ చెప్పిన విషయానికి చివరలో ఆల్సిబయడిస్ చేసిన ప్రసంగం ఒక దృష్టాంతపూర్వక వ్యాఖ్యానం అని చెప్పవచ్చు. ఎందుకంటే, ఆల్సిబయడిస్ తనకి ప్రజాదరణ పట్లా, ప్రజామోదం పట్లా కోరిక ఉన్నప్పటికీ, సోక్రటీస్ సన్నిధిలో మాత్రమే సత్యం అనుభవంలోకి వస్తోందని చెప్తాడు.

అలా ఒక అంతిమ సత్యాన్ని మనకు అనుభవంలోకి తెస్తున్నదాన్నే ప్రేమ అంటాడు ప్లేటో. ప్రేమ గురించి మొదట్లో మాట్లాడిన వక్తలు ప్రేమ మనిషిలోని ఉత్తమ లక్షణాల్ని బయటకు తెస్తుందని చెప్పారుగానీ, అది మనిషిని సత్యంవైపుగా నడిపిస్తుందని చెప్పలేదు. కాని సోక్రటీస్ మాత్రమే, ప్రేమ వల్ల మనిషి lower mystery నుంచి higher mystery కి ప్రయాణిస్తాడని చెప్పాడు.

ప్లేటో చెప్పినదాని ప్రకారం కోరికకీ, ప్రేమకీ తేడా ఉంది. కోరిక (గ్రీకులో epithumia) మంచిది కావచ్చు, చెడ్డది కావచ్చు. కాని ప్రేమ (గ్రీకులో eros) పూర్తిగా శుభప్రదం. ఎందుకంటే eros ఎప్పటికీ శ్రేష్ఠత (గ్రీకులో arete) నే కోరుకుంటుంది. ఆ శ్రేష్ఠతకోసం తపనవల్లనే మనిషి సుందరమైనవాటిపట్ల (గ్రీకులో kalos) ఆసక్తుడవుతున్నాడు. అక్కణ్ణుంచి మరింత మరింత ముందుకు ప్రయాణించి పరమ సౌందర్యాన్ని భావించడానికి చేరుకుంటాడు. (ఈ కాలోస్ కీ, సంస్కృతంలోని 'కల్యాణ' అనే పదానికీ మూలధాతువు ఒకటే.) సత్యాన్ని తెలుసుకోదగ్గదిగా, జ్ఞానాన్ని సంతోషించదగ్గదిగా చేస్తున్నది ఆ కోరికనే. శ్రేష్ఠమైంది సిద్ధించడంవల్ల కలిగే సంతోషం కూడా శ్రేష్ఠసంతోషమే (గ్రీకులో eudaimonia) అవుతుంది. అయితే ఆ సంతోషమెందుకు అని కూడా ప్రశ్నించవచ్చుగాని, ఏ మనిషీ నాకు సంతోషమెందుకని అడగడు, అది ప్రశ్నల్తో పనిలేని స్థితి అంటాడు ప్లేటో.

ఇది మనం నమ్మదగ్గదిగానే వినిపిస్తుంది. అలా వినిపించడానికి కారణం ప్లేటో దాన్ని తార్కిక పదజాలంతో కాక, కవితాత్మక పదజాలంతో వివరించడమే కారణం. డయొటిమా అత్యున్నత సంతోషం గురించీ, సౌందర్యం గురించీ సోక్రటీస్ కు చెప్తున్నప్పుడు, ఆ ఉత్తేజకరప్రసంగాన్ని వింటున్నప్పుడు మనకు తెలీకుండానే మన హృదయంలో కలిగే ఆమోదంలాంటి ఆమోదం మనలో కలగడం మనం గమనించవచ్చు. ఇక్కడ మనలో కలిగిన ఆమోదం, సంభాషణ చివరకు వచ్చేటప్పటికి, ఆల్సిబయడిస్ తన ప్రసంగంలో సోక్రటీస్ సన్నిధిలో తనకు కలిగిన అనుభవం గురించి చెప్పేటప్పటికి ఒక epiphany గా మారిపోతుంది. అది ప్రశ్నల్తో పనిలేని ఒక సాక్షాత్కార క్షణం. ఒక epiphany. ఇటువంటి epiphany సాధారణంగా కథల్లోనో, నాటకాల్లోనో పతాకస్థాయిలో ప్రేక్షకుడు పొందే అనుభూతిలాంటిది. అందుకనే నేను దీన్ని సాహిత్యకృతి అని అంటున్నది.

అయితే, ప్లేటో చెప్పిన అంశాల్ని మనం తార్కికంగా ప్రశ్నించకపోయినా కూడా, ఆయన చెప్పినవన్నీ చెప్పినట్టే నమ్మినా కూడా ఒక ప్రశ్న మిగిలిపోతుంది. అదేమంటే, మనిషి అత్యున్నత సౌందర్యాన్ని సంభావించినప్పుడు, అది మరొక మనిషితోనో, మరొక అస్తిత్వంతోనో సంబంధంలేని నిరపేక్ష సౌందర్యం అయినప్పుడు, ఆ మనిషికి తోటిమనిషితో లేదా ఈ ప్రపంచంతో లేదా చరాచరజీవకోటితో ఇంక నిమిత్తం లేదా? 'రిపబ్లిక్'లో ప్లేటో ఈ ప్రశ్నకి చెప్పిన జవాబేమిటంటే, సత్యాన్ని కనుగొన్న తర్వాత తత్త్వవేత్త తిరిగి సాధారణప్రపంచంలోకి అడుగుపెట్టి పౌరజీవితాన్ని చక్కదిద్దే ప్రయత్నం చేస్తాడు అని. సింపోజియంలో ఆ జవాబు వాచ్యంగా చెప్పకుండా సూక్ష్మంగా సాహిత్యపద్ధతిలో చెప్పాడు.

డయోటిమా ద్వారా అత్యున్నత సత్యం తెలుసుకున్న తరువాత కూడా సోక్రటీస్ అగధాన్ పానగోష్ఠికి రావడమే అందుకు నిరూపణ. అంటే ఏమిటి? సత్యం తెలుసుకున్న తరువాత తత్త్వవేత్త తన తోటిమనుషులకు దాన్ని అందించే ప్రయత్నం, సత్యానికి అనుగుణంగా జీవించడాన్ని అలవర్చే ప్రయత్నం చేస్తాడు. కాబట్టి సింపోజియం ఒక విద్యాసంబంధమైన రచన కూడా. ప్రాచీన గ్రీసులో పురుషుల మధ్య ఏర్పడే ప్రేమ ప్రధానంగా వయసులో పెద్దవాడైన పురుషుడు తనకన్నా చిన్నవాడికి జ్ఞానం అలవర్చడం కోసమే సాంఘిక సమావేశాలూ, పానగోష్ఠులూ కోరుకునేవాడు కాబట్టి, ప్లేటో తన పుస్తకానికి అటువంటి సందర్భాన్నే నేపథ్యంగా తీసుకున్నాడు. అంతే కాదు, సత్యం తెలిసినవాడు దాన్ని కేవలం మాటల్తో మాత్రమే కాదు, ప్రవర్తన ద్వారా కూడా బోధిస్తాడు. సంభాషణ చిట్టచివరలో ఆల్సిబయడిస్ సోక్రటీస్‌కీ తనకీ మధ్య జరిగిన ఉదంతం గురించి చెప్పడమే సాక్ష్యం. ఇందులో మరొక సంగతి కూడా ఉంది. సంభాషణ మొదలవుతూనే

అగథాన్ సోక్రటీస్‌ని తన దగ్గరికి వచ్చి కూచోమని, అతణ్ణి తాకుతూ కూచుంటే, జ్ఞానం తనలోకి నేరుగా ప్రసరిస్తుందనీ అంటే సోక్రటీస్ నవ్వుతూ తాకినంతమాత్రాన ప్రసరించేది జ్ఞానం కానేకాదంటాడు. సంభాషణ ముగిసేముందు, సోక్రటీస్ ఆల్సిబయడిస్‌ని తాకకుండానే అతణ్ణి సత్యానికి ఎలా చేరువగా తీసుకుపోగలిగేడో మనం చూస్తాం. గొప్ప సాహిత్యకృతి లక్షణం ఇది. ఎక్కడ మొదలవుతుందో అక్కడ ముగియడం.

అంతేకాదు, తక్కిన సంభాషణల్లో సోక్రటీస్ చర్చ మొదలుపెట్టి, తనకీ, ఎదటివాడికీ కూడా ఏదీ నిశ్చయంగా తెలియదని చెప్తాడు. కాని ఇక్కడ ఆయన చర్చ మొదలుపెట్టాడుకానీ, దాన్ని మధ్యలోనే వదిలేసి డయొటిమా తనకు బోధించిన రహస్యాన్ని తన మిత్రుల్తో పంచుకున్నాడు. కాని ఆ మాటల్ని తన వ్యక్తిత్వంలో ఇంకించుకున్నాడనీ, సత్యం, చర్చలద్వారాకన్నా కూడా వ్యక్తిగత ప్రవర్తన ద్వారా మరింత స్పష్టంగా బోధ పడుతుందనీ అతడు ఆల్సిబయడిస్‌తో ప్రవర్తించిన తీరుని బట్టి మనకి అర్థమవుతుంది. అందువల్ల సింపోజియం సత్య సౌందర్యాల చర్చగా కనిపించినా నిజానికి ఇది అత్యున్నత నైతిక రచన, శీలనిర్మాణ వాచకం. సోక్రటీస్ యువతరాన్ని పాడుచెయ్యక పోగా వాళ్లని నిజమైన జీవితాదర్శాల వైపుగా నడిపించాడని చెప్పడమే ప్లేటో ఉద్దేశ్యమైతే, ఈ రచన నూటికి నూరుపాళ్ళు సఫలమైదనే చెప్పాలి.

## 5

సింపోజియంలో డయోటిమా సోక్రటీస్‌కి వివరించిన సౌందర్య ప్రయాణాన్ని ascent of desire అని అంటూంటారు. అంటే ఒక సౌందర్య శిఖరారోహణ అన్నమాట. అందులో అత్యున్నత శిఖరానికి చేరుకున్న ఆ సత్యాన్వేషి ఋషిగా మారి ఆ సోపానమార్గంలో కిందకి దిగి తన తోటిమనుషులకు తిరిగి ఆ దారిగురించి బోధిస్తాడని మనకి సింపోజియం చెప్పకనే చెప్తుంది. మనుషుల పట్ల ప్రేమలేకపోతే ఆ ఋషి తిరిగి మళ్ళా ఈ సాధారణ జీవితంలో అడుగుపెట్టవలసిన పనే లేదు. తైత్తిరీయ ఉపనిషత్తులో అన్నమయకోశంతో మొదలుపెట్టి పంచకోశ జాగృతి పొందిన తర్వాత, సాధకుడు ఆనందమే బ్రహ్మం అని తెలుసుకున్నాక, మరలా అన్నాన్ని స్తుతించడం లాంటిదే ఇది.

ప్రేమ అంటే అది. సత్యాన్ని తెలుసుకోడానికి చేసే ప్రయాణానికి ప్రేమ ఎలా కారణమో, తెలుసుకున్న సత్యాన్ని తిరిగి తనతోటిమనుషుల్తో పంచుకోవాలనుకోడానికి కూడా ప్రేమనే కారణం. ఆ ప్రేమనే సోక్రటీస్‌ను ఏథెన్సు వీథుల్లో తిప్పింది. చివరకు మృత్యువు ఎదట నిలబెట్టింది.

కంటికి కనిపిస్తున్న సత్యమే సత్యమని సోక్రటీస్ నమ్మనందువల్లనే ఆయన మృత్యుముఖంలో ధీరుడిగా నిలబడ్డాడని మనం చెప్పుకుంటాం. కాని ఆ ధీరత్వానికి కారణం ప్రేమ కూడా. ఎందుకంటే, తాను తెలుసుకున్న జ్ఞానం తన శీలంగా పరిణమించకపోతే, తన సత్యానికి విలువ ఉండదు. అప్పుడు తాను అంతదాకా తన శిష్యులకి ఏ విలువల గురించి, ఏ సౌందర్యం గురించి, ఏ నైతికత గురించి బోధించాడో అవన్నీ అబద్ధాలైపోతాయి. కాబట్టి ఆయన తన తోటిమనుషుల పట్ల ఉన్న అపారమైన ప్రేమవల్లనే మృత్యువును ధీరుడిగా స్వాగతించాడు.

నా జీవితంలో మృత్యువును అంత ధీరత్వంతో స్వాగతించినవాళ్లను మా నాన్నగారిని, మా అమ్మని చూసాను. ఈ మధ్యనే కల్యాణి నీలారంభంగారిని చూసాను.

కల్యాణిగారు నాకు ఫేస్ బుక్ ద్వారా 2015 లో పరిచయమయ్యారు. కాని రెండేళ్ళ కిందట ఆమె విశాఖపట్టణం నుండి విజయవాడ వచ్చిన తరువాత ఆమెని ప్రత్యక్షంగా కలుసుకోగలిగాను. చాలాసార్లు మాట్లాడుకునే అవకాశం కూడా లభించింది. విజయవాడలో ఆమె ఉంటున్న గ్రీన్ స్పేస్ ఎంక్లేవ్ అపార్ట్ మెంటులోనే మా అక్కా, వసుధారాణిగారు కూడా ఉంటున్నందువల్ల, వారు ముగ్గురూ ఈ రెండేళ్ళుగా ఎంతో ఆత్మీయంగా సాహిత్యచర్చలు చేస్తూ ఉండేవారు. ఆ సంభాషణల్లో ఎంతో గాఢతా, ఆత్మీయతా కలగలసి ఉండేవి.

నేను విజయవాడ వెళ్ళినప్పుడల్లా ఆ ఆత్మీయగోష్ఠి నాకు కన్నులపండువలాగా ఉండేది. కిందటేడాది నేను మార్కస్ అరీలియస్ మెడిటేషన్స్ మీద నా ఆలోచనలు రోజూ నా బ్లాగులో పోస్టు చేస్తున్నప్పుడు, ఆమె దాదాపుగా ప్రతి ఒక్కరోజూ స్పందిస్తూనే వచ్చారు. 'నేను ఆ వ్యాఖ్యానాన్ని ఒక పుస్తకంగా తేవాలనుకుంటున్నాను. మీరు దానికొక ముందుమాట రాయండి' అని అడిగాను. అప్పుడు చెప్పింది మా అక్క, కల్యాణిగారు కేన్సర్ బారినపడ్డారని, ఆమె ఎక్కువ కాలం బతికే అవకాశం తక్కువనీ. ఆ వార్త నాకు తెలిసిన తర్వాత కూడా ఆమెని చూసాను, మాట్లాడేను. కాని ఆమె వదనంలోగాని, హృదయంలోగాని మృత్యువు ఆమె ఇంటిముందు నిలబడి ఉన్న సూచనలు ఎక్కడా కనిపించలేదు.

కానీ కల్యాణిగారు నా అభ్యర్థనని మర్చిపోలేదు. నాలుగైదు నెలలకిందట నేను నా బ్లాగులో 'ఆ వెన్నెల రాత్రులు' నవల సీరియల్‌గా రాసినప్పుడు ఆమె ఆ పుస్తకానికి ముందుమాట రాసి పంపించారు. ఆమెనుంచి ఇ-మెయిల్లో ఆ ముందుమాట అందుకున్నప్పుడు 'శీతవేళ రానీయకు, శిశిరానికి చోటీయకు' అన్న మహాకవి మాటలు గుర్తొచ్చాయి.

తాను మరెంతో కాలం, ఇంకా చెప్పాలంటే మరెన్నో రోజులు, బతకనని తెలిసినా కూడా ఆమె జీవితోత్సాహంలోగాని, మనుషుల పట్ల ఆమె ప్రేమలోగాని ఎటువంటి మార్పూ కనబడలేదు. ఆమె ఈ లోకం నుంచి నిష్క్రమించడానికి మూడు రోజులముందు మా అక్క నన్ను ఆమెదగ్గరకు తీసుకువెళ్ళింది. ఆ ముందు రోజే వైద్యులు ఆమె ఏ క్షణాన్నైనా కన్నుమూయగలదని చెప్పారని ఆమెకి తెలుసు. కాని ఆరోజు ఆమె నాతో తన తల్లిగారి గురించి ఎంత ప్రశాంతంగా, ఎంత గర్వంగా, ఎంత సంతోషంగా మాట్లాడేమాట్లాడారంటే, ఆ మాటలు విన్నవాళ్ళు ఆమె మూడురోజుల తర్వాత ఈలోకం నుంచి కనుమరుగు కాగలదని నమ్మలేరు.

మాటల మధ్యలో 'నాకొక చిన్న సహాయం చెయ్యగలరా?' అనడిగారు ఆమె. ఏమిటన్నాను. ఆమె రెండునెలలకిందట బెంగుళూరు లో 'రంగశంకర'కు వెళ్లారట. సాధారణంగా అక్కడ నాటక ప్రదర్శన పూర్తయ్యాక నిర్వాహకులు  ఒక మైసూరు మల్లెమొక్కని ప్రేక్షకుల్లో ఎవరికేనా బహుమతిగా ఇస్తుంటారట. ఆ రోజు ఆ మల్లెమొక్క కల్యాణిగారి చేతుల్లో పెట్టారుట. అది అనుకోకుండా ఆమెకి లభించిన కానుక. 'ఆ మొక్కని మీకు ఇవ్వాలనుకుంటున్నాను, దాన్ని తీసుకుంటారా?' అనడిగారు ఆమె. నాకు ఆ క్షణాన, ప్లేటో రాసిన ఫీడోలో సన్నివేశం గుర్తొచ్చింది.

అక్కడ సోక్రటీస్ చివరిక్షణాల్లో తన శిష్యుడు క్రీటో వైపు తిరిగి తాను గ్రీకుల ఆరోగ్యదేవత అక్లిపియస్‌కు ఒక కోడిపుంజుని మొక్కుకున్నాననీ, ఆ మొక్కుతీర్చమనీ అడుగుతాడు. అవే ఆయన చివరిమాటలు.

మృత్యువు ఎదట కల్యాణి గారు చూపించిన ధీరత్వం ఆ చివరి రోజులకీ, ఆ చివరి క్షణాలకీ మాత్రమే పరిమితం కాదు. నిజానికి గత రెండేళ్ళుగా ఆమె విజయవాడలో గ్రీన్ స్పేస్ ఎంక్లేవ్ అపార్టుమెంటులో రెండో ఫ్లోరు, మూడో ఫ్లోరుల్ని ఏథెన్సు వీథులుగా మార్చేసారు. ఆమెని ప్రాణప్రదంగా, కంటికి రెప్పలాగా చూసుకున్న వసుధారాణిగారితో పాటు మా అక్కతో కూడా కలిపి ఆ ముగ్గురూ ఎడతెగని ప్రేమగోష్ఠి సాగించారు. సాహిత్యాన్ని ప్రేమించేవారందరికీ ఈ రెండేళ్ళ పాటు అదొక అమృతపానగోష్ఠిగా నడిచింది.

ఆమెని నేను చూసిన ఆ చివరిరోజు కూడా ఆమె మృత్యువుని ఇంట్లోకి అడుగుపెట్టనివ్వకుండా గడప దగ్గరే ఉండిపొమ్మని శాసించినట్టే ఉన్నారు. ఆమె ఈలోకం నుండి సెలవుతీసుకున్నాక తన శరీరాన్ని ఒక మెడికల్ కాలేజికి ఇచ్చెయ్యమని అడిగారనీ, అదే ఆమె చివరికోరిక అనీ విన్నాను. ఒక మనిషి జీవిస్తే అలా జీవించాలి, నిష్క్రమిస్తే అలా నిష్క్రమించాలి.

సింపోజియంలో డయొటిమా సోక్రటీసుతో చెప్పిన ఒక మాట చాలా కీలకం. ప్రేమ మనమనుకున్నట్టుగా కేవలం సౌందర్యంపట్ల ప్రేమ మాత్రమే కాదు, అది సౌందర్య ప్రజననానికి సంబంధించింది అని ఆమె చెప్పింది. అంటే మనిషి సౌందర్యాన్ని ప్రభవింప చెయ్యగలడు. ఒక మర్త్యప్రాణి సౌందర్యానికి జన్మనివ్వడం ద్వారా మాత్రమే అమరత్వాన్ని పొందగలడు. మామూలు మనుషులు మర్త్యులైన మనుషుల్ని పుట్టించడంతో ఆగిపోతే, సత్యాన్వేషులు, నిజమైన ప్రేమాన్వేషులూ పరిపూర్ణసౌందర్యానికి జన్మనిస్తారని డయోటిమా చెప్తున్నది. కల్యాణిగారు తన మిత్రులిద్దరితో కలిసి చేసింది ఆ పరిపూర్ణ సౌందర్యాన్వేషణమే.

ప్రేమగోష్ఠిలో డయొటిమా చేసిన ఈ ప్రసంగం చదవగానే మిత్రులు సుమలత సత్తూరు గారు 'సౌందర్యలహరి' అని అనకుండా ఉండలేకపోయారు.

ఈ సౌందర్యలహరిని కల్యాణి నీలారంభంగారిస్మృతికి కానుక చేస్తున్నాను.

హైదరాబాదు **వాడ్రేవు చినవీరభద్రుడు**

శరన్నవరాత్రులు,

10-10-2023

# ప్రేమగోష్ఠి



కాని ఆ యథార్థసౌందర్యాన్ని చూడటానికి కళ్ళుండాలేగాని, ఆ దివ్యసౌందర్యం, ఆ నిర్మల, స్ఫటికస్వచ్ఛసౌందర్యం– మర్త్యత్వపు మాలిన్యాలంటని, మానవజీవితపు వన్నె చిన్నెలు, హంగు పొంగులు దరిచేరలేని ఆ సౌందర్యాన్ని చూడటానికి నోచుకో గలిగితే, సదా ఆ సరళ, సత్య, దివ్యసౌందర్యంతోటే సదా సంభాషిస్తో ఉండిపోగలిగితే!

## సంభాషణలో పాల్గొన్నవారు

అపోల్లోదోరస్, అతడు అరిస్టోడెమోస్ ద్వారా తాను విన్న సంభాషణలను తన సహచరుడికి తిరిగి చెప్తాడు. తిరిగి మళ్ళా గ్లోకన్‌కు మరోసారి చెప్తాడు. ఈ సంభాషణలో పాల్గొన్న తక్కిన వారు, ఫేద్రోస్, పౌసీనియస్, ఎరిక్సిమేకస్, అరిస్టోఫెనీస్, అగథాన్, సోక్రటీస్, ఆల్సిబయాడిస్, మరికొందరు పానోన్మత్తులు.

## స్థలం

అగథాన్ ఇల్లు

**నువ్వడిగిన** సంగతుల గురించి చెప్పడానికి నా దగ్గర ఎంతోకొంత సమాచారం లేకపోలేదు. మొన్న సాయంకాలం నేను నా ఇంటిదగ్గరినుంచి నగరంలోకి వస్తున్నప్పుడు నాకు తెలిసినవాడొకడు నన్ను వెనకనుంచి చూసి గుర్తుపట్టి గట్టిగా అరవడం మొదలుపెట్టాడు. 'అపొల్లోదొరోస్, ఆగు ఆగు' అంటో గట్టిగా అరిచాడు. నేను ఆగాను.

అప్పుడతను నాతో 'అపొల్లోదొరోస్! నేను నీ కోసమే వెతుక్కుంటున్నాను, అగథాన్ ఇచ్చిన విందులో ప్రేమని కీర్తిస్తూ సోక్రటీస్ చేసిన ప్రసంగం గురించి నిన్ను అడగాలని నీకోసమే వెతుక్కుంటున్నాను. ఆ విందులో ఆల్సిబయాడిస్‌తో పాటు ఇంకా చాలామంది ఉన్నారట కదా. ఇదంతా ఫిలిప్పు కొడుకు ఫోనిక్స్ ఎవరికో చెప్తే వాడు నాకు చెప్పాడు. కానీ వాడు చెప్పింది నాకేమీ అంత అర్థం కాలేదు. అయితే ఈ వివరాలన్నీ నీకు తెలుసని నాతో చెప్పాడు. అందుకని నేరుగా నువ్వు చెప్తే వినాలని నీ దగ్గరకొచ్చాను. నీ స్నేహితుడి చేసిన ప్రసంగం గురించి నువ్వు కాక ఇంకెవరు బాగా చెప్పగలుగుతారు? అన్నిటికన్నా ముందొక సంగతి చెప్పు, మా వాడు చెప్పినట్టుగా, నువ్వు ఆ గోష్ఠిలో ఉన్నావా?'

ఆ మాటలు విని నేనతడితో 'గ్లోకెన్, నువ్వు చెప్పేది మరీ కలగాపులగంగా ఉంది. మొదటిదేమిటంటే ఆ విందు ఏదో నిన్న మొన్న జరిగినట్టు ఊహించుకుంటున్నావు, రెండోది నేనక్కడున్నట్టుగా అనుకుంటున్నావు' అని అన్నాను.

'ఏం? ఎందుకని? నువ్వక్కడ ఉండే ఉంటావనుకున్నాన్నేను'.

'అస్సల్లేదు' అన్నాను.

ఇంకా ఇలా చెప్పాను 'నీకు తెలీదా, చాలా ఏళ్ళబట్టీ అగథాన్ ఏథెన్సులో ఉండటం లేదనీ, నాకు సోక్రటీస్ పరిచయమై, నా నిత్యజీవితంలో ఆయన భాగమై మూడేళ్ళు కూడా కాలేదనీ. నా జీవితంలో కూడా ఒక సమయముండేది, అప్పట్లో నేను ఏదో

పెద్దపెద్ద వ్యవహారాల్లో తలమునకలయి ఉన్నవాడిలాగా, కానీ నిజానికి, ఏ పనీ లేకుండా, ఇదుగో నువ్వు తిరుగుతున్నావే, అలా ఊరికినే పొద్దుపుచ్చుతూ ఉండేవాణ్ణి. ఆ రోజుల్లో నేనేదో ఒకటవ్వాలని అనుకునేవాణ్ణిగాని తత్త్వవేత్తను కావాలని మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ అనుకోలేదు'.

'సరిలే, ఈ వేళాకోళం మాటలకేంగానీ, ఇంతకీ ఆ గోష్ఠి ఎప్పుడు జరిగిందో చెప్పు'.

'నా కౌమార దినాల్లో' అని అన్నాను. 'అప్పట్లో అగథాన్ తాను రాసిన విషాదాంత నాటకానికి బహుమతి[3] గెల్చుకున్న మరుసటి రోజున, తను, తన నాటకబృందంతో కలిసి ఆ విజయాన్ని వేడుకగా జరుపుకోడానికి ఒక విందు ఏర్పాటు చేసినప్పుడు.'

'అలా అయితే అది చాలా కాలం కిందటన్నమాటే. మరి ఆ సంగతులన్నీ నీకెవరు చెప్పారు? సోక్రటీసునా?'

'కానేకాదు, నిజానికి ఆ ముచ్చట్లు ఫోనిక్సుకి ఎవరు చెప్పారో ఆయనే నాకూ చెప్పాడు. సిడతేనియంకి చెందిన డెమి నుంచి వచ్చిన అరిస్టోడెమొస్. ఆయన కూడా అప్పటికి చిన్నపిల్లాడే. కాళ్లకి చెప్పులు కూడా తొడుక్కునేవాడు కాదు. అగథాన్ ఇచ్చిన విందులో ఆయన కూడా ఉన్నాడు. ఆ రోజుల్లో సోక్రటీస్‌కి ఆయన్ని మించిన మరొక ఆరాధకుడు లేడనిచెప్పుకునేవారు. ఆయన్నుంచి ఆ సంగతులు విన్నాక ఆ కథనంలో కొన్ని భాగాలు నిజమేనా అని సోక్రటీస్ అని అడిగాను. సోక్రటీస్ అవి నిజమే అన్నాడు' అని అన్నాను.

'అలా అయితే ఆ కథంతా మరోసారి మనం చెప్పుకుందామా' అనడిగాడు గ్లోకెన్. "ఏథెన్సులో రహదారులు ఉన్నది ఇటువంటి కథనాల కోసమే కదా ? అప్పుడు మేము ఆ ప్రేమగోష్ఠి గురించి మాట్లాడుకుంటో నడవడం మొదలుపెట్టాం. కాబట్టి నేను నీతో ముందేచెప్పినట్టుగా నువ్వడిగినదానికి జవాబివ్వడానికి నా దగ్గర సమాచారం లేకపోలేదు. నువ్వడిగావు కాబట్టి మరోసారి ఆ కథనమంతా నెమరేసుకుందాం.'

ఎందుకంటే తత్వశాస్త్రం గురించి వినడమన్నా, మాట్లాడడమన్నా నాకు చాలా చాలా ఇష్టం. అది లాభసాటి అవునా కాదా అన్న ఆలోచన నాకెప్పటికీ తోచదు. అదే మరో రకమైన సంభాషణలనుకో, అంటే మీలాగా డబ్బున్నవాళ్ళూ, వ్యాపారస్థులూ మాట్లాడుకునేమాటలన్న మాట– అవి వినడానికి నాకు చాలా రోతపుట్టిస్తాయి. అందులోనూ మీలాంటి సహచరుల్ని తలుచుకుంటే నాకు జాలేస్తుంది. మీరేదో చేస్తూ ఉన్నామని చెప్పుకుంటూ ఉంటారుగాని నిజానికి మీరు చేసేదేమీ ఉండదు.

అయితే నాకు ఈ సంగతి కూడా తెలుసు. నేను మిమ్మల్ని చూసి జాలిపడ్డట్టే మీరు కూడా నన్ను చూసి వీడో తృప్తి లేని ప్రాణి అని అనుకుంటూ ఉంటారని కూడా తెలుసు. బహుశా మీరలా అనుకోడంలో తప్పులేకపోవచ్చు కూడా. కాని ఒక తేడా ఉంది. మీరు నా గురించి అనుకునేది వట్టి ఊహ మాత్రమే. కాని నేను మీగురించి అనుకునేది వట్టి ఊహ కాదు, జ్ఞానం.'

సహచరుడు: 'అపొల్లోదోరస్, నువ్వెప్పట్లానే నీ గురించీ, పక్కవాళ్ళ గురించీ కూడా వేళాకోళంగా మాట్లాడుతునే ఉంటావు. నీకు మనుషులంటే ఎందుకో చాలా జాలీ, చిన్నచూపూను, ఒక్క సోక్రటీస్ పట్ల తప్ప. నిన్ను పిచ్చివాడని ఎందుకంటారో నాకర్థం కాదు. ఎందుకంటే ఒక్క సోక్రటీస్‌ని మినహాయిస్తే నీకు నీతో సహా ప్రతి ఒక్కళ్ళ పట్లా ఎందుకో చెప్పలేనంత అసహనం.'

అపొల్లోదోరస్: 'నిజమే, మిత్రమా, నన్ను పిచ్చివాడనడానికి, ఇదిగో, ఇప్పుడు చెప్పానే, నా గురించీ నీ గురించీ నా అభిప్రాయాలు, అవి చాలు, వేరే సాక్ష్యాలక్కర్లేదు.'

సహచరుడు: 'సరే, ఆ మాటలింక కట్టిపెట్టి నేను అడిగినట్టు ఆ సంభాషణ నాకోసం మరో సారి తిరిగి వినిపించు.'

అపొల్లోదోరస్: 'మంచిది. ఆ ప్రేమకథ ఎలా నడిచిందంటే- కాని అసలు ఆ చర్చంతా ఎక్కడ మొదలయ్యిందో అక్కణ్ణుంచీ చెప్పడం మంచిదనుకుంటాను. అరిస్టొడెమస్ చెప్పిన మాటల్లో సరిగ్గా చెప్పాలంటే-

అతడు సోక్రటీసుని చూడ్డానికి వెళ్ళేటప్పటికి సోక్రటీసు అప్పుడే స్నానం చేసి చెప్పులు తొడుక్కుంటూ ఉన్నాడట. ఆయన చెప్పులు తొడుక్కోడం మామూలుగా కనిపించే దృశ్యం కాదుకాబట్టి మావాడు సోక్రటీసుని ఏమట్లా పెళ్ళికొడుకులాగా తయారై ఎక్కడికి బయల్దేరారు అని అడిగాడట. అప్పుడు సోక్రటీస్-

'అగథాన్ ఇవ్వబోతున్న విందుకి వెళ్తున్నాను' అని చెప్పాడు. 'అతడు సాధించిన విజయాన్ని వేడుకచేసుకోడం కోసం ఆ విందుకి రమ్మని పిలిస్తే నిన్న నేను రానని చెప్పాను. ఎందుకంటే నిన్న అక్కడ బాగా తొడతొక్కిడిగా ఉంటుందని భయపడ్డాను. అందుకని ఇవాళ వస్తానని చెప్పాను. మరి ఆయనలాంటి పెద్దమనిషి విందు ఏర్పాటు చేసినప్పుడు నేను కూడా చక్కగా తయారవ్వాలి కదా. సరే, వాళ్ళు నిన్ను పిలవలేదుగానీ, నాతో పాటు రాడానికి నీకేమన్నా అభ్యంతరమా?'

'మీరు రమ్మంటే వస్తాను అన్నాన్నేను.'

'అయితే రా, పోదాం. అదేదో సామెత ఉందే, దాన్నివ్వాళ పూర్తిగా రద్దుచేసిపారేద్దాం. ఆ సామెత గుర్తుంది కదా: తక్కువవాళ్ళిచ్చే విందుకి గొప్పవాళ్ళు పిలవకుండా పోకూడదు అని. ఆ సామెత బదులు మనమో కొత్త సామెత మొదలుపెడదాం: 'మంచివాళ్ళిచ్చే విందుకి మంచివాళ్ళు పిలవకున్నా పోతారు' అని

'ఈ సామెతని నేను మారుస్తున్నాను అనుకునేవు, లేదు హోమర్ [4] కూడా ఈ మాటలు ఒప్పుకుని తీరతాడు. ఆయనైతే పాతసామెతని ముక్కలు చేసి పక్కన పారేసి కొత్తసామెతని కవిత్వంలో చెప్తాడు కూడా. గుర్తుందా, ఆగమెమ్నాన్‌ని మనుషుల్లో వీరాధివీరుడిగా చిత్రించేక, ఆగమెమ్నాన్ [5] ఇచ్చే విందుకి దుర్బలవీరుడైన మీనిలాస్[5] కూడా పిలవకుండానే వచ్చినట్టు చెప్తాడు. బలుల్తోనూ, నైవేద్యాలతోనూ ఇచ్చే ఆ విందుకి చిన్నవాళ్ళదగ్గరికి పెద్దవాళ్ళు వచ్చినట్టుకాదు, పెద్దవాళ్ళదగ్గరికి చిన్నవాళ్ళే వచ్చినట్టన్న మాట.'

'కానీ సోక్రటీస్ చూడబోతే ఇది నా గురించే చెప్పినట్టుంది.ఎందుకంటే హోమర్ మీనిలాస్ గురించి చెప్పినట్టుగా నేనిక్కడ చిన్నవాణ్ణి, కాబట్టి–

'పెద్దవాళ్ళిచ్చే విందుకి పిలవకుండానే వెళ్ళినట్టు.'

కాని నన్ను పిలిచింది నువ్వు. కాబట్టి దీన్ని నువ్విట్లా మార్చవలసి ఉంటుంది:

'ఇద్దరూ కలిసి వెళ్ళినట్టు.'

అతడలా హోమర్ పద్ధతిలో జవాబిచ్చాక, వాళ్ళిద్దరిలో ఎవరో ఒకరు ఏదో ఒక సాకువెతుక్కుంటూ,మాట్లాడుకుంటో ముందుకు సాగారు. ఇంతలో సోక్రటీస్ ఏదో ధ్యానంలో పడిపోయి వెనకబడ్డాడు. తనతో పాటు వస్తున్న అరిస్టొడెమస్‌ను తన కోసం ఆగకుండా ముందుకు పదమన్నాడు. అతడు అగథాన్ ఇంటికి చేరుకునేటప్పటికి ఆ ఇంటి తలుపులు బార్లా తెరిచి వున్నాయి. అప్పుడే ఓ తమాషా సంఘటన జరిగింది.

అతణ్ణి స్వాగతించడానికి వచ్చిన సేవకుడు అతణ్ణి విందుగదిలోకి తీసుకువెళ్ళాడు. అక్కడ అప్పటికే చేరుకున్న అతిథులు తమ తమ ఆసనాల మీద వెనక్కి జారగిలి విశ్రాంతి తీసుకుంటూ ఉన్నారు. ఇంకా విందు మొదలు కావలసి ఉంది. అతణ్ణి చూస్తూనే అగథాన్ 'స్వాగతం అరిస్టొడెమస్, సరిగ్గా సమయానికి వచ్చావు, నువ్వింకేదన్నా పనిమీద వచ్చి ఉంటే, కాసేపు ఆ విషయం మర్చిపో. నిన్ననే నిన్ను తలుచుకున్నాను. నువ్వు నాకు కనబడి ఉంటే రమ్మని పిలిచి ఉండేవాణ్ణి కూడా. ఇంతకీ సోక్రటీస్‌ని ఏం చేసావు?' అని అడిగాడు.

'నేను వెనుదిరిగి చూద్దును కదా, సోక్రటీస్ కనిపించడే. ఆయన క్షణం కిందటిదాకా

నాతోనే ఉన్నాడనీ, ఆయన రమ్మంటేనే నేను ఆయనతో కలిసి విందుకు బయల్దేరాననీ చెప్పాను.'

'నువ్వొచ్చి మంచిపనిచేసావు' అన్నాడు అగథాన్,

'కాని ఆయనేడీ?'

## *2*

'నేను ఇంట్లో అడుగుపెడుతున్నప్పుడు ఆయన నా వెనకనే ఉన్నాడు. ఇంతలోనే ఏమయ్యిందో నాకు అర్థం కావడం లేదు.'

'అబ్బాయీ, పోయి ఆయన ఎక్కడున్నాడో వెతికి పట్టుకుని కూడా తీసుకురా' అని అగథాన్ తన పరిచారకుడికి పురమాయించి నాతో 'ఈలోగా అరిస్టోడెమస్, ఇప్పటిదాకా ఎరిక్సిమేకస్ కూచుని వెళ్ళిన చోట నువ్వు కూచో' అని అన్నాడు . అప్పుడు ఒక పరిచారకుడు అతడికి కాళ్ళూ చేతులూ కడుక్కోడానికీ, ఆ తర్వాత విశ్రాంతి తీసుకోడానికీ దగ్గరుండి సాయం చేసాడు. ఈలోపు మరొక పరిచారకుడు లోపల అడుగుపెట్టి సోక్రటీస్ పక్కింటి వాళ్ల గుమ్మం దగ్గర కనబడ్డాడని చెప్పాడు. 'ఆయనేమిటో అక్కడే దిగబడిపోయాడు. ఎంత పిలిచినా ఉలకడం లేదు, పలకడం లేదు' అని చెప్పాడు.

'చిత్రంగా ఉందే' అన్నాడు అగథాన్, 'అయినా సరే నువ్వు పోయి ఆయన్ని పిలుచుకురా, నీకు జవాబిచ్చేదాకా పిలుస్తూనే ఉండు'.

'ఆయన్ని కొంతసేపు ఆయన మానానికి ఆయన్ని అలానే వదిలెయ్యండి' అని అన్నాడు నా మిత్రుడు. 'ఏ కారణం లేకుండానే అప్పుడప్పుడు అలా ఆగిపోతూండటం ఆయనకి అలవాటే. తొందరలోనే వస్తాడు లెండి. ఆయన్నిప్పుడేమీ కదిలించకండి' అని అన్నాడు.

'సరే. నువ్వు చెప్పినట్టే కానివ్వు' అని అన్నాడు అగథాన్. అప్పుడు తన సేవకుల వైపు తిరిగి 'విందు మొదలుపెడదాం. ఆయన కోసం ఆగొద్దు. నేనిప్పటిదాకా మిమ్మల్ని మీ ఇష్టానికి వదిలిపెట్టింది లేదుగాని, ఇప్పుడు మాత్రం మీకు ప్రత్యేకంగా ఆజ్ఞలిచ్చేవాళ్లెవరూ లేరు. అదీకాక, ఈ సందర్భంలో మీరే ఈ విందు ఏర్పాటు చేస్తున్నట్టుగా ఊహించుకోండి. నాతోపాటు ఈ మిత్రులంతా మీ అతిథులని అనుకోండి. మమ్మల్ని బాగా చూసుకోండి. మా ప్రశంసలకి పాత్రులు కండి' అని అన్నాడు.

విందు వడ్డన మొదలయ్యింది. కాని సోక్రటీసు ఇంకా రాలేదు. విందు

నడుస్తున్నంతసేపూ అగథాన్ సోక్రటీస్‌ని వెతికిపట్టుకుని తీసుకురాడానికి ఎవరో ఒకరిని పంపాలని అనుకుంటూనే ఉన్నాడుగాని, అరిస్టొడెమస్ వారిస్తూనే ఉన్నాడు. ఎట్టకేలకు, విందు దాదాపు సగం గడిచిపోయేక సోక్రటీసు ప్రవేశించాడు. అతణ్ణి కమ్మేసిన ధ్యానం ఈసారి మరీ ఎక్కువసేపు అతణ్ణి ఆవహించినట్టులేదు. విందుబల్లకి మరీ ఆ కొసన తీరిగ్గా కూచుని విందారగిస్తున్న అగథాన్ అతణ్ని చూస్తూనే తన పక్కన వచ్చి కూచోమని అర్థించాడు.

'నువ్విక్కడ కూచుంటే నేన్నిన్ను దగ్గరగా స్పృశించినట్టుగా ఉంటుంది. నువ్వు గుమ్మం దగ్గర ఉన్నప్పుడు నీలో ప్రవేశించిన ఆ మంచిఅలోచనలేవో, ఇప్పుడు నీ నీ లోపలకి ఇంకిపోయి ఉంటాయి. అవేవో నాక్కూడా కొంత దొరికినట్టు ఉంటుంది. నువ్వు వెతుక్కుంటున్నదేదో నీకు దొరక్కపోతే నువ్వు ఇక్కడికి వచ్చి ఉండేవాడివే కావని నాకు తెలుసు' అన్నాడు.

'ఒక సంపూర్ణమానవుడు తాకితేచాలు ఒక బోలుమనిషిలోకి వివేకం ప్రవేశించేమాట నిజంగా నిజమైతే ఎంతబాగుణ్ణు' అన్నాడు సోక్రటీస్, అగథాన్ కోరుకున్నట్టే అతడి పక్కన కూచుంటో.

'నిండుకలశంలోంచి ఖాళీపాత్రలోకి నీళ్ళు వడగట్టినట్టు, అలా వివేకం ప్రవహించే మాటనే నిజమైతే, నీ పక్కన కూచునే అదృష్టానికి నేనెంత సంతోషిస్తానని! ఎందుకంటే అలా ప్రవహించడమే గనక జరిగితే నీ వల్ల నాలోకి మరింత శుభప్రద జ్ఞానస్రవంతిని ప్రవహింపచేసి ఉండేవాడివి. నా జ్ఞానమంటావా, అది మరీ తేలికపాటిది, అనిశ్చయం కూడా. స్వప్నసదృశం. కానీ నీ జ్ఞానం ప్రకాశమానం, ఆశాభరితం, తన యవ్వనవైభవంలో అదెంత అలరారుతున్నదో మొన్ననే కదా చూసాం. మేమొక్కళ్ళమేనా? ముప్పైవేలమంది యవనులు కూడా తిలకించారు ఆ వైభవాన్ని' అని అన్నాడు.

'నువ్వు నన్ను ఆటపట్టిస్తున్నావు సోక్రటీస్' అన్నాడు అగథాన్. 'లేదంటే మనలో ఎవరి అరచేతిలో జ్ఞానరేఖ ఉందో తేల్చమని ఇదుగో ఈ డయోనిసస్ ని అడుగుదాం. కాని ముందు నువ్వు భోంచెయ్యి' అని అన్నాడు.

## 3

సోక్రటీస్ అక్కడ ఆసీనుడై తక్కినవారితో కలిసి విందు ఆరగించాడు. ఆ తర్వాత తర్పణలు ఇచ్చారు. దేవుడికి ప్రార్థనాగీతం ఆలపించాక, మామూలుగా నడిచే క్రతుకాండ అంత నడిచాక, ఇక మధుపానానికి సమాయత్తులవుతుండగా, పౌసనియస్ అన్నాడు కదా

'మిత్రులారా, చెప్పండి, మనల్ని మనం మరి ఇబ్బంది పెట్టుకోకుండా తాగే మార్గమేదన్నా ఉందా? నిన్న తాగినదానికే ఇవాళంతా నా కడుపులో ఎలానో ఉంది. దాన్నుంచి తేరుకోడానికి కొంత సమయం పట్టేట్టు ఉంది. నిన్న విందుకు వచ్చినవాళ్ళల్లో మీలో చాలామంది పరిస్థితి కూడా అదేనని నా అనుమానం. కాబట్టి ఆలోచించండి. మరీ ఇబ్బందిపడకుండా తాగడమెట్లాగు?' అని అడిగాడు

'అవును. నాక్కూడా అదే అనిపిస్తోంది' అన్నాడు అరిస్టొఫెనీజ్. 'మనం మరీ ఎక్కువగా తాగడకుండా ఉంటే మంచిది. నిన్న మరీ పీకలదాకా తాగేసాను' అని కూడా అన్నాడు.

'నువ్వు సరిగ్గానే చెప్పావు' అన్నాడు ఎరిక్సిమేకస్. అకుమెనస్ కొడుకు అతడు. 'ఇంకొకళ్ళెవరైనా కూడా తమ అభిప్రాయం చెప్తే బాగుంటుంది. అగథాన్‌కి పర్వాలేదా తాగితే ఏమీ అవదా?' అని అడిగాడు.

నాకు అంత చేతకాదన్నాడు అగథాన్.

'అలా అయితే మనలాంటి బలహీనులు, అంటే అరిస్టొడెమస్, ఫేద్రోస్ లాంటివాళ్ళు, అస్సలు తాగలేనివాళ్ళు అదృష్టవంతులన్నమాట' అని అన్నాడు ఎరిక్సిమేకస్.

'ఎందుకంటే బాగా తాగగలిగినవాళ్లు ఇవాళ తాగాలన్న ఉత్సాహంలో లేరు. (నేనిందులో సోక్రటీసుని చేర్చడం లేదు. ఆయన తాగగలడూ, తాగకుండా ఉండనూగలడు, ఏదైనా అతడికి సమానమే). కాబట్టి ఇవాళ మన బృందం తాగడం పట్ల ఏమంత మొగ్గు చూపడం లేదు కాబట్టి, ఒక మాట చెప్పాలనుకుంటున్నాను.

నేను వైద్యుణ్ణి కాబట్టి ఇలా చెప్తున్నందుకు ఏమీ అనుకోకండి. మరీ అతిగా తాగడం మంచి అలవాటు కాదు. నేను అతిగా తాగను, ఎవరినీ తాగమని అస్సలు చెప్పను. ఇంకా నిన్నటి మత్తులోంచి తేరుకోనివాళ్ళకైతే ససేమిరా చెప్పను' అని అన్నాడు.

'నేను కూడా నువ్వు చెప్పినట్టే చేస్తాను' అన్నాడు మిరునియన్‌కి చెందిన ఫేద్రోస్. 'అదీకాక నువ్వు వైద్యుడివి కూడాను. తక్కినవాళ్ళు కూడా తెలివైనవాళ్ళయితే నువ్వు చెప్పినట్టే వింటారు' అని కూడా అన్నాడు.

దాంతో ఆ పూటకి తాగడం పక్కన పెట్టాలనీ, అయినా ఎవరైనా తాగాలనుకుంటే, తమకి చాతనయినంతమాత్రమే తాగాలనీ తీర్మానించుకున్నారు.

'కాబట్టి ఈరోజు ప్రతి ఒక్కరూ మర్యాదకి తాగవలసిన పనిలేదనీ, ఎవరికిష్టమైతే వారు తాగొచ్చనీ అనుకున్నాం కాబట్టి, ఇదుగో, ఈ పిల్లంగోవి ఊదుతున్న అమ్మాయిని కూడా ఇక్కణ్ణుంచి వెళ్ళిపొమ్మని చెప్దాం. ఆమె పాడుకుంటే తనకోసం తను పాడుకోవచ్చు

లేదా అంతఃపురంలోకి పోయి అక్కడ ఊదుకోవచ్చు. ఏమంటారు?' అని అన్నాడు ఎరిక్సిమేకస్. 'ఈరోజు మనం హాయిగా మాట్లాడుకుందాం' అని కూడా అన్నాడు.

## 4

'మీరొప్పుకుంటే ఈరోజు మనం ఏం మాట్లాడుకోవాలో కూడా చెప్తాను' అని అన్నాడు. అతడి ప్రతిపాదనకి అందరూ ఒప్పుకున్నాక అతడిట్లా అన్నాడు:

'సంభాషణ నేను మొదలుపెడతాను. కాని యురిపిడిస్[6] నాటకంలో మెలనిప్పె లాగా,

'నా మాటల్తో కాదు'

నేను మాట్లాడదామనుకున్న మొదటిమాట నాది కాదు, ఫేద్రోస్‌ది. ఎందుకంటే అతనెప్పుడూ నాతో ఒక మాట అంటూ ఉంటాడు, ఆ మాట చెప్తున్నప్పుడు అతని కంఠంలో ఒకింత అసహనం చికాకు కూడా కనిపిస్తూ ఉంటాయి.

అతను ఏమంటాడంటే– 'చూడు ఎరిక్సిమేకస్ ఇదెంత విడ్డూరంగా ఉందో, ప్రతి ఒక్క దేవుడికీ, దేవతకీ వాళ్ళని స్తుతించడానికి ఏదో ఒక పద్యమో, స్తోత్రమో ఉందిగాని, దేవతలందరిలోనూ దేవాధిదేవత, శ్రేష్ఠదేవత, ప్రేమదేవత[7] కంటూ ఒక్కడంటే ఒక్కడు కూడా స్తోత్రకారుడు లేడు చూడు. ఎంతమంది కవులున్నారో, సోఫిస్టులు మాత్రం తక్కువున్నారా, వాళ్ళల్లో అందరూ గొప్పగా చెప్పుకునే ప్రోడికస్[8] చూడు, హెర్క్యులస్ మీదా తక్కిన వీరులమీదా ఎంత వచనం రాసాడు, కాని ఇంకా చిత్రమేమిటంటే, ఉప్పు ఎంత అవసరమో గొప్ప వక్తృత్వపటిమతో వివరించే తత్త్వశాస్త్రరచన కూడా ఒకటి లేకపోలేదు. అలాంటివే ఘనతపొందిన మరెన్నో విషయాలు కూడా. అంటే వాటిపట్ల మనకి ఆసక్తిపుట్టడంకోసం రాసిన రచనలన్నమాట. కాని ఇప్పటిదాకా ప్రేమని స్తుతిస్తూ మటుకు ఒక్క పద్యం కూడా ఎవరూ రాయడానికి ముందుకురాలేదంటే ఏమనాలి? నిజంచెప్పాలంటే ఈ దేవాధిదేవత పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాడు' అని అంటుంటాడు ఫేద్రోస్.

అతగాడి ఈ మాటల్లో సత్యముందనే అనిపిస్తుంది నాకు. అందుకని నేనీ సందర్భంగా అతడికొక బహుమానం ఇవ్వాలనుకుంటున్నాను. ఇప్పుడు మనమంతా ఇక్కడ సమావేశమైన ఈ సమయంలో ప్రేమదేవతను గౌరవించడం కన్నా గొప్ప కర్తవ్యం మనకి మరోటి ఉండబోదు. మీరు నా మాటలు ఒప్పుకుంటేగనుక, మాట్లాడుకోడానికి మనకి చాలినంత విషయం దొరికినట్టు.

అందుకని మనలో ప్రతి ఒక్కరం, ఎడమవైపు నుంచి కుడివైపుగా, వరసగా, ప్రతి ఒక్కరం ప్రేమదేవత గౌరవార్థం, ప్రసంగించడం మొదలుపెడదాం. ఎవరికి వారు తమ శక్త్యానుసారం మాట్లాడదాం. ఇప్పుడు మనలో ఎడమ వైపు అందరికన్నా ముందు ఫేద్రోస్ కూచున్నాడు కాబట్టి, ఈ ఆలోచన అతడితోటే మొదలయ్యింది కాబట్టి, అతడే మొదటి ప్రసంగం చేస్తే బావుటుంది' అని అన్నాడు.

'నీ మాట ఎవరు కాదంటారు ఎరిక్సిమేకస్' అని అన్నాడు సోక్రటీస్.

'ప్రేమగురించి తప్ప మరి దేనిగురించీ తెలియదని చెప్పుకునే నీ ప్రతిపాదనని నేనెలా కాదనగలను? నేనేకాదు, అగథాన్, పౌసనియస్‌లు కూడా కాదంటారనుకోను. అలానే అరిస్టొఫెనీజ్ కూడా. ఎందుకంటే ఆయన ఎప్పుడూ ఆలోచించేదే డయోనిసస్, ఆఫ్రొడైట్ల గురించి. వీళ్ళే కాదు, ఇక్కడున్నవాళ్ళల్లో ఎవరూ కూడా నీ మాటకాదనరు. నీ ప్రతిపాదన మాలాగా మరీ చివరికి కూర్చున్న వాళ్ళకి కొద్దిగా ఇబ్బందిగా అనిపించవచ్చు గాని, దానికేముంది, మా వంతు వచ్చేలోపు మేము మంచి ప్రసంగాలు వినగలిగితే మాకదే చాలు. కాబట్టి ప్రేమస్తుతి ఫేద్రోస్‌తోనే మొదలుకానివ్వు. అతడికి నా శుభాకాంక్షలు' అన్నాడు.

తక్కిన మిత్రబృందం కూడా ఆ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

## 5

సోక్రటీస్ చెప్పినదానికి కూడా వారు అంగీకారం తెలిపారు.

ఆ రోజు ఎవరెవరు ఏం మాట్లాడేరో అరిస్టొడెమస్‌కి పూర్తిగా గుర్తులేదు. అలాగే అతడు నాకు చెప్పిందంతా నాక్కూడా గుర్తులేదు. కాని ఆ గోష్ఠిలో గుర్తుపెట్టుకోతగిందీ, ప్రధానవక్తలు మాట్లాడిందీ మాత్రం నేన్నీకు చెప్తాను.

ఫేద్రోస్ తన ప్రసంగం ప్రారంభిస్తూ ప్రేమ ఒక మహిమాన్వితమైన దేవత అనీ, మనుషుల్లోనూ, దేవతల్లోనూ కూడా అత్యద్భుతమైన దేవత అనీ, అతడు దేవతలందరికీ అగ్రజుడనీ, అది అతడికి గౌరవకారణమనీ, అటువంటి గౌరవాన్ని పొందడానికి కూడా సాక్ష్యమనీ, కాని అతడి తల్లిదండ్రులకంటూ ఎటువంటి స్మారకచిహ్నాలూ లేవనీ, ఏ కవిగానీ, వచనరచయితగానీ అతడికి తల్లిదండ్రులున్నట్టుగా ఎక్కడా రాయలేదనీ అన్నాడు.

హెసియోదు[9] చెప్పినట్టుగా అన్నిటికన్నా ముందు అవ్యవస్థ ఉండింది, దాన్నుంచి విశాలవక్షంతో పృథ్వి ప్రభవించింది. అప్పణ్ణుంచీ సమస్త అస్తిత్వానికీ శాశ్వత ఆవాసంగా

ప్రేమ వర్ధిల్లుతోంది. ఈ విషయమే మరోలా చెప్పాలంటే ముందు అవ్యవస్థ, ఆ తర్వాత భూమీ, ప్రేమా మనుగడలోకి వచ్చాయి. ఆ ప్రాదుర్భావం గురించి పార్మెనిడిస్[10] ఇలా గానం చేసాడు: 'దేవతాపరంపరల కోవలో అతడు ముందుగా ప్రేమని తీర్చిదిద్దాడు'.

అచుసిలాస్[11]కూడా హెసియోద్‌నే అనుసరించాడు. ప్రేమదేవత దేవతలందరిలోనూ ముందు పుట్టాడని సాక్ష్యం చెప్పిన కవులు చాలామందే ఉన్నారు. అతడు అందరికన్నా ముందు పుట్టినవాడు మాత్రమే కాదు, మానవాళికి గొప్ప మేలు చేకూర్చేవాడు కూడా. శీలవంతుడైన ప్రేమికుడిగా జీవితం మొదలుపెట్టడంకన్నా లేదా ఒక ప్రేమికుడికి తనని ఇష్టపడే ప్రియవయస్కుడు కావడం కన్నా మించిన గొప్ప అనుగ్రహం ఒక యువకుడికి మరొకటి ఉంటుందనుకోను. మనుషులు తమ జీవితాల్ని తీర్చిదిద్దుకోడానికి దారిచూపించే జీవనసూత్రం బంధువర్గమో, గౌరవమర్యాదలో లేదా సిరిసంపదలో లేదా మరే ఆదర్శాలో కానే కాదు. ప్రేమకన్నా మనిషికి దారి చూపించగల దీపం మరొకటి లేదు.

నేను దేనిగురించి ప్రసంగిస్తున్నాను? ఏ మానావమానాల ప్రోద్బలం లేకుండా మనుషులుగానీ, రాజ్యాలుగానీ ఏ ఒక్క మంచిపనిగానీ, గొప్పపనిగానీ చేపట్టడానికి పూనుకోరు. అయితే ఒక అగౌరవప్రదమైన పని చేస్తూ ఒక ప్రేమికుడు పట్టుబడ్డాడే అనుకోండి, లేదా మరొకరెవరేనా అతడికేదైనా అన్యాయం చేయబోతున్నప్పుడు పిరికితనం వల్ల లొంగిపోయేడే అనుకోండి, కాని అట్లాంటి క్షణాల్లో అతడు తన తండ్రి కంటపడ్డప్పటి కన్నా లేదా తన సహచరుల కంటపడినదానికన్నా లేదా మరెవరు చూసినప్పటికన్నా కూడా తన ఇష్టసఖుడు చూసినప్పుడే ఎక్కువ వ్యథకి లోనవుతాడు.

అలాగే, ప్రేమికుడు కూడా ఏదేనా లజ్జాకరమైన సంఘటనలో ఇరుక్కున్నప్పుడు తన ప్రేమికుడి గురించి కూడా అలాంటి బాధకే లోనవుతాడు. మనమేదో ఒకలా మన రాజ్యం మొత్తాన్ని లేదా మొత్తం సైన్యాన్ని ప్రేమికులతోటీ, వాళ్ళని ఇష్టపడేవాళ్ళతోటీ నింపేసామనుకోండి. వాళ్ళు వాళ్ళ నగరాలకి అత్యుత్తమ పరిపాలకులుగా మారతారు. అన్నిరకాల అవమానాలకీ దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తారు. అలాగే మరొకర్ని చూసి తాము కూడా అంతే గౌరవప్రదంగా మసులుకుంటారు.

## 6

అలాగే ఒకరి పక్కన ఒకరు నిలుచుండి యుద్ధానికి సిద్ధమైనప్పుడు వారు లెక్కపెట్ట గలిగేటంత స్వల్పసంఖ్యలో ఉన్నా కూడా ప్రపంచాన్ని జయించితీరుతారు. ఎందుకంటే తాను తన బాధ్యతలనుంచి తప్పించుకోడమో లేదా తన ఆయుధాలు పక్కన పారెయ్యడమో

ప్రపంచంలో ఎవరేనా చూడ్డానికి ఒప్పుకుంటాడేమోగాని తన ప్రేమికుడు చూడ్డానికి ఎవరు ఇష్టపడతారు కనుక? ఆ అవమానాన్ని భరించడం కన్నా వెయ్యి సార్లు చావడమే మేలనుకుంటారు. అలాగే తన ప్రేమికుణ్ణి వదిలిపెట్టిపారిపొయ్యేవాడూ, ప్రమాదం ముంచెత్తినప్పుడు అతడి చేయి వదిలిపెట్టేసేవాడూ ఎవరుంటారు? ఆ క్షణాల్లో అత్యంత భీరువు కూడా అత్యంత వీరోచితంగా మారిపోతాడు. సాహసవంతుడైపోతాడు. అటువంటి క్షణాల్లో ప్రేమ అతణ్ణి ఉత్తేజితుణ్ణి చేస్తుంది. కొందరు వీరుల ఆత్మల్లో దేవుడు సాహసాన్ని ఊపిరులూదుతాడని హోమర్ అంటాడే అలా ప్రేమికుడు తన ప్రేమస్వభావాన్నే తన ప్రేమికుడిలో ఊపిరులూదుతాడు.

తాము ప్రేమిస్తున్నవాళ్ళకోసం మనుషులు దేనికైనా తెగించేలా ప్రేమ పురి కొల్పుతుంది. ప్రేమకి మాత్రమే ఆ శక్తి ఉంది. అది స్త్రీలుగానీ, పురుషులుగానీ. గ్రీకు స్త్రీజాతిమొత్తానికి ఈ విషయంలో చిరస్మరణీయురాలు పీలియాస్ కూతురు ఆల్సస్[12].

మరొకరెవరూ ముందుకు రానప్పుడు ఆమె తన భర్తకోసం ప్రాణాలు త్యజించడానికి సిద్ధపడుతుంది. తన భర్త తల్లిదండ్రులింకా జీవించే ఉన్నారు. కాని అతడి పట్ల ఆమె ప్రేమ ఆ తల్లిదండ్రుల ప్రేమను మించిపోయింది. తమ రక్తసంబంధంలో ఆ తల్లిదండ్రులు కూడా ఆ పిల్లవాడికి పరాయివాళ్ళేనా, వాళ్ళది కేవలం నామమాత్రబంధమేనా అనేటంతగా ఆమె తన భర్త పట్ల అవధుల్లేని ప్రేమ చూపించగలిగింది. ఆమె చూపించిన ఆ సాహసం దేవతల్ని ఎంతగా కదిలించిందంటే, మరెందరో వీరులు కూడా సాహసం చూపించివున్నా, తిరిగి మళ్ళా పునరుజ్జీవితుడు కాగలిగే అవకాశం ఆమె భర్తకి మాత్రమే దక్కింది. ఆమె ప్రేమబలానికి దేవతలు చూపించిన అపురూపమైన గౌరవం అది.

అదే యాగ్రస్ కొడుకు ఆఫియస్[13] సంగతి తీసుకోండి. ఆ వాద్యకారుడు. అతణ్ణి దేవతలు వట్టిచేతుల్తో వెనక్కి పంపేసారు, అతడు ఎవరికోసం వెతుక్కుంటున్నాడో ఆమెని ఒక నీడలాగా మటుకే అతడికి చూపించారుగాని ఆమెని మాత్రం తిరిగి అతడికి అప్పగించలేదు.

ఎందుకంటే అతడు ఆమెని కోరుకున్నప్పుడు ఆ ఆరాటంలో ఎటువంటి భావోద్వేగం లేదు. అతడు కేవలం సంగీతవాద్యకారుడు మాత్రమే. అంతే తప్ప ఆల్సస్టస్ లాగా తన ప్రేమకోసం ప్రాణత్యాగం చెయ్యడానికి సిద్ధపడలేదు. పైగా నరకలోకంలోకి ఎలా ప్రవేశించడమా అని పన్నాగాలు పన్నుతూ ఉన్నాడు. దేవతలు తర్వాత కాలంలో అతడికి స్త్రీల చేతిలో మరణం రాసిపెట్టారు. అతడు చూపించిన పిరికితనానికి విధించిన శిక్ష అది.

ఇక తన ప్రేమికురాలు పెట్రాక్లస్[14] పట్ల అకిలస్ చూపించిన ప్రేమకి దక్కిన బహుమానం మరింత ప్రత్యేకమైంది. (పెట్రాక్లస్ అకిలిస్[15]ని ప్రేమించాడే తప్ప ఆమె అతణ్ణి ప్రేమించలేదనే పొరపాటు అభిప్రాయంలోకి ఎందుకోగాని ఎస్కిలస్[16] పడిపోయాడు. వాళ్ళిద్దరిలోనూ కూడా అకిలస్ మరింత అందగాడు. తక్కినవీరులందరికన్నా అందగాడు. హోమర్ చెప్పిందాని ప్రకారం అతడికి అప్పటికింకా గడ్డం కూడా మొలవలేదు. ఇంకా పాలుగారే పసివదనమే).

ప్రేమగుణాన్ని దేవతలు గొప్పగా సన్మానిస్తారు. అయితే ప్రేమించబడ్డవాళ్ళు తమ ప్రేమికుల్ని తిరిగి ప్రేమిస్తే ఆ గుణాన్ని దేవతలు మరింత లెక్కల్లోకి తీసుకుంటారు, ఆరాధిస్తారు, బహుమానిస్తారు. ఎందుకంటే ప్రేమికుడిలో మరింత దైవత్వం ఉంది. అతడు దైవప్రేరితుడు.

ఒకవేళ హెక్టర్[17]ని గాని వధించకపోతే అకిలస్ మరణం తప్పించుకుని, యుద్ధభూమి నుంచి క్షేమంగా ఇంటికి రాగలడనీ, వార్ధక్యపు చివరిదినాలు సంతోషంగా వెళ్ళదీయగలడని, అకిలిస్‌కి వాళ్ళమ్మ చెప్పింది. ఆ విషయం అతడికి బాగా గుర్తుంది. అయినా కూడా అతడు తన స్నేహితుడి పగ చల్లారడం కోసం తన ప్రాణాలు వదిలిపెట్టేయడానికి సిద్ధపడ్డాడు. తన స్నేహితుడి పట్ల అతడు చూపిన ఈ విధేయత అతడు మరణించాక కూడా కొనసాగింది. అందుకని దేవతలు అతణ్ణి ఆల్సెస్ కన్న ఎక్కువగా గౌరవించారు. అతణ్ణి అనుగ్రహంతో పొంగిపొర్లే ద్వీపాని[18]కి పంపించారు.

ప్రేమదేవత అందరికన్నా ముందుపుట్టినవాడు మాత్రమే కాదు, అందరికన్నా బలవంతుడూ, ఉదారుడూ అని చెప్పడానికి నేను చెప్పగలిగిన కారణాలు ఇవి. నా దృష్టిలో ప్రేమదేవత మన జీవితాలకు యథార్థకర్త, శీలప్రదాత, చివరికి మనం మరణించినతర్వాత కూడా అతడే మన ఆనందప్రదాత.

ఇదీ లేదా దాదాపుగా ఈ పద్ధతిలో సాగింది ఆ రోజు ఫేద్రోస్ ప్రసంగం. అతడి తర్వాత మరికొందరు మాట్లాడేరుగానీ అదేదీ అరిస్టొడెమస్‌కి గుర్తులేదు. ఆ తర్వాత అతడు నాకు చెప్పిన ప్రసంగం పౌసనియస్‌ది.

అతడు తన ప్రసంగం మొదలుపెడుతూ ఫేద్రోస్ తన వాదనని సరైన పద్ధతిలో మనముందు ప్రతిపాదించలేదు అని అన్నాడు. ఇంకా ఇలా అన్నాడు 'ఎందుకంటే ప్రేమని మనం మరీ అంత విచక్షణారహితంగా ప్రశంసించవలసిన పనిలేదు. ఒకవేళ ప్రేమ అంటూ ఒకే ఒక్కటి ఉండిఉంటే బహుశా నువ్వు చెప్పింది సరిపోతుంది. కాని ప్రేమలు ఒక్కటికాదు, చాలా ఉన్నాయి. వాటిల్లో ఏ ప్రేమ మన ప్రశంసలకు పాత్రమైందో నువ్వు

ముందే నిర్ణయించి ఉంటే బాగుండేది.

నేనీ దోషాన్ని ఇలా సవరిద్దామనుకుంటున్నాను. ప్రేమలన్నిటిలోనూ మన ప్రశంసకు అర్హమైన ప్రేమ ఏదో నేను ముందు ఎంచి చూపిస్తాను. అప్పుడు ఆ ప్రేమకు తగ్గట్టుగా నా స్తోత్రపాఠం కొనసాగిస్తాను. మనందరికీ తెలుసు, ఆఫ్రొడైట్ నుంచి ప్రేమని విడదీసి ప్రత్యేకంగా చూపించలేమని. కాబట్టి ఒకే ఒక్క ఆఫ్రొడైట్ ఉన్నట్టయితే ప్రేమ కూడా ఒకే ఒక్కటి ఉంటుంది. కాని ఆఫ్రొడైట్లు ఇద్దరున్నారుకాబట్టి ప్రేమలు కూడా రెండు ఉండి తీరాలి. ఆఫ్రొడైట్లు ఇద్దరున్నారని నేనడం సరైందేకదా. ఆ ఇద్దరు దేవతల్లోనూ పెద్దామె, ఆమె అయోనిజ, యురేనస్ కూతురు, ద్యులోక దేవత. చిన్నామె, జ్యూస్‌కీ, డయోనికీ పుట్టినామె. ఆమెనే మనం మామూలు ఆఫ్రొడైట్ అని వ్యవహరించేది. మనం సాధారణంగా ప్రేమ అని పిలిచేది ఆమెకి సంబంధించిన మామూలు ప్రేమనే. ఆ రెండో అఫ్రొడైటు ద్యులోక ప్రేమదేవత.

దేవతలందరూ స్తోత్రాలకి అర్హులే గాని, వాళ్ల స్వభావాల్లో ఉన్న వ్యత్యాసాల్ని కూడా మనం గుర్తుపెట్టుకోవాలి. కాబట్టి ఈ ఇద్దరు ప్రేమదేవతలమధ్యా తేడా ఉందని నేను చెప్పితీరాలి. అలాగే వారి స్వభావాల్ని బట్టే వారి కార్యకలాపం కూడా మారుతుంటుంది.

## 7

ఉదాహరణకి మనల్నే చూడండి, మనమిప్పుడు తాగుతున్నాం, పాడుకుంటున్నాం, మాటాడు కుంటున్నాం–ఇవేవీ కూడా వాటంతట అవి మంచివీ కాదు, చెడ్డవీ కాదు. కాని మనం వాటిని ఎలా చేపడుతున్నాం అన్నదాన్నిబట్టి వాటిమంచిచెడులు రూపుదిద్దుకుంటాయి. మనం వాటిని బాగా చేసామా, అవి మంచివవుతాయి. సరిగ్గా చెయ్యలేదా, చెడ్డవవుతాయి. అలాగే ప్రతి ఒక్క ప్రేమా ప్రశంసార్హం కాదు. వాటిల్లో ఏది సరైన దారికి మనల్ని నడిపిస్తుందో అది మాత్రమే మన ప్రశంసకి పాత్రమవుతుంది.

మామూలు ఆఫ్రొడైట్‌కి పుట్టిన ప్రేమ మామూలు ప్రేమనే అయితీరుతుంది. ఆ ప్రేమకి విచక్షణ ఉండదు. అది సాధారణంగా మనుషులు లోనయ్యే ప్రేమ, స్త్రీలపట్లా, యువతీయువకులపట్లా కలిగే ప్రేమ, ఆత్మ పట్ల కాక దేహాల పట్ల కలిగే ప్రేమ– ఆ ప్రేమ మామూలుగా వివేకహీన విషయాలపట్లనే లగ్నమవుతూ ఉంటుంది. అది వేటినైనా ఏదో ఒక ప్రయోజనం కోసమే అభిలషిస్తూ ఉంటుందిగాని, తాను కోరుకున్నదాన్ని ఉదాత్తంగా మలుచుకోవాలని అనుకోదు. అందువల్ల అది చేసే పనుల్లో మంచీ చెడూ కలగాపులగమైపోతాయి. ఆ ప్రేమకి కారణమైన ఆఫ్రొడైట్ మరొకామెకన్నా చాలా

యవ్వనవతి. ఆమె ఒక స్త్రీపురుష సంయోగంలోంచి పుట్టిందికాబట్టి ఆ రెండు లక్షణాల్నీ పుణికిపుచ్చుకుంది.

ద్యులోకవాసి అయిన ఆఫ్రోడైట్ పుట్టుకలో ఏ స్త్రీకీ పాత్రలేదు. ఆమె పురుషుడి నుంచి మాత్రమే పుట్టింది. యువతీయువకుల ప్రేమలో మనకు కనిపించేది ఈ ఆఫ్రొడైట్‌నే. ఆమె వయసులో పెద్దదికాబట్టి ఆమె ప్రవర్తనలో ఏ దోషం ఎంచలేం. ఆ ప్రేమవల్ల ఉత్తేజితులైనవాళ్ళు పురుషుల వైపు ఆకర్షితులవుతారు. ఏ పురుషుడు స్వభావరీత్యా ప్రతిభావంతుడిగా, వీరుడిగా ఉంటాడో అతడిపట్ల వాళ్ళు ఆకర్షితులవుతారు. వాళ్ళు ఎవరిపట్ల అనుబంధం పెంచుకోవాలని చూస్తున్నారో మనం ఇట్టే పసిగట్టవచ్చు. ఎందుకంటే వాళ్ళు ప్రేమించేది చిన్నకుర్రాళ్ళని కాదు, తెలివైనవాళ్ళని, ఎవరిలో వివేచనాశక్తి వికసించడం మొదలుపెడుతున్నదో వాళ్ళని.

తమకి సహచరులుగా ఎంచుకున్న యువకులపట్ల వాళ్ళు విశ్వసనీయులుగా ఉండటమే కాక, తమ మొత్తం జీవితాన్ని వాళ్ళ సాంగత్యంలోనే గడపాలనుకుంటారు. అంతే తప్ప వాళ్ళ అనుభవరాహిత్యాన్ని ఆసరాచేసుకుని వాళ్ళని మోసం చెయ్యాలనిగానీ, ప్రలోభపరచాలనిగానీ లేదా ఒకళ్ళని వదిలిపెట్టి మరొకళ్ళని వెతుక్కోవాలని గానీ అనుకోరు.

కాబట్టి మరీ చిన్నకుర్రాళ్ళపట్ల చూపించే ప్రేమని చట్టరీత్యా నిషేధించాలంటాను. ఎందుకంటే అలా ప్రేమలో పడ్డ యువకుల భవిష్యత్తు అనిశ్చితంగా మారిపోతుంది. అది వాళ్లకి దేహంలోగాని, ఆత్మలోగాని మంచి చెయ్యవచ్చు లేదా చెరుపు చేయవచ్చు, ఎంతో ఉదాత్తమైన ఆకర్షణ వాళ్లని ముంచెత్తవచ్చుకూడా. ఇలాంటి విషయాల్లో మంచివాళ్ళు తమకి తామే ఒక శాసనంలాగా తమని తాము నియంత్రించుకుంటారు. కాని మరీ మొరటుగా ఉండే ప్రేమికుల్ని బలప్రయోగంతో అదుపుచెయ్యవలసి ఉంటుంది. మన ఇళ్లల్లో మన స్త్రీలపట్ల వాళ్ళు తమ అభిమానాన్ని, అనురాగాన్ని చూపించడాన్ని మనమెట్లా నియంత్రిస్తామో, అలానే.

## 8

ఇలాంటి మనుషులు ప్రేమని అభాసుపాలుచేస్తారు. కొంతమంది విషయంలో వాళ్ళ అనుబంధాలు అసంగతంగానూ, దుష్టంగానూ ఉంటాయికాబట్టి అవి నిషేధానికి గురికాక తప్పదు. ఎందుకంటే చట్టసమ్మతంగానూ, సంఘసమ్మతంగానూ ఉండేదేదీ కూడా అభిశంసనకి గురయ్యే అవకాశం ఉండదు.

ఇక్కడా, స్పార్టాలోనూ ప్రేమనియమాలు కొద్దిగా సంక్లిష్టంగా ఉంటాయి. కాని చాలా నగరాల్లో అవి సరళంగానూ, మనం అర్థంచేసుకోగలిగేటట్టూ ఉంటాయి. ఎల్లిస్[19] లోనూ, బొవొతియో[20] లోనూ, వాక్చాతుర్యం మరీ అభివృద్ధి చెందని చోటా ప్రేమసూత్రాలు చాలా సూటిగా ఉంటాయి. అవి ఆ ప్రేమానుబంధాల్లో తగుల్కున్నవాళ్లకి అనుకూలంగా ఉంటాయి. పెద్దవాళ్ళుగానీ, చిన్నవాళ్ళుగాని ఏ ఒక్కరూ కూడా ఆ అనుబంధాల్ని తక్కువచేసి మాట్లాడటానికి ఉండదు. అక్కడ మనుషులు మితంగా మాట్లాడుతుండటమే అందుకు కారణమనుకుంటాను.

కాబట్టి అక్కడ ప్రేమికులకి తమ ప్రేమ గురించి వాదించి ఒప్పించుకోవలసిన అవసరం ఉండదు. అయోనియా[21]లోనూ, అలాగే మరీ అనాగరికుల పాలనలో ఉండే తక్కిన చోట్లా ఇటువంటి పద్ధతుల్ని మరీ చిన్నచూపు చూస్తారు. అక్కడ తత్త్వశాస్త్రానికీ, క్రీడలకీ గౌరవం లేనట్టే యువకుల పట్ల ప్రేమకి కూడా ఏమంత గౌరవం లేదు. వాళ్ళ నియంతృత్వపు పోకడలే దానికి కారణం. తాము పాలించేవాళ్ళు చైతన్యవంతులుగా ఉండకూడదనే వాళ్ళ పాలకులు కోరుకుంటూ ఉంటారు. వాళ్ళ సమాజాల్లో తమ ప్రజల మధ్య బలమైన స్నేహబంధాలుగాని, సామాజికబంధాలుగాని పెంపొందకూడదని వాళ్ళు కోరుకుంటూ ఉంటారు.

మనుషుల మధ్య అనుబంధాన్ని ప్రేమ బలపరిచినట్టుగా మరేదీ బలపర్చదనేది ఏథెన్సు నియంతలు అనుభవరీత్యా తెలుసుకున్న సత్యం. గుర్తుంది కదా. అరిస్టొజిటన్ ప్రేమా, హార్మోడియస్[22] స్థిరచిత్తమే వాళ్ళని పదవీభ్రష్టుల్ని చేసాయి. కాబట్టి మనుషుల మధ్య ప్రేమానుబంధాలకి చెడ్డపేరు వచ్చిందంటే దానికి కారణం కొందరు కావాలని మరీ వాటికి చెడ్డపేరు తేవడానికి చూడటమే. ఇంకా చెప్పాలంటే పాలకుల స్వార్థప్రయోజనాలూ, పాలితుల పిరికితనమూను.

ఇదిలా ఉండగా కొన్ని దేశాల్లో ఆ ప్రేమానుబంధాలకి విచక్షణారహితంగా మరీ పెద్ద పీట వేసారంటే అందుకు కారణం అక్కడ వాటి పట్ల గౌరవం చూపిస్తున్నవాళ్ళ సోమరితనమే అని చెప్పవలసి ఉంటుంది. కాని మన దేశంలో అంతకన్నా ఉన్నతసూత్రాలు అమల్లో ఉన్నాయి. దానికి కారణమేమిటా అని ఆలోచిస్తే ముందొక పట్టాన అర్థం కాదు. చూడండి, మనం రహస్యప్రేమలకన్నా బహిరంగ ప్రేమలు ఎక్కువ గౌరవనీయమని భావిస్తుంటాం. అలాగే ధీరులూ, ఉదాత్తులూ అయినవాళ్ళని, వాళ్లు ఏమంత అందంగా లేకపోయినా కూడా, వాళ్ళ ప్రేమని ప్రత్యేకంగా గౌరవిస్తుంటాం.

ఆలోచించండి. ప్రపంచమంతా ప్రేమికుడి పట్ల చూపుతున్న మన్నన, ప్రోత్సాహం ఎంత గొప్పవి! అతడు తనకిస్తున్న గౌరవానికి తగనిదేదీ చేయకూడదని ఆశించడమే

కాక, అతడు తన గౌరవాన్ని నిలబెట్టుకోడంలో నెగ్గాడా అతణ్ణి ప్రశంసిస్తారు, అదే, ఓడిపోయాడా, నిందిస్తారు. తన ప్రేమసాధనలో అతడు ఎన్నో విచిత్రమైన పనులు చెయ్యడానికి కూడా మానవాళి అంగీకరిస్తుందిగాని, అదే, అతడు ఏదైనా స్వప్రయోజనాన్ని ఆశించి చేస్తే మాత్రం, ఏదైనా పదవికోసమో, అధికారం కోసమో చేస్తే మాత్రం తత్త్వశాస్త్రం అతణ్ణి తీవ్రాతితీవ్రంగా మందలిస్తుంది.

## 9

అతడు తన ప్రేమ కోసం వేడుకోవచ్చు, అడుక్కోవచ్చు, బతిమిలాడవచ్చు, ఒట్టు పెట్టుకోవచ్చు, తన ప్రేమికుడి గుమ్మం దగ్గర ఒక చాపపరుచుకుని పడి దొర్లవచ్చు, ఒక బానిసకన్నా హీనమైన బానిసలాగా జీవించవచ్చు- అదే మరొక సందర్భంలో అయితే అతడి స్నేహితులూ, శత్రువులూ కూడా అతడట్లా చెయ్యడానికి అడ్డుపడతారుగాని, ఇప్పుడు మాత్రం అతడలా చేస్తుంటే ఎవరికీ సిగ్గనిపించదు సరికదా, ఎవరూ అతణ్ణి మందలించాలని కూడా అనుకోరు. అతడి ప్రవర్తన మరీ లేకిగా ఉందనిగానీ, అతడు తన ప్రేమికుడిని మరీ పొగిడేస్తున్నాడనిగానీ అతణ్ణి ఏ శత్రువు కూడా వేలెత్తి చూపడు.

ప్రేమికుడు ఏ పని చేసినా ఆ పనికే అందాన్నిచ్చే హుందాతనమేదో దానిలో ఉంటుంది. ఆ పనులు బహుధా ప్రశంసనీయాలని సంప్రదాయమే అంగీకరించింది. ప్రేమికుడు అలా ప్రవర్తించడంలో తక్కువదనమేదీ లేదని నమ్మడం మనకి అలవాటుగా మారింది. ఇంకా విచిత్రమేమిటంటే, అతడు ఆ సమయంలో ఎన్ని ఒట్లు పెట్టుకున్నా, ఎన్ని దొంగ ఒట్లు పెట్టుకున్నా కూడా దేవతలు కూడా వాటిని చూసీచూడనట్టుపోవడం. పేమికుడు పెట్టుకునే ఒట్లు ఎవరూ గట్టిగా పట్టించుకోనే పట్టించుకోరు.

కాబట్టి మన ఏథెన్సు పద్ధతుల ప్రకారం ఒక ప్రేమికుడికి దేవతలూ, మానవులూ కూడా పూర్తి స్వాతంత్ర్యాన్నిచ్చారనే చెప్పాలి. దాన్నిబట్టి చూస్తే ఈ నగరంలో ఒకరితో ప్రేమలో పడటంగాని, ఒకరిని ప్రేమించడం గాని ఇరుపక్షాలకీ అద్భుతమైన అనుభవం. మరొకవైపు తండ్రులు తమ పిల్లలకి ఉపాధ్యాయుల్ని నియమించినప్పుడు, ఆ పిల్లలు ప్రేమికుల ఆకర్షణలో తగులుకున్నప్పుడు, ఆ పిల్లల్ని తమ ప్రేమికుల్తో మాట్లాడకుండా తండ్రులు ఎటువంటి ఆంక్షలు విధిస్తూ ఉన్నారో కూడా గమనించండి.

పిల్లలు అట్లాంటి ప్రేమలో పడ్డారని తెలిసినప్పుడు వాళ్ల స్నేహితులూ, సమవయస్కులూ వాళ్ళనెట్లా ఎగతాళిచేస్తుంటారో కూడా చూడండి. వాళ్ళ పెద్దవాళ్ళు కూడా అలా ఎగతాళి చేసేవాళ్లని వారించవలసిందిపోయి ఆ జరుగుతున్నదేదో ఎంతమాత్రం సరైంది కాదన్నట్టుగా

ఎలా ప్రవర్తిస్తున్నారో చూడండి. ఇదంతా ఎవరేనా చూస్తే, మనం ముందు చెప్పుకున్నదానికి విరుద్ధంగా అసలు ఈ సంప్రదాయం మొత్తం దోషపూరితమని అనుకోకుండా ఉండలేరు.

కాని సంగతేమిటంటే, నేను ముందే చెప్పినట్టుగా ఇది చూడ్డానికి కనిపించినంత సరళవ్యవహారం కాదు. నిజానికి ఈ ఆచారం దానికదే మంచిదీ కాదు, చెడ్డదీ కాదు. అది సరిగ్గా నడిస్తే మంచిది, చెడ్డదారిలో నడిస్తే చెడ్డదీను. అదొక చెడ్డవాణ్ణి తృప్తిపరచడం కోసం జరిగినా, చెడ్డదారిలో జరిగినా చెడ్డది. అదే ఒక మంచి మనిషిని తృప్తిపరచడం కోసం జరిగితే, మంచి దారిలో జరిగితే, మంచిది.

సాధారణంగా ఇలాంటి విషయాల్లో చెడ్డవాళ్ళెవరంటే మామూలు తరహా ప్రేమికులు. అంటే దేహాన్ని తప్ప ఆత్మని ప్రేమించనివాళ్ళు. వాళ్ళు ప్రేమించేది స్థిరమైంది కాదు కాబట్టి వాళ్ళ ప్రేమ కూడా స్థిరంగా ఉండదు. అతడు ఏ రూపవికాసాన్ని చూసి ప్రేమలో పడతాడో, ఆ తళతళ వెలిసిపోడం మొదలవగానే అతడు కూడా 'నెమ్మదిగా జారుకుంటాడు.' అతడప్పటిదాకా చేస్తూ వచ్చిన వాగ్దానాలూ, వేడికోళ్ళూ అన్నీ గాల్లో తేలిపోతాయి. అలాకాక శీలవంతమైన వ్యక్తిత్వాన్ని ప్రేమించే ప్రేమికుడు తన జీవితాంతం తన ప్రేమలో స్థిరంగా ఉంటాడు. ఎందుకంటే అతడు ప్రేమిస్తున్నది కూడా స్థిరంగా ఉండేది కాబట్టి.

## 10

ఇక్కడ ఏథెన్సులో మనం రెండురకాల ప్రేమికుల్ని కూడా పరీక్షకు పెట్టి చూస్తాం. ఆ ప్రేమికుడు మంచివాడా, సంతోషపెడతాం. చెడ్డవాడా, అభిశంసిస్తాం. మనం చేసేదేమిటంటే ఒకవైపు ప్రేమికుణ్ణి తన ప్రేమని కొనసాగించమని ప్రోత్సహిస్తాం, కాని, అతడు ఎవరిని ప్రేమిస్తున్నాడో అతణ్ణి తనని ప్రేమిస్తున్న వాడి నుంచి దూరంగా పారిపొమ్మంటాం. అప్పుడు ఆ ప్రేమికుడూ, ఆ ప్రేమకు నోచుకున్నవాడూ[23] ఇద్దరూ కూడా– ఆ రెండు రకాల ప్రేమికుల్లో –ఏ తరహాకి చెందినవాళ్ళో బయటపడుతుంది. ఎవరేనా ప్రేమికుడు తాను ఎవరిని ప్రేమిస్తున్నాడో అతడి ప్రేమని మరీ సత్వరమే పొందగలిగితే అదేమంత గౌరవప్రదం కాదని మనం భావించేది ఇందువల్లనే.

ప్రేమబలం నిగ్గు తేలడానికి కొంత సమయం గడవాలి. చాలావిషయాల్లో కాలపరీక్షని మించింది లేదు. అలాగే ప్రేమించబడుతున్న వ్యక్తి ధనప్రభావానికో, లేదా రాజకీయ ప్రభావానికో తలొగ్గి ఆ ప్రేమని అంగీకరిస్తే అది కూడా మన దృష్టిలో నీచమే. అలాగే అతడు ఎలాంటి ప్రతిఘటనాలేకుండా బెదరింపులకి లొంగిపోయినా లేదా ఆర్థికంగానో,

రాజకీయంగానో ఆశచూపుతున్న ప్రలోభాల్ని అసహ్యించుకోకపోయినా కూడా దాన్నీ నీచమైన ప్రేమగానే లెక్కగడతాం. ఒకటి, అటువంటి ప్రలోభాలేవీ శాశ్వతభద్రతని చేకూర్చగలిగేవి కావు కాబట్టి. రెండోది, అసలు అటువంటి ప్రాతిపదికమీద నిజమైన స్నేహాలు ఎప్పటికీ వికసించవు కాబట్టి.

కాబట్టి ఒక ప్రేమికుడికి తాను ప్రేమిస్తున్నవాడిపట్ల ప్రేమానుబంధం కొనసాగించడానికి ఒకే ఒక్క దారి మిగిలి ఉంది. అది శీలంతో కూడి ఉన్న దారి. ఒక ప్రేమికుడు తాను ప్రేమిస్తున్నవాడికి ఎటువంటి సేవచేసినా అది అగౌరవం కాదనీ, ఊడిగం కింద లెక్కకు రాదనీ ఇంతకు ముందు చెప్పుకున్నాం.

కాబట్టి ఒక ప్రేమికుడికి గౌరవప్రదంగా తన ప్రేమ ప్రకటించడానికి మిగిలింది ఒకే ఒక్క దారి, అది శీలవంతమైన సేవ మాత్రమే. ఇష్టపూర్వకంగా చేసే ఊడిగం. దాన్ని మటుకు మనం నిందించకుండా అంగీకరిస్తాం. ఎందుకంటే అది శ్రేష్ఠతకోసం చేసే ఊడిగం. ఎవరేనా ఒక మనిషికి సేవచెయ్యడంద్వారానో, శుశ్రూషవల్లనో మరింత వివేకవంతుడైన మానవుడిగా మారగలమన్న ఉద్దేశంతో ఎవరికేనా ఊడిగం చేస్తే దాన్ని కూడా మనం తక్కువగా భావించం. ఆ శ్రేష్ఠత ఎందులోనైనా గానివ్వండి. అది తప్పూ కాదు, అలాంటి సేవ దాస్యమూ కాదు. కాబట్టి యువకుల్ని ప్రేమించడమూ, జ్ఞానాన్ని సముపార్జించడమూ– ఈ రెండూ కూడా ఇద్దరిలోనూ తగినంతగా ఉన్నప్పుడే ప్రేమ పొందుతున్నవాడు తనని ప్రేమిస్తున్నవాణ్ణి సంతోషపరచగలుగుతాడు.

## 11

ఈ రెండు పద్ధతులూ, ఒకటి యువకుల్ని ప్రేమించడమూ, రెండోది తత్త్వశాస్త్రంకోసం శుశ్రూష చెయ్యడం– ఈ రెండూ ఒకరే పాటిస్తున్నట్లయితే, అప్పుడు ఆ ప్రేమికుణ్ణి, అతడు ఎవరి ప్రేమను కోరుతున్నాడో ఆ వ్యక్తి సంతోషంగా అంగీకరించవచ్చు. ఆ ఇద్దరూ, అంటే ప్రేమికుడూ, అతడు ప్రేమిస్తున్నవాడూ ఇద్దరూ కూడా వారిని వారు స్వీయనియంత్రణలో పెట్టుకుని నడుచుకుంటున్నప్పుడు, తాను ఎవరిని ప్రేమిస్తున్నాడో అతడికి ఎటువంటి సేవచేయడానికేనా తాను సిద్ధమని ప్రేమికుడు అనుకోవడమూ సబబుగానే ఉంటుంది, తనకి వివేకమో, జీవితపు విలువలో ఒనగూడతాయన్న ఉద్దేశంతో అతడి ప్రేమను పొందుతున్న వ్యక్తి ఆ ప్రేమను అంగీకరించడమూ సబబే అవుతుంది.

వారిద్దరిలో ఒకరు వివేకాన్నీ, విలువల్నీ అందించేవాళ్ళవుతున్నారు, మరొకరు తన విద్యలో భాగంగా, శీలనిర్మాణంలో భాగంగా దాన్ని స్వీకరించేవాళ్ళవుతున్నారు. ఆ విధంగా

ఒకరిలో మాత్రమే ప్రేమా, వివేకమూ రెండూ కలిసి కనిపించినప్పుడు, అప్పుడు మాత్రమే, ఆ ప్రేమికుణ్ణి, అతడి ప్రేమపొందుతున్నవాడు స్వీకరించవచ్చు. ఇటువంటి అనాసక్తప్రేమ ప్రసారం జరిగినప్పుడు మాత్రమే అందులో మోసపోతామేమోనన్న అనుమానానికీ, అవమానానికీ తావుండదు.

అలాకాకపోతే మాత్రం మోసపోయినా, మోసపోకపోయినా కూడా ఆ ప్రేమ గౌరవనీయప్రేమగా పరిణమించదు. ఎందుకంటే ఒకడు సంపన్నుడనే కారణం వల్ల అతడి ప్రేమని అంగీకరించడం మొదలుపెట్టి, తీరా అతడు పేదవాడని తెలిసేటప్పటికి, తన ప్రయోజనాలు నెరవేరవని నిరాశచెందేవాడు ఎప్పటికీ గౌరవహీనుడే అవుతాడు. ఎందుకంటే అతడు డబ్బుకోసం ఎవరిప్రేమనేనా అంగీకరిస్తాడనే ప్రవర్తనని నలుగురికీ చూపించడమే అవుతుంది. అది నిస్సందేహంగా సిగ్గుమాలిన పని. అలాకాక, ఎవరేనా తనని ప్రేమిస్తున్నవాడు మంచివాడని నమ్మి, అతడి సాంగత్యం వల్ల తాను మెరుగు పడగలనని భావించినప్పుడు, తీరా అతణ్ణి ప్రేమిస్తున్నవాడు దుష్టుడనీ, విలువల్లేని వాడనీ తర్వాత తెలిసినా కూడా, అతణ్ణి సజ్జనుడిగానే పరిగణిస్తాం.

ఒకవేళ అతడు మోసపోతే, అది అతడికి సంబంధించి ఒక ఉదాత్తవైఫల్యంగానే లెక్కకొస్తుంది. ఎందుకంటే అతడేం చేసినా అదంతా కూడా తనని తాను మెరుగు పర్చుకోడం కోసమో, ఉన్నతవిలువల్ని సముపార్జించుకోవడం కోసమో చేసాడు తప్ప మరో ఉద్దేశంతో కాదని అతడు నిరూపించుకోగలిగాడు. అంతకన్నా ఉదాత్తమైన విషయం మరొకటి ఉండబోదు. కాబట్టి ఏ విధంగా చూసినా, శీలసముపార్జనకోసమో, విలువల కోసమో ఒకరు మరొకరి ప్రేమను అంగీకరించడమే ఉదాత్తమైంది అనిపించుకుంటుంది.

ఇటువంటి ప్రేమనే ద్యులోకప్రేమ అని అనగలుగుతాం. అటువంటి ప్రేమ స్వర్గంతో సమానం. తమ అభ్యున్నతికోరుకునే ప్రేమికుల్నీ, వారు ప్రేమించేవారినీ కూడా ఉత్సుకుల్ని చెయ్యగల ఇటువంటి ప్రేమ కన్నా వ్యక్తులకీ, నగరాలకూ అమూల్యమైంది మరొకటి ఉండబోదు. తక్కిన అన్ని రకాల ప్రేమలూ సాధారణ ప్రేమవికారాలే. ప్రేమదేవతగురించి ఇప్పటికిప్పుడు ఆశువుగా నేను చెప్పగలిగిన మాటలివి. ఈ ప్రసంగాన్ని, ఫేద్రోస్, నీకు కానుక చేస్తున్నాను.'

ఆ విధంగా పౌసనియస్ విరమించాడు. (వక్తృత్వశాస్త్రం గురించి నాకు చెప్పినవాళ్ళు ఇలా ఏది చెప్పినా సమతూకంగా ఉండేలాగా చెప్పాలని నేర్పారు.[24]) అప్పుడు ప్రసంగించడానికి అరిస్టొఫెనీస్ వంతు వచ్చిందని అరిస్టొడెమస్ చెప్పాడు.

కాని అతడప్పటికే బాగా భోంచేసి ఉన్నందునో లేక మరేకారణం వల్లనోగాని, అతడికి ఎక్కిళ్ళు రావడం మొదలయ్యింది. దాంతో అతడు వైద్యుడు ఎరిక్సిమేకస్ వైపు తిరిగి, 'నువ్వు నా ఎక్కిళ్ళేనా ఆపు లేదా నా ఎక్కిళ్ళుతగ్గేదాకా నువ్వేనా మాట్లాడు' అనడిగాడు.

'నేను రెండూ చేస్తాను' అన్నాడు ఎరిక్సిమేకస్:

'నీ బదులు నేను మాట్లాడతాను. నా వంతొచ్చినప్పుడు నువ్వు మాట్లాడు. ఈలోగా నువ్వు కొద్దిగా ఊపిరి బిగబట్టి చూడు, అప్పటికి కూడా ఎక్కిళ్ళు తగ్గకపోతే, నోట్లోకి నీళ్ళు తీసుకుని పుక్కిలించు. అయినా కూడా ఎక్కిళ్ళు ఆగకపోతే, నీ ముక్కులో ఏదైనా పుల్లపెట్టితిప్పుకుని తుమ్మిచూడు. అలా ఒకటి రెండు సార్లు తుమ్మితే ఎలాంటి ఎక్కిళ్ళేనా ఆగిపోకతప్పదు' అని అన్నాడు.

'సరే. అలాగే. ఈలోపు నీ ప్రసంగం మొదలుపెట్టు' అన్నాడు అరిస్టొఫెనీస్.

ఎరిక్సిమేకస్ మాట్లాడటం మొదలుపెట్టాడు; 'పౌసనియస్ తన ప్రసంగం మొదలు పెట్టడం బాగా మొదలుపెట్టినా చివరకొచ్చేటప్పటికి తేలిపోయాడు. అది చూసాక, అతడు చెప్పలేకపోయింది నాకు చెప్పాలనిపిస్తోంది.'

## 12

'ప్రేమలు రెండురకాలని చెప్తున్నప్పుడు అతడు విషయాన్ని సరిగ్గా పట్టుకున్నాడు. అయితే నేను చదువుకున్న శాస్త్రం నాకేం చెప్తున్నదంటే, ప్రేమలోని ఈ ద్వైదీవిభాగం, అంటే చూడచక్కగా ఉన్నవాటిపట్ల కలిగే ఈ అనురాగం, మనుషులకి మాత్రమే పరిమితం కాదనీ, ఈ భూమ్మీద మనుగడసాగిస్తున్న సకల జంతురాశిలోనూ, సమస్త జీవకోటిలోనూ కనిపించేదే అనీ. నా వైద్యశాస్త్రం వల్ల నేను తెలుసుకున్నదేమంటే, ప్రేమదేవత సామ్రాజ్యం దైవ, మానవ అస్తిత్వాలన్నిటికీ కూడా వర్తిస్తుందనీ, అది అద్భుతమనీ, ఘనతరమనీ, సార్వత్రికమనిన్నీ.

నా ప్రసంగానికి న్యాయం చెయ్యడానికి నేను వైద్యశాస్త్రంతోటే మొదలుపెడతాను. అసలు మానవదేహంలోనే రెండు రకాల ప్రేమలున్నాయి. అవి విభిన్నమే కాదు, పరస్పరవిరుద్ధాలు కూడా. అవి ఒకదానికన్నా మరొకటి భిన్నంకాబట్టి వాటి ఇష్టాలూ, కోరికలూ కూడా పరస్పరభిన్నాలే. వాటిలో ఆరోగ్యవంతులకోరిక ఒకలాంటిదైతే, వ్యాధిగ్రస్తుల కోరిక మరొకలాంటిది.

పౌసనియస్ ఇప్పుడే చెప్పాడు, మంచివాళ్ల సాంగత్యాన్ని కోరుకోడం గౌరవప్రదమనీ, చెడ్డవాళ్ళ స్నేహం లజ్జాకరమనీ– అలాగే శరీరంలో కూడా ఆరోగ్యప్రదమైనవాటిని మనం పట్టించుకోవాలి, పెంచిపోషించుకోవాలి. రోగకారకమైనవాటిని గుర్తుపట్టాలి, మొగ్గలోనే తుంచెయ్యాలి. ఈ సందర్భంగా వైద్యుడు చెయ్యవలసింది ఇదే. వైద్యశాస్త్రం లక్ష్యం కూడా ఇదే. వైద్యశాస్త్రమంటేనే, శరీరం తాలూకు ఇష్టాయిష్టాల, కోరికల పరిజ్ఞానం. ఆ కోరికల్ని తీర్చాలా తీర్చకూడదా అన్న వివేచన.

సవ్యమైన ఇష్టాలనుంచి అపసవ్యమైనవాటిని వేరుచేయగలిగినవాడే ఉత్తమ వైద్యుడు. అపసవ్యమైనవాటిని సవ్యమైనవిగా మార్చగలగాలి. అనవసరమైనవాటిని తొలగించి, దేహంలో ప్రేమను పాదుకొల్పడం ఎలానో తెలిసినవాడు దేహనిర్మాణంలోని పరస్పర విరుద్ధశక్తుల్ని సమన్వయపరచగలుగుతాడు. వాటిని స్నేహితులుగా మార్చగలుగుతాడు. అటువంటివాణ్ణే నిపుణుడైన వైద్యుడని అనగలుగుతాం.

దేహంలో ఉన్న ప్రవృత్తుల్లో ఏవి మరీ పరస్పరవ్యతిరేకాలో అవే పరస్పర శత్రువులుగా ఉంటాయి. ఉదాహరణకి, మరీ వేడి, మరీ చల్లన, మరీ చేదు, మరీ తీపి, మరీ పొడి, మరీ తడి, ఇంకా ఇలాంటివి. ఇటువంటి పరస్పర విరుద్ధ శక్తులపట్ల మిత్రత్వాన్ని ఎలా సాధించాలో తెలిసినవాడు అస్క్లిపియస్[25]. అతడు మా వైద్యశాస్త్రానికి పితామహుడని ఇదుగో ఇక్కడున్న మన కవులూ, మిత్రులూ చెప్తుంటారు. నేను వాళ్ల మాటలు నమ్ముతాను. వైద్యశాస్త్రమే కాదు, వ్యాయామశాస్త్రం, వ్యవసాయశాస్త్రం కూడా అతడి పరిధిలోవే.'

## 13

'అలాగే ఈ విషయాన్ని పైపైన పరిశీలించినా కూడా, సంగీతశాస్త్రంలో కూడా, పరస్పరవిరుద్ధశక్తుల సమన్వయమే పనిచేస్తుందని గుర్తుపట్టగలరు. విడిపడిఉన్నప్పుడు కూడా అవి కలిసే ఉంటున్నాయని హెరాక్లిటస్[26] అంటున్న మాటల్లో సత్యం ఇదే అనుకుంటాను. అయితే ఆయన ఆ విషయం అంత స్పష్టంగా చెప్పలేదనుకోండి. కాని తంత్రీవాద్యానికీ, దాన్ని వాయించడానికి వాడే కమానుకీ మధ్య ఉన్న సమన్వయం అటువంటిదే అని హెరాక్లిటస్ ఒక ఉదాహరణ కూడా చూపించకపోలేదు.

అలాగని పరస్పరం అనంగీకారంలో ఉన్న శక్తుల మధ్య సమన్వయం సాధ్యమని చెప్పినా, లేదా అనంగీకారమే అంగీకారమని చెప్పినా కూడా అది హాస్యాస్పదమే అవుతుంది. ఉదాత్త, అనుదాత్త స్వరాలు శ్రుతిస్థాయిలో విభేదిస్తున్నప్పటికీ, అది సంగీతంకావడం

ద్వారా సమతూకాన్ని సాధిస్తున్నదని చెప్పడమే బహుశా అతడి ఉద్దేశ్యమై ఉంటుంది. ఎందుకంటే స్వరాలు ఎప్పటికీ విభేదిస్తూనే ఉంటే వాటిమధ్య సుశ్రావ్యత ఎప్పటికీ సాధ్యం కానేకాదు. ఎందుకంటే స్వరాలు సాధించే సుశ్రావ్యతనే మనం సంగీతం అంటాం. సంగీతం ఒక అంగీకారం. కాని విభిన్న స్వరాలు ఎప్పటికీ విభేదిస్తూనే ఉంటే, వాటిమధ్య అంగీకారం సాధ్యం కాదు. విభేదించేవాటిని నువ్వెప్పటికీ ఏకతాటిమీదకు తీసుకురాలేవు. అలాగే తాళం కూడా. అది హ్రస్వం, దీర్ఘం రెండు రకాలుగా ఉంటుంది. అవి ఒకసారి విభేదిస్తాయి, ఒకసారి ఏకీభవిస్తాయి.

ఇటువంటి అంగీకారాన్నే ఇంతకుముందు వైద్యశాస్త్రం అని కూడా చెప్పుకున్నాం. మనం చెప్పుకున్న తక్కిన విషయాల్లో సంగీతం పరస్పరం విభేదిస్తున్న శక్తుల మధ్య ఒక ప్రేమనీ, ఐక్యాన్నీ పెంపొందేలా చేస్తున్నది. కాబట్టి సంగీతం కూడా ప్రేమసూత్రాల్ని అనువర్తింపచేసే శాస్త్రమే అని చెప్పవలసి ఉంటుంది. సమతౌల్యతలోగానీ, లేదా లయలో గానీ ప్రేమని గుర్తుపట్టడం ఏమంత కష్టం కాదు. ఎందుకంటే, ప్రేమ అక్కడింకా రెండుగా విడిపోలేదు.

కాని ఆ సూత్రాల్ని నిజజీవితంలో ఉపయోగించవలసి వచ్చినప్పుడు, అంటే, గీతాలకి స్వరకల్పన చెయ్యవలసి వచ్చినప్పుడుగానీ లేదా అప్పటికే స్వరపరిచిన గీతాల్ని ఆలపించ వలసి వచ్చినప్పుడుగానీ, అప్పుడు కష్టం మొదలవుతుంది. అలాంటప్పుడే మంచి కళాకారుడితో పనిపడుతుంది.

అప్పుడు మళ్ళా మన పాత కథ మరోసారి చెప్పుకోవలసి ఉంటుంది. ద్యులోక ప్రేమదేవత కథ. శుభప్రదమైన స్వర్గలోకపు దేవత కథ మళ్లా చెప్పుకోవలసి ఉంటుంది. జీవితంలో సమతూకం తాలూకు అవసరం తెలిసేది అప్పుడే. సమతూకం తెలియని వాళ్లు సామరస్యం నేర్చుకోవాలనీ, తద్వారా తమ ప్రేమను కాపాడుకోవాలనీ చెప్పవలసి ఉంటుంది. మరొకవైపు కవిత్వాది సకల లలితకళలకూ ఆధారమైన కళాధిదేవత విషయంలో మరింత జాగ్రత్త వహించవలసి ఉంటుంది.

కళారాధన ద్వారా మనం సంతోషం పొందవచ్చు, కాని స్వైరప్రవర్తనని దూరం పెట్టవలసి ఉంటుంది. తినడంపట్లా తాగడం పట్లా మక్కువ చూపించేవాళ్ల విషయంలో వైద్య శాస్త్రం చేసినట్టే– అది వాళ్ళ కోరికల్ని తీర్చుకోడానికి అనుమతిస్తుందిగాని, అదే సమయంలో వాళ్ళు తిండిబోతులుగానూ, తాగుబోతులుగానూ మారకుండా జాగ్రత్త తీసుకుంటుంది. కాబట్టి సంగీతంలోనూ, వైద్యంలోనూ, అలాగే దైవ, మానుష

రంగాలన్నింటిలోనూ కూడా రెండురకాల ప్రేమలున్నాయని మనం గమనింపులోకి తీసుకోక తప్పదు.

## 14

ఋతుపరిభ్రమణం కూడా ఇటువంటి సూత్రాల ప్రకారమే నడుస్తూ ఉంది. వేడి, చలి, తడి, పొడి లాంటి ప్రాకృతిక ధర్మాలు ఒకదానిపట్ల మరొకటి ఆకర్షితమై, సమతౌల్యతలో సామరస్యంగా కుదురుకున్నప్పుడు, అవి మనుషులకీ, జంతువులకీ, వృక్షాలకీ ఆరోగ్యాన్నీ, పుష్కలత్వాన్నీ తీసుకొస్తాయి. అవి జీవకోటికి ఎలాంటి హానీ చెయ్యవు. అదే సమయంలో ఏదో ఒక గుణాన్ని మాత్రమే అతిశయింపచేసే ప్రేమవల్ల ఏదో ఒక ధర్మం మాత్రమే పైచేయి సంపాదించి ఋతుప్రస్థానాన్ని భంగపరుస్తుంది.

అది విధ్వంసకరంగానూ, ప్రమాదకరంగానూ పరిణమిస్తుంది. దాంతో వృక్ష, జంతుజాలాన్ని వ్యాధులు చుట్టుముడతాయి. హిమపాతాలూ, వడగళ్లూ, చీడపీడలూ పుట్టుకొస్తాయి. ప్రకృతిలో సంభవించే ఇటువంటి ప్రేమవైపరీత్యాలకీ, గ్రహ, నక్షత్రగతులకీ, ఋతుపరిభ్రమణానికీ మధ్య ఉండే సంబంధాన్ని అర్థం చేసుకోవడమే ఖగోళశాస్త్రమంటాం.

ఆ మాటకొస్తే అన్ని యజ్ఞాలూ, మొత్తం దైవసంబంధమైన క్రతుకాండా, మనుషులకీ, దేవతలకీ మధ్య భావప్రసారం ఇవన్నీ కూడా మంచినెలా కాపాడుకోవడం, చెడుకి ఎలా చికిత్స చేయడం అన్నదానిగురించే. తను చేసే పనులన్నిటిలోనూ మనిషి సమరస పూర్వకమైన ప్రేమని ఆమోదించి, పెంపొందింపచేయడానికి బదులు మరొక రకమైన ప్రేమ, అంటే లౌకిక ప్రేమని అనుసరించడమే, నా దృష్టిలో అత్యంత అపవిత్ర కార్యక్రమం. అది తల్లిదండ్రులవిషయంలోగానీ, దేవతల విషయంలోగానీ బతికున్నవాళ్ళ విషయంలో గానీ, మరణించినవాళ్ళ విషయంలోగానీ.

కాబట్టి దైవశాసనాన్ని గుర్తుపట్టడమంటే ఇటువంటి లౌకిక ప్రేమల్ని గుర్తుపట్టడం, వాటిని సవ్యమొనర్చుకోవడం. దైవహృదయాన్ని తెలుసుకోవడమంటే మనుషులకీ, దేవతలకీ మధ్య సమాధానం కుదర్చడం, మానవప్రేమల్లోని ధార్మిక, అధార్మిక లక్షణాలపట్ల మరింత మెలకువ సంపాదించడం. ప్రేమలోని సర్వశక్తిమత్వం అది. దాని మహిమ అది.

శుభలక్షణసమన్వితమైన ప్రేమ సామరస్యంవల్లా, న్యాయదృష్టివల్లా బలపడుతుంది. మనుషుల్లోగానీ, దేవతల్లోగాని దాని శక్తి అపారం. మన సకల సంతోషాలకూ, మొత్తం సామరస్యానికే అదే ఆధారకేంద్రం. మనల్ని మనలో మరొకరితోనూ, పైనున్న

దేవతలతోనూ స్నేహితులుగా మార్చగలిగేది అదే.

ప్రేమగురించి మరింత ప్రశంసిస్తూ చెప్పవలసిన మరెన్నో సంగతులు చెప్పకుండానే వదిలేసాను అని ఒప్పుకుంటున్నాను. కాని అది కావాలని చేసింది కాదు. నేను వదిలిపెట్టినదాన్ని, అరిస్టొఫెనీస్, నువ్వు పూరించు, లేదా నీకు నచ్చిన పద్ధతిలో ప్రేమప్రశంస చేపట్టు. చూడబోతే నీ ఎక్కిళ్ళు ఆగిపోయినట్టే ఉంది' అని అన్నాడు ఎరిక్సిమేకస్.

## 15

'అవును, ఎక్కిళ్ళు ఆగిపోయాయి' అన్నాడు అరిస్టొఫెనీస్, ప్రసంగం మొదలుపెడుతూ. 'అయితే, తుమ్మడం మొదలెట్టాకగానీ తగ్గలేదనుకో. బహుశా ఇలా పుల్లపెట్టి ముక్కులో తిప్పుకోడమంటేనూ, ఈ తుమ్ములంటేనూ మన దేహంలో ఉండే సామరస్యానికి బాగా ఇష్టంలాగా ఉంది. ఎందుకంటే ఇలా తుమ్మడం మొదలుపెట్టానో లేదో అలా ఎక్కిళ్ళు ఆగిపోయాయి' అని కూడా అన్నాడు.

'జాగ్రత్త మిత్రమా, నువ్వు మాట్లాడటానికి లేస్తూ, నన్ను ఆటపట్టిస్తున్నావు. నువ్వు బాగానే మాటాడొచ్చేమోగాని, చూస్తాను, నాకు మాత్రం అవకాశం దొరక్కపోదా, నిన్ను వేళాకోళం ఆడటానికి' అని అన్నాడు ఎరిక్సిమేకస్.

'సరే, మంచిది' అన్నాడు అరిస్టొఫెనీస్ నవ్వుతూ. 'నా మాటలు వెనక్కి తీసుకుంటున్నాను, కాని మరీ అంతలా గుర్రుమంటూ చూడకు. తీరా నేను మాటాడ బోయేటప్పుడు నలుగురినీ నవ్వించడానికి బదులు నేనే నవ్వులపాలవుతానేమోనని భయంగా ఉంది.'

'నువ్వు ముందే ఈ మాటలు చెప్పేసి తప్పించుకుందాం అనుకుంటున్నావేమో, అరిస్టొఫెనీస్, జాగ్రత్త, నువ్వు మాట్లాడేది మొత్తం మాట్లాడేక, అప్పుడు చూస్తాను, నిన్ను వదిలిపెట్టాలో లేదో' అన్నాడు ఎరిక్సిమేకస్.

అరిస్టొఫెనీస్ తన చర్చతో మరొక పార్శ్వానికి తెరతీసాడు. పౌసనియస్, ఎరిక్సిమేకస్‌ల లాగా కాకుండా, అతడు ప్రేమని మరొక పద్ధతిలో ప్రశంసించాలనుకున్నాడు. 'మనుషులు ప్రేమదేవతని నిర్లక్ష్యం చేసినదాన్ని బట్టి చూస్తే అసలు వాళ్ళు ప్రేమశక్తిని ఇప్పటిదాకా సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారు' అని అనిపిస్తోంది అన్నాడు అరిస్టొఫెనీస్.

'మనుషులే గనుక ప్రేమబలాన్ని సరిగా అర్థం చేసుకుని ఉంటే ఈ పాటికి ప్రేమకి

దేవాలయాలు కట్టి ఉందురు, గొప్ప అర్చావేదికలు ప్రతిష్ఠించి ఉందురు, గంభీరమైన పూజలూ, ప్రార్థనలూ మొదలుపెట్టి ఉందురు. కాని ఇవేవీ జరగలేదు. నిజానికి ఇవన్నీ తప్పకుండా చేసి తీరవలసినవి. ఎందుకంటే, దేవతలందరిలోనూ, ప్రేమ దేవత మనుషులకి సర్వశ్రేష్ఠ స్నేహితుడు. మానవాళి సంతోషానికి విఘాతం కలిగించే దోషాల్ని నయం చేసి వాళ్ళని స్వస్థపరచగల హితైషి అతడు. అతడి శక్తి ఎటువంటిదో ముందు వివరిస్తాను.

ఇప్పుడు నేను మీతో చెప్పేదాన్ని రేపు మీరు మొత్తం ప్రపంచం వినేలాగా చెప్పండి. మొదట నా ప్రసంగంలో మనిషి మౌలికస్వభావాన్ని వివరిస్తాను. ఆ స్వభావానికి ఏమి జరిగిందో కూడా చెప్తాను.

అసలు మొదట్లో మానవస్వభావం ఇలా ఉండేది కాదు, వేరేలా ఉండేది. ఇప్పుడు మనం చూస్తున్నట్టుగా మనుషులు లైంగికంగా రెండువిధాలుగా ఉండేవారు కాదు. మూడు విధాలుగా ఉండేవారు. పురుషుడు, స్త్రీ, వారిద్దరూ కలిసి ఉండే మరొక రూపం. ఒకప్పుడు అస్తిత్వంలో ఉండి, ఇప్పుడు కనుమరుగైన, ఆ మిథున రూపాన్ని స్త్రీ-పురుషమూర్తి[27] అని పిలిచేవారు. ఇప్పుడు ఆ పదం అర్ధనారిగా గౌరవహీనంగా మిగిలిపోయింది.

మరొకసంగతేమిటంటే ఆదిమమానవుడు గోళాకారంగా ఉండేవాడు. అతడి వీపూ, పక్కలూ కూడా ఒక గోళాకృతిలో ఒంపు తిరిగి ఉండేవి. అతడికి నాలుగు చేతులూ, నాలుగు పాదాలూ ఉండేవి. ఒకటే తల, కాని రెండు ముఖాలుండేవి. ఆ రెండు ముఖాలూ పరస్పర విరుద్ధదిశల్లో చూస్తుండేవి. మెడ గుండ్రంగా ఉండేది. ఇంకా నాలుగుచెవులుండేవి. రెండు జతల జననాంగాలుండేవి. తక్కినవన్నీ కూడా ఆ రూపాన్ని తగ్గట్టే ఉండేవి, అదంతా మీరూహించుకోవచ్చు.

## 16

ఇప్పుడు మనుషులు నడుస్తున్నట్టే అప్పుడు కూడా మనిషి నిటారుగానే నడిచేవాడు. ముందుకీ, వెనక్కీ, ఎలా కావాలంటే, అలా. మరీ వేగంగా పరుగెత్తాలనుకున్నప్పుడు తన నాలుగు చేతుల్తోనూ, నాలుగు పాదాలతోనూ వేగంగా దొర్లిపోగలిగేవాడు. పెద్ద పెద్ద గిన్నెలు గాల్లో తేలిపోతున్నట్టుగా ఉండేది అలా దొర్లుతుండటం చూస్తే.

లింగవిభజన విషయానికి వస్తే నేను ముందే చెప్పినట్టుగా మూడు లింగాలుండేవి, సూర్యుడూ, చంద్రుడూ, భూమీ-మూడున్నట్టుగా. మనిషి మౌలికంగా సూర్యపుత్రుడు. స్త్రీ అవనిజ. స్త్రీ-పురుషమూర్తి చంద్రజుడు. ఎందుకంటే చంద్రుడిలో సూర్యుడూ, భూమీ

రెండూ ఉన్నాయి కదా. ఆ మూడు లింగమూర్తులూ కూడా మొదట్లో వారి తల్లుల్లాగే గుండ్రంగా ఉండేవారు. వాళ్ళ శక్తీ, సామర్థ్యం అపారంగా ఉండేవి. వాళ్ళ హృదయాల్లో భావాలు మహత్తరంగా ఉండేవి.

హోమర్ అన్నట్టుగా ఒటస్, ఎఫియాల్టిస్[28] ల కథ వాళ్ల గురించి చెప్పిందే. వాళ్ళు ద్యులోకం అంచులు తాకి, దేవతల్ని కూడా దాటిపోగలిగేట్టుగా ఉండేవారు. దాంతో దేవసభలో ఆందోళన చెలరేగింది.

ఒకప్పుడు రాక్షస జాతిని సంహరించినట్టుగానే ఈ జాతిని అశనిపాతాల్తో సంహరించవచ్చుగానీ, అప్పుడు మనుషులు తమకి సమర్పిస్తున్న ఆరాధనలూ, నైవేద్యాలూ ఆగిపోతాయేమో అని అనుమానమొచ్చింది. మరొకవైపు ఈ మానవుల ఔద్ధత్యాన్నీ, విశృంఖలత్వాన్నీ దేవతలు ఇంకెంతమాత్రం సహించలేని స్థితికూడా నెలకొనింది.

ఎట్టకేలకు, చాలా తీవ్రంగా మథనపడ్డాక, జ్యూస్ ఒక దారి కనుక్కున్నాడు.

'వాళ్ళ గర్వాన్ని అణచివేసి వాళ్ళని సరైన దారిలో పెట్టడానికి నాకో ఆలోచన తట్టింది. మనుషజాతి కొనసాగుతుందిగానీ, మనం వాళ్ళని రెండుగా విడదీద్దాం. అప్పుడు వాళ్ళు తమ శక్తిలో సన్నగిల్లి, సంఖ్యలో మాత్రం అధికమవుతారు. దానివల్ల వాళ్ళనుంచి మనకి ప్రయోజనం కూడా ఉంటుంది. వాళ్ళు రెండు కాళ్ళమీదా నిటారుగా నడుస్తారు. కాని తమ అహంకారం తగ్గించుకోకుండా ఇంకా పొగరుమోత్తనంతో నడిస్తే మాత్రం వాళ్ళని మళ్ళా రెండు ముక్కలు చేసి ఒంటికాలిమీద గెంతేటట్టు చేస్తాను' అని అన్నాడాయన.

అప్పుడు మనుషుల్ని ద్విధావిభజించాడు. పచ్చడి పెట్టడంకోసం బేరికాయని రెండు ముక్కలు చేసినట్టు. లేదా ఒక సన్నటితాటితో గుడ్డుని రెండుముక్కలుగా తుంచినట్టు, వాళ్లని ఒకరివెనక ఒకరిని రెండేసి ముక్కలు చేసాడు.

అప్పుడు వాళ్ళ మెడా, ముఖమూ దగ్గరగా చేర్చి వాళ్ల ఆకృతులు పూర్తిచేయమని అపోలో3ని ఆదేశించాడు. ఆ విధంగా ఆయన మనుషులకు వినయవిధేయతల పాఠం నేర్పాడు.

ఆ ఖండితాంగాల్ని దగ్గరచేసి వాటికి సంపూర్ణాకృతినిచ్చి, ఆ గాయాల్ని స్వస్థపరిచే పని అపోలోకి అప్పగించాడు. దాంతో అపోలో [29] మనిషి ముఖాన్ని ఒకవైపుకి తిప్పి, చుట్టూ ఉన్న చర్మాన్ని ఒకపక్కకు లాగేడు. మనం మన భాషలో పొట్ట అని పిలిచేది అదే. అదొక తోలుసంచిలాంటిది. దానికి మధ్యలో నోరులాగా ఒక బెజ్జం పెట్టి దాన్ని మళ్లీ ముడేసాడు. (ఆ ముడినే మనం బొడ్డు అని పిలుస్తున్నాం.)

# 17

ఆ తర్వాత అతడు వక్షస్థలాన్ని తీర్చిదిద్దాడు. చెప్పులు కుట్టేవాడు సానమీద తోలుని సాగదీసినట్టుగా ముడతల్ని చాలావరకూ సాపుచేసేసాడు. అయితే పూర్వం ఉండే ఆకారానికి గుర్తుగా పొట్టదగ్గరా, బొడ్డుదగ్గరా కొన్ని ముడతలు వదిలిపెట్టేసాడు. ఇలా రెండుగా విభజించాక, మనిషిలోని రెండు భాగాలూ, తన పూర్వపు అర్థభాగంకోసం తహతహలాడటం మొదలుపెట్టాయి.

ఒకదానికొకటి చేరువగా వచ్చి, తమ బాహువుల్తో ఒకరినొకరు దగ్గరగా లాక్కుని, పరస్పరం కౌగిలింతల్లో ఒకరినొకరు చుట్టుకుపోవడం మొదలుపెట్టారు. వారిద్దరూ కలిసి ఒకటిగా ఎదగాలని ఆరాటపడటం మొదలుపెట్టారు. ఒకరిని వదిలి మరొకరు ఏమీ చెయ్యడానికి ఇష్టపడక, వారు ఆకలితో కృశిస్తూ తమ దేహాల్ని తాము పట్టించుకోకపోవడం వల్ల దాదాపుగా మరణావస్థకు చేరుకున్నారు. వారిద్దరిలో ఒకరు మరణించి, మరొకరు మిగిలి ఉంటే, ఆ మరొక భాగం మరొక అర్థభాగం– స్త్రీ లేదా పురుషుడు అని మనం పిలుస్తున్నామే, అది, పూర్తి స్త్రీదేహం లేదా పూర్తి పురుషదేహం కోసం వెతుక్కుంటూ దానికి కరుచుకుపోయేది. ఆ నలుగులాటలో వాళ్లు నశించిపోవడం మొదలుపెట్టారు.

సర్వేశ్వరుడు జ్యూస్‌కి వాళ్ల పరిస్థితి చూసి జాలికలిగింది. ఆయన మరొక కొత్త దారి ఆలోచించాడు. మనుషుల దేహాలకి వెనకవైపు ఉన్నవాళ్ల జననాంగాల్ని ఆయన ముందువైపుకు తీసుకొచ్చాడు. మొదట్లో ఇలా ఉండేది కాదు. ఇంతకుముందు చిమ్మెటల్లాగా వాళ్ళ శుక్రకణాల్ని నేరుగా భూమిలో విత్తడానికి వీలుగా ఉండేది. ఇప్పుడు దానికి బదులు తమ సంతానబీజాల్ని ఒకరిలో మరొకరు వదిలిపెట్టే ఏర్పాటు చేసాడు.

ఈ కొత్త ఏర్పాటు వల్ల స్త్రీలద్వారా పురుషులు కూడా పుట్టే అవకాశం ఏర్పడింది. స్త్రీపురుషులు తమ పరస్పర పరిష్వంగాల వల్ల సంతతిని కనగలిగే వీలుచిక్కింది, తద్వారా మనుష్య జాతి కొనసాగే అవకాశం కలిగింది. లేదా ఒక పురుషుడు మరో పురుషుణ్ని సమీపించినప్పుడు కూడా సంతోషం పొంది ఆ తర్వాత ఎవరి పనులు వాళ్ళు చేసుకునే వీలు కలిగింది.

ఒకరిపట్ల మరొకరికి కలిగే ఈ ఆకాంక్ష మనలో అత్యంత ప్రాచీనకాలం నుంచీ వస్తున్న దాహం. ఆ కోరిక ద్వారా మనం మన మౌలిక స్వభావానికి తిరిగి చేరుకోగలుగాం, ఇద్దరం ఒకరు కాగలుతాం, మనిషి చిక్కుకున్న పరిస్థితి నుంచి అతణ్ణి స్వస్థపరుచు కోగలుగుతున్నాం. మనం ఇరువురం విడివిడిగా ఉన్నప్పుడు, సగానికి కోసిన చేపలాగా

ఒక అర్థభాగంతోటే సరిపెట్టుకోవలసి రావడం తప్పనిసరి అమరిక అయి కూచుంది. కాబట్టే మనం ఎప్పుడూ మన రెండో భాగంకోసం వెతుక్కుంటూనే ఉంటాం. ఒకప్పుడు స్త్రీ-పురుషమూర్తిగా, ఒక మిథునంగా ఉన్న అస్తిత్వంలో, ఇప్పుడు పురుషులుగా విడిపోయిన వాళ్ళు స్త్రీప్రేమికులుగా మారేరు. వ్యభిచారులైన పురుషులూ, కాముకులైన స్త్రీలూ కూడా ఈ కోవలోకే వస్తారు.

అలా కాక, అప్పుడు పూర్తి స్రీలుగా ఉన్నవాళ్ళనుంచి ఇప్పుడు పూర్తి స్త్రీలుగా విడివడ్డవాళ్ళు పురుషులకోసం తపించకుండా స్త్రీలతోటే అనుబంధం పెంచుకోవాలనుకుంటారు. పరస్పర స్త్రీప్రేమికులంతా ఈ కోవలోకి వస్తారు.

అలాగే ఒకప్పటి పురుషులనుంచి ఇప్పుడు పురుషులుగా విడివడ్డవారు యువకుల వెంట, పురుషుల వెంటపడి వాళ్ళని కావిలించుకోవాలనీ, కలిసిపడుకోవాలనీ కోరుకుంటూ ఉంటారు. వాళ్ళ స్వభావంలో పురుషస్వభావమే అధికంగా ఉందికాబట్టి వాళ్లనే అత్యుత్తమ పురుషులని చెప్పవచ్చు.

## 18

అటువంటి మగవాళ్ళకి సిగ్గులేదని కొందరంటారుగాని అది నిజం కాదు. ఎందుకంటే వాళ్ళు అలా ప్రవర్తించేది సిగ్గులేకకాదు, వాళ్ళు పురుషులుగానూ, వీరోచితంగానూ ఉండాలనుకుంటున్నారుకాబట్టీ, పురుషసౌందర్యం వారిలో పొంగిపొర్లుతున్నదికాబట్టీ, వాళ్ళు తమలా కనిపించేవాళ్ళని దగ్గరగా తీసుకోవాలనుకుంటారు. వాళ్ళు పెరిగి పెద్దయ్యాక నేతలుగానూ, రాజనీతివేత్తలుగానూ రూపొందుతున్నారు.

నేను చెప్పేదానిలో సత్యముంది అనడానికి ఇదే సాక్ష్యం. వాళ్ళు యుక్తవయసురాగానే యువకుల్ని ప్రేమించడం మొదలుపెడతారు, సహజంగానే పెళ్ళిమీదా పిల్లలమీదా ఆసక్తి చూపించరు. ఒకవేళ పెళ్ళిచేసుకున్నా, పిల్లల్ని కన్నా, అది కేవలం సామాజిక బాధ్యత వల్ల మాత్రమే. కాని తమలాగా అవివాహితులైన మరొకరితో జీవించడానికి వీలైతే వారికదే ఎంతో తృప్తి. అటువంటి స్వభావం కలిగినవాళ్ళు ప్రేమించగలుగుతారు, తమకి లభిస్తున్న ప్రేమకి తమ జీవితాలు మొత్తం గడిపెయ్యగలవాళ్ళు ఇటువంటివాళ్ళే. కానీ తమలో ఒకరి పట్ల మరొకరికి అంత కాంక్ష ఎందుకు చెలరేగుతున్నదో వారు వివరించలేరు.

అలా వాళ్ళల్లో పరస్పరం ఒకరిపట్ల మరొకరికి కలుగుతున్న ఆరాటం మామూలుగా స్త్రీపురుషుల్లో కలిగే లైంగికాభిలాషలాంటి కాదు. అది మరేదో తరహాది, ఇద్దరి ఆత్మలూ

దానికోసమే కొట్టుకుపోతున్నప్పటికీ దాన్ని వారు వివరించి చెప్పలేరు. కాని దాని గురించి వాళ్ళ వాళ్ళ ఆత్మల్ని మాత్రం ఏదో ఒక అనుమానం, ఒక సందేహం తొలిచివేస్తూనే ఉంటుంది.

వాళ్ళు ప్రేమైకచిత్తులై ఒకరిపక్కన ఒకరు పడుకున్నప్పుడు, హెఫిస్టస్ [30]తన పనిముట్లు పట్టుకొచ్చి 'చెప్పండి, మీకు ఒకరినుంచి ఒకరి ఏం కావాలి?' అనడిగితే వాళ్ళేమీ చెప్పలేరు.

సరే, వాళ్ళలా అయోమయంలో పడిపోవడం చూసి అతగాడు వాళ్ళతో ఇలా అన్నాడనుకుందాం:

'మీరిద్దరూ ఒకరిగానే ఉండాలనుకుంటున్నారా? ఎప్పటికీ, పగలూ, రాత్రీ, ఒకరి సన్నిధిలో మరొకరు ఉండాలనుకుంటున్నారా? ఒకవేళ మీరు కోరుకునేదిదే అయితే నేను మీ ఇద్దర్నీ కరిగించి ఒక్కటిగా పోతపొయ్యడానికి సిద్ధంగా ఉన్నాను. అప్పుడు మీరిద్దరూ ఒకరుగా, ఒకే ఒక్క మనిషిలాగా, ఒకటే జీవితం జీవించగలుగుతారు. మీరు మరణించినా కూడా పాతాళలోకానికి ఒకే ఆత్మగా ప్రయాణిస్తారే తప్ప వేరువేరుగా పయనించరు. మీ ప్రేమానురాగమంతటితోనూ మీరు కోరుకునేది ఇదేనా, నేను చెప్పినట్టు చేస్తే మీకిష్టమేనా తెలుసుకోడానికే ఇలా అడుగుతున్నాను' అని అడిగాడనుకోండి.

అప్పుడు వాళ్ళిద్దరిలో ఏ ఒక్కరు కూడా ఆ ప్రతిపాదనని తిరస్కరిస్తారని అనుకోను. ఎందుకంటే ఇలా ఇద్దరూ రెండుగా కరిగిపోయి ఒకరు కావడం, ఒకరిలో ఒకరు ఒదిగి పోవడం, ఇదే, తమ ప్రాచీనకాంక్ష ఇదే అని ఒప్పుకోడానికి వాళ్లెంత మాత్రం సందేహించరు. ఎందుకంటే మానవస్వభావం మౌలికంగా ఒకటే, మనం ఏకంగానే ఉండేవాళ్లం, ఇలా ఆ అతీతకాలపు ఏకత్వంకోసం మనలో చెలరేగుతున్న ఆ ప్రాచీన దాహాన్నే నేను ప్రేమ అని పిలుస్తున్నాను.'

## 19

అరిస్టోఫెనీస్ ఇంకా ఇలా చెప్తున్నాడు: 'మనం ఏకంగా ఉండే కాలం ఒకటుండేది. కాని మన కుటిలత్వం వల్ల దేవుడు మనల్ని విడదీసేసాడు. అర్కాడియన్లని స్పార్టన్లు[31] చెల్లాచెదురుగా గ్రామాల్లోకి తరిమేసినట్టు.'

మనం దేవతల పట్ల విధేయంగా లేకపోతే మళ్లా రెండు ముక్కలైపోయే ప్రమాదం ఉంది. అప్పుడు మనం శిల్పాల్లో చూస్తామే అలాగ సగం ముక్కుతో మాత్రమే తిరగాల్సి ఉంటుంది. అప్పుడు మనం మనవాళ్ళు ఒప్పందాలు చేసుకునేటప్పుడు చెరోముక్కా దగ్గర

పెట్టుకుంటారే అలాగ రెండు ముక్కలై తలా ఒకచోటా తిరక్కతప్పదు. కాబట్టి మనుషులంతా ధార్మికంగా మసలుకోవడం అవసరమని నలుగురికీ బోధిద్దాం. చెడుని దూరంగా పెట్టమనీ, మంచిని పెంచమనీ చెప్దాం. ప్రేమదేవతనే మనకి అధినేతా, సలహాదారూ కావాలి. ఏ ఒక్కరూ అతణ్ణి వ్యతిరేకించకూడదు. ఆయన్ని ఎవరు వ్యతిరేకిస్తారో వారు దేవతలకి శత్రువుల్లాంటివారు. మనం భగవంతుడికి స్నేహితులమై ఆయనతో శాంతిగా ఉండగలిగితే మన యథార్థప్రేమల్ని మనం పొందగలుగుతాం. కానీ ప్రస్తుత ప్రపంచంలో ఇలా జరగడం చాలా అరుదు.

నేను గంభీరమైన ప్రసంగం చేస్తున్నాను. కాబట్టి నన్ను వేళాకోళం చెయ్యొద్దని ఎరిక్సిమేకస్‌ని అడుక్కుంటున్నాను. అగథాన్, పౌసనియస్ ఇద్దరూ కూడా పురుషస్వభావాన్ని పుణికిపుచ్చుకున్నవాళ్ళే. కాబట్టి నేను ఏ తరహా మనుషుల గురించి మాట్లాడుతున్నానో అదంతా అగథాన్, పౌసనియస్‌ల్ని ఉద్దేశించే చెప్తున్నానని అనుకోవద్దు.

నేను మాట్లాడుతున్నది విస్తృతమానవాళి గురించి, అందులో సమస్త స్త్రీపురుషులూ వచ్చిచేరతారు. మనం మన ప్రేమల్ని పరిపూర్ణంగా పొందగలిగితే, మనలో ప్రతి ఒక్కరం మన అనాదిస్వభావానికి చేరుకోగలిగితే, మానవజాతి సుఖపడుతుందని నా నమ్మకం. ఇది మనం కోరదగ్గ అత్యున్నతస్థితి అనుకుంటే, ఇప్పుడు మనమున్న పరిస్థితుల్లో కోరుకోదగ్గ పరిస్థితి అటువంటి ప్రేమలకోసం వెతుక్కోవడమే. అప్పుడే మనం సానుకూల మైన ప్రేమని పొందగలుగుతాం.

మనకి ఇటువంటి వరాన్ని ప్రసాదించినవారిని కీర్తించడమంటే, ప్రేమదేవతను స్తుతించడమే. మన నిజమైన వరప్రదాత ఆయనే.

ఆయన ఒకవైపు మనల్ని మన అనాదిస్వభావం వైపు నడిపిస్తూ, మరొకవైపు భవిష్యత్తు పట్ల మనలో గొప్ప ఆశలు రేకెత్తిస్తున్నాడు. మనం పవిత్రంగా ఉండగలిగినట్టైతే మన అనాదిస్వభావానికి చేరుకోగలుగుతామనీ, తద్వారా మనం స్వస్థపడగలుగుతామనీ, ధన్యులమవుతామనీ వాగ్దానం చేస్తున్నాడు.

ఇదీ, ఎరిక్సిమేకస్, నేను ప్రేమగురించి చెయ్యగలిగిన ప్రసంగం. ఇది నువ్వు మాట్లాడినదానికన్నా భిన్నంగా ఉంది నిజమేకాని, దాన్ని నీ వ్యంగ్యబాణాలతో తూట్లు పొడవకు. తక్కినవాళ్ళని కూడా మాట్లాడనివ్వు. ఇంకా మాట్లాడవలసినవాళ్లల్లో అగథాన్, సోక్రటీస్, ఇద్దరే మిగిలారు' అని అన్నాడు అరిస్టోఫెనీస్.

## 20

'నేను నిన్ను ఖండించబోవడంలేదులే' అన్నాడు ఎరిక్సిమేకస్.

'నిజానికి నువ్వు చాలాబాగా మాట్లాడేవు. సోక్రటీస్‌కీ, అగథాన్‌కీ ప్రేమవ్యవహారాల గురించి అంతగా తెలుసనుకోను. కాబట్టి వాళ్ల దగ్గర మాట్లాడటానికేమీ ఉండకపోవచ్చు. ఇప్పటిదాకా చెప్పినవాటికన్నా అదనంగా వాళ్ళదగ్గర చెప్పడానికేమీ లేకపోవచ్చు. అలాగని నాకు ఆశ లేదని కూడా చెప్పను.'

'నువ్వు నీ పాత్ర బాగానే పోషించావు, ఎరిక్సిమేకస్' అన్నాడు సోక్రటీస్.

'కానీ ఇప్పుడు నా పరిస్థితిలో నువ్వుంటే, లేదా అగథాన్ మాట్లాడాక నా పరిస్థితిలో నువ్వుంటే నా కష్టం నీకు తెలిసుండేది' అని కూడా అన్నాడు.

'నువ్వు నా మీద సమ్మోహనాస్త్రం ప్రయోగిస్తున్నావు సోక్రటీస్' అని అన్నాడు అగథాన్. 'శ్రోతలు నేనేదో మహాప్రసంగం చెయ్యబోతున్నానని ఎదురుచూస్తున్నారనే భ్రాంతికి లోనయ్యేట్టున్నాను నీ మాటలు వింటుంటే' అని కూడా అన్నాడు.

'ఆ రోజు రంగస్థలం మీద నీ నాటకం ప్రదర్శించబోతున్నప్పుడు నువ్వెంత ధీరత్వంతో, ఆత్మవిశ్వాసంతో నీ నాటకబృందంతో కలిసి ఆ మహాజనసమూహం ఎదట నిలబడ్డావో నాకు గుర్తులేకుండా ఎలా ఉంటుంది అగథాన్?' అనడిగాడు సోక్రటీస్.

'అంత జనసమూహం ముందే తొట్రుపడనివాడివి, ఈ నలుగురైదుగురు మిత్రుల ముందు మాట్లాడలేవని ఎలా అనుకుంటాను చెప్పు?'

'అంటే ఏమిటి సోక్రటీస్? నన్ను రంగస్థలం మరీ అంత గుడ్డివాణ్ణి చేసిందా ఏమిటి? అసంఖ్యాకులైన మూర్ఖప్రేక్షకుల కన్నా నలుగురైదుగురు న్యాయనిర్ణేతల ముందు నిలబడటంలో కష్టమేమిటో నాకు తెలియదా?' అనడిగాడు అగథాన్.

'కానే కాదు' అన్నాడు సోక్రటీస్.

'నీ విషయంలో నాకు మరో ఆలోచనంటూ ఏమీ లేదు. నువ్వు ఎవరిని వివేకవంతులుగా భావిస్తావో వారిని కలుసుకున్నప్పుడు వాళ్ళ అభిప్రాయానికి విలువ నిస్తావని నాకు తెలుసు. అసంఖ్యాకులైన వివేకశూన్యులకన్నా ఆ ఒక్క వివేకీ నీకు ఎంతో ఎక్కువ. అయితే ఆ రోజు ఆ వివేకశూన్య ప్రేక్షకసమూహంలో మేం కూడా ఉన్నాం. కాబట్టి నువ్వు చెప్తున్న ఆ కొద్దిమంది వివేకవంతుల్లో మేము లేమని మాకు తెలుసు. అలాగని నువ్వు మాలో ఒకరిముందు కాదు, నువ్వు నిజంగానే వివేకవంతుడిగా భావించే

వ్యక్తి సన్నిధిలో ఉన్నావనుకో, అతడి ముందు నిన్ను నువ్విలా కించపరుచుకోవు కదా?' అన్నాడు సోక్రటీస్.

'అవును' అన్నాడు అగథాన్.

'అదే జ్ఞానశూన్యులైన జనబాహుళ్యం ముందు నిలబడ్డప్పుడు అగౌరవమైన పని చేసినా కూడా సిగ్గుపడవు కదా.'

కాని ఫెద్రోస్ అతడి మాటలకు అడ్డుపడ్డాడు.

'అగథాన్! ఆయన మాటలకి జవాబివ్వకు. ఆయనతో మాట్లాడటానికి ఒక మనిషి దొరికితే, అది కూడా అందమైన మనిషి దొరికితే, మన ప్రసంగాల సంగతి పూర్తిగా మర్చిపోతాడు. ఆయన మాట్లాడితే వినాలని నాక్కూడా ఉంది. కాని ముందు మనం ప్రేమదేవత ప్రశంస పూర్తిచెయ్యాలి. మనం అనుకున్నట్టుగా ఆయనా, మిగిలినవాళ్లూ కూడా ప్రసంగించాలి. ఇప్పుడు నువ్వూ, ఆయనా కూడా ప్రేమప్రసంగాలు పూర్తిచేసాక అప్పుడు మీరు తీరిగ్గా మాట్లాడుకోవచ్చు' అని అన్నాడు ఫెద్రోస్.

'బావుంది ఫేద్రోస్' అన్నాడు అగథాన్.

'ముందు నా ప్రసంగం పూర్తిచేస్తాను. సోక్రటీస్‌తో ఇంకా చాలాసార్లు మాటాడు కోవచ్చు. ఇప్పుడు నేను ఏం చెప్పబోతున్నానో చెప్పి అప్పుడు విషయంలోకి వెళ్తాను' అని మొదలుపెట్టాడు.

'నా ముందు మాట్లాడిన వక్తలు ప్రేమదేవతను స్తుతించడానికి బదులు, ఆయన స్వరూపస్వభావాల్ని వివరించడానికి బదులు, ఆయన అనుగ్రహం పొందినందుకు మానవాళిని అభినందనలతో ముంచెత్తారు. కాని నేను ముందుగా ప్రేమదేవతని ప్రశంసించాలనుకుంటున్నాను. అప్పుడు ఆయన మానవజాతికిచ్చిన వరాల గురించి మాట్లాడతాను. దేన్నైనా ప్రశంసించడానికి ఇదే సరైన పద్ధతి.

మొత్తం దేవతానీకమంతటిలోనూ ఆయనే అందమైనవాడూ, సర్వశ్రేష్ఠుడూ అని చెప్పడంలో తప్పులేదు కదా. ఆయన గొప్ప అందగాడు. అందరిలోనూ ఆయనే చిన్నవాడు, ఆయన యవ్వనమే దానికి సాక్ష్యం. అతడి వేగంవల్ల వార్ధక్యం అతణ్ని ఎప్పటికీ అందుకోలేదు. మనుషుల మీద ముసలితనం ఎలా విరుచుకుపడుతుందో మనకందరికీ తెలుసు. అది మామూలుగా కన్నా కూడా మరింత వేగంగా ముంచెత్తుతుంది. ప్రేమదేవతకి వార్ధక్యమంటే సహజద్వేషం. ఎట్టిపరిస్థితిలోనూ దాని దగ్గరికే పోడు. ప్రేమదేవత చెలిమి

ఎప్పుడూ యవ్వనంతోనే. 'ఒక్కలాంటివాళ్ళే ఒక్కచోట చేరతారు' అనే సామెత ఎలానూ ఉంది కదా'.

'హెసియోదూ, పార్మెనిడిసూ దేవతల కార్యకలాపం గురించి చెప్పినమాటలు నిజమే అనుకుంటే, అవన్నీ దేవతలు అవసరం కొద్దీ చేసినవి తప్ప, ప్రేమతో చేసినవి కావని పిస్తుంది. ఆ రోజుల్లో ప్రేమదేవత ఉండిఉంటే, దేవతలు సంకెళ్ళలో తగులుకుని ఉండేవారు కాదు, వికృతరూపులయ్యేవారు కాదు. లేదా ఇంకా అలాంటివే హింసాత్మక చర్యలుండేవి కావు.

వాటి బదులు, ప్రేమ సామ్రాజ్యం మొదలయ్యాక ఇప్పుడు స్వర్గంలో కనవస్తున్నట్టే, అప్పుడు కూడా శాంతీ, మాధుర్యమూ వెల్లివిరిస్తూ ఉండేవి. ప్రేమ దేవత యువకుడు మాత్రమే కాదు, సుకుమారుడు కూడా. అతడి లాలిత్యాన్ని ప్రశంసించడానికి హోమర్ లాంటి కవి పుట్టి ఉండవలసింది. ఎట్ [32]గురించి హోమర్ వర్ణించాడే, ఆమె యవ్వనవతి, కోమలి, అంటో, అలాగ. హోమర్ ఏమన్నాడో గుర్తుంది కదా

> 'ఆమె చరణాలు ఎంత మృదువంటే, ఆమె నేలమీద కాదు, మనుషుల శిరస్సులమీద అడుగులు మోపుతుంది.'

అని అన్నాడు కదా, అలాగ. ఆమె ఎంత కోమలమైందో చెప్పడానికి ఇంతకన్నా సాక్ష్యం లేదు. ఆమె మెత్తటివాటి మీద చరణాలు మోపుతుందిగాని, గట్టిగా ఉండేదానిమీద కాదట.'

## 21

'ప్రేమ మృదుత్వాన్ని వర్ణించడానికి కూడా మనం ఇటువంటి ఒక ఉదాహరణ వెతుకుదాం. ప్రేమదేవత కూడా నేలమీద నడవడు. అలాగని మనుషుల శిరస్సులమీద కూడా నడవడు. ఎందుకంటే మనుషుల తలకాయలు కూడా గట్టిగానే ఉంటాయి. వాటికి బదులు అతడు మనుషులవీ, దేవతలవీ హృదయాలమీదా, ఆత్మల మీదా అడుగుమోపుతాడు.

అంతకన్నా సున్నితమైనవి మరొకటి ఉండవు కదా. అతడు నడిచేది వాటిమీద, నివసించేది వాటిల్లో. ఏ ఒక్క హృదయంలో మెత్తదనం కరువైనా అతడు అక్కణ్ణుంచి వెళ్ళిపోతాడు. ఇందుకు ఎటువంటి మినహాయింపూ లేదు. మృదువైనవాటిలో మరింత మృదులతరమైన స్థలాల్లో అడుగులు వేసే ఆ దేవతకన్నా మృదువైన వారు మరొకరు ఎవరుంటారు?'

'అతడు అందరికన్నా చిన్నవాడూ, సున్నితమైనవాడే కాదు, అత్యంత సరళస్వభావుడు కూడా. సర్దుబాటుతత్త్వం లేకుండా అతడు మరీ మొండిగా ఉండి ఉంటే, అన్నిట్నీ తనతో కలుపుకుపోగలిగేవాడు కాడు. అలాగే ఎవరికీ తెలియని మనుష్యహృదయాల్లోకి అంత సులువుగా చొచ్చుకుపోగలిగేవాడు కూడా కాడు. అతడి సరళస్వభావానికీ, మానసిక సౌష్టవానికీ సాక్ష్యం అతడి దయార్ద్రహృదయమే.

దయాగుణం ప్రేమతాలూకు ప్రత్యేకలక్షణమన్నది అందరూ ఒప్పుకున్నదే. దయా రాహిత్యానికీ, ప్రేమకీ ఎప్పటికీ పొసగదు. అతడి నివాసం పూలమధ్య అన్నదాన్నిబట్టే అతడి శరీరలావణ్యం ఎటువంటిదో తెలుస్తున్నది. వాడిపోతున్నవాటిమధ్యా, వికసించని తోటల్లోనూ అతడెప్పటికీ నివసించడు. పూలమధ్యనే, పరిమళాల మధ్యనే అతడు స్థిరపడతాడు. ప్రేమదేవత సౌందర్యం గురించి నేను చాలానే చెప్పాను. ఇంకా చెప్పవలసింది ఇంకా మిగిలే ఉంది.

అతడి గుణగణాల గురించి ఇప్పుడు చెప్పవలసి ఉంది. అతడిలోని అత్యంత విశిష్ట గుణమేమిటంటే అతడు ఏ మనిషికిగాని, దైవానికి గాని ఎన్నడూ హాని తలపెట్టడు, అలాగే వారినుంచి హానిపొందడు. అతడెప్పుడయినా బాధపడితే అది బలప్రయోగం వల్ల మాత్రం కానే కాదు. నిర్బంధం, బలప్రయోగాలు అతణ్ణి సమీపించలేవు. అతడు ఏ పనిచేసినా అందులో బలప్రయోగానికి తావే ఉండదు. మనుషులంతా కూడా ఆయన్ని సేవిస్తే అది తమ ఇష్టపూర్వకంగానే సేవిస్తారు. ఎక్కడైతే స్వేచ్ఛిత కష్టభోగం ఉంటుందో, అక్కడ మన నగరాధినేతలు చెప్పినట్టుగా, న్యాయం ఉంటుంది.

ఆయన న్యాయశీలుడు మాత్రమే కాదు, సంయమనశీలి కూడా. సుఖాలకీ, కోరికలకీ సంయమనశీలినే నిజమైన నాయకుడు. ఏ సుఖం కూడా ప్రేమదేవతను శాసించలేదు. అందుకు బదులుగా ప్రేమదేవత తనే సుఖసంతోషాల యజమాని. అవి ఆయన పరిచారికలు. వాటిని జయించాడంటేనే ఆయన తప్పకుండా సంయమన శీలుడన్నట్టు లెక్క.

ధైర్యం విషయానికొస్తే యుద్ధదేవత కూడా ప్రేమదేవత ముందు నిలబడజాలడు. నిజానికి యుద్ధం కూడా ప్రేమచేతిలో బందీ. కథలో [33] చెప్పినట్టుగా, ఆఫ్రొడైట్ ప్రేమనే యుద్ధాన్ని పరిపాలించేది. యజమాని సేవకుడికన్నా బలవంతుడైవుంటాడు. ధైర్యశాలులెందరినో జయించినవాడు అందరికన్న ధైర్యశాలి అయి ఉండక తప్పదు కదా.'

'ఆయన ధైర్యం గురించీ, న్యాయశీలతగురించీ, సంయమనం గురించీ మాట్లాడేను. ఇక ఆయన వివేకం గురించి చెప్పాలి. ఆ విషయం కూడా నా శక్తికొద్దీ వివరిస్తాను.

అన్నిటికన్నా ముందు ప్రేమదేవత ఒక కవి (ఎరిక్సిమేకస్ తన కళగురించి గొప్పగా చెప్పుకున్నట్టే, నేను కూడా నా కళగురించి చెప్పుకోవాలి కదా). అతడు కవి మాత్రమే కాదు, ఇతరుల్లో కవిత్వానికి ప్రేరణకలిగించేది కూడా అతడే. తను కవి కాకపోతే మరొకర్ని కవిగా ఎలా మార్చగలుగుతాడు? అతడి స్పర్శ తగిలితే చాలు, అంతకుముందు తమకి సంగీత జ్ఞానం లేకపోయినా కూడా, ప్రతి ఒక్కరూ కవులుగా మారిపోతారు.

ప్రేమదేవత మంచి కవి అనీ, లలితకళలన్నిటిలోనూ సిద్ధహస్తుడనీ చెప్పడానికి ఇదే నిరూపణ. ఎందుకంటే ఎవరేనా తమలో లేనిదాన్ని మరొకరికి ఇవ్వలేరు కదా. తమకి ప్రావీణ్యం లేకుండా ఏ విద్యనీ మరొకరికి నేర్పలేరు కదా. సమస్త జంతుజాల సృష్టికీ ఆయనే కారణం కాదని ఎవరనగలరు? జీవకోటి మొత్తం ఆయన సంకల్పం వల్ల జనించిందే కదా.'

## *22*

'ఇక కళాకారుల్లో కూడా ప్రేమదేవతవల్ల ఎవరు ఉత్తేజితులవుతారో వారే కదా యశోవంతులవుతారు. ప్రేమ ఎవరిని స్పృశిస్తుందో వాళ్ళకి చీకటి లేదు. వైద్యశాస్త్రం, విలువిద్య, జ్యోతిష్యం అపోలో కానుకలు. కాని ప్రేమదేవత మార్గదర్శనంలోనే అపోలో వాటిని మనకు అందించాడు. అపోలో కూడా ప్రేమదేవత శిష్యుడే కదా.

అలాగే సంగీతదేవత స్వరాలు, హెఫస్టస్ లోహకళ, ఎథినా [34] చేనేత, మనుషులపైనా, దేవతలపైనా సర్వేశ్వరుడు జ్యూస్ నియంత్రణ– ఇవన్నీ కూడా ప్రేమవల్లనే సాధ్యమవు తున్నాయి. వాటిని కనుగొన్నది ప్రేమదేవతనే. అసలు దేవతావ్యవస్థనే ప్రేమ వల్ల జరిగిన ఏర్పాటు. ఎందుకంటే అవ్యవస్థ ప్రేమకి సంబంధించింది కాదు'.

'నేను మొదట్లోనే చెప్పినట్టు పూర్వపురోజుల్లో దేవతలమధ్య భయంకరమైన విషయాలు జరిగాయి. అవన్నీ అవసరార్థం జరిగినవి. కాని ప్రేమదేవత ప్రభవించిన తర్వాత ప్రేమనుంచి సౌందర్యాభిలాష జనించింది. దాన్నుంచే ద్యావాపృథ్వుల్లోని సమస్త కల్యాణగుణాలూ జనించాయి. కాబట్టి ఫేద్రోస్, ప్రేమదేవత దేవతలందరిలోనూ బహు సుందరుడూ, శ్రేష్టుడూ మాత్రమే కాదు, తక్కిన వాటన్నిటిలో ఉండే సుందర, శివంకర సమస్తానికీ ఆయనే కారకుడు. ఈ సందర్భంగా నాకో కవితావాక్యం గుర్తొస్తోంది.'

ఎవరు భూమికి శాంతిని ప్రసాదిస్తారో, తుపానుల్ని సద్దుమణిగేట్టు చేస్తారో,
ఎవరు ఝంఝామారుతాల్ని నిశ్చలమొనరుస్తారో, ఎవరు వేదనాభరిత
హృదయాలకు సాంత్వననివ్వగలుగుతారో, అతణ్ణే మనం దేవుడని పిలుస్తాం.

మనుషుల్లో ప్రేమరాహిత్యాన్ని తొలగించి వారి హృదయాల్ని అనురాగంతో నింపేవాడి కథ ఇది. ఇటువంటి విందుబల్లలదగ్గర, యాగశాలల్లో, నాట్యశాలల్లో మనుషుల్ని కలిపేది అతడే. మనల్ని ఒకరిపట్ల మరొకర్ని సుప్రసన్నుల్ని చేసేది అతడే. మన జీవితాల్లో అమర్యాద లేకుండా చేసేది అతడే. దయని పంచేదీ, దయారాహిత్యాన్నీ దూరం పెట్టేదీ అతడే, మంచివాళ్ళకు స్నేహితుడు, వివేకవంతుల సంతోషం, దేవతల ఆశ్చార్యాతిశయం ఆయన.

అతడిలో భాగంకాని వాళ్ళు కూడా అతణ్ణి కోరుకుంటారు. ఇక అతడిలో భాగమైన వాళ్ళకి అతడు ప్రియాతిప్రియుడు. సౌకుమార్యానికీ, విలాసానికీ, కోరికలకీ, ఇష్టానికీ, మృదుత్వానికీ, దయకీ పుట్టినిల్లు.

ప్రతి ఒక్క మాటలో, పనిలో, కోరికలో మంచిని పట్టించుకుంటాడు, చెడుని దూరం పెడతాడు. భయం నుంచి రక్షిస్తాడు, మనుషుల్ని ముందుకు నడిపిస్తాడు, సహచరుడు, సహాయకుడు, మనుషులా, దేవతలా వైభవం అతడే. ఉత్తముల, ఉన్నతుల నాయకుడూ అతడే. మనుషుల, దేవతల హృదయాల్ని సమ్మోహపరిచే మధురగానంలో గొంతెత్తి గానం చేస్తో ప్రతి ఒక్కరూ అనుసరించేది అతడి అడుగుజాడల్నే. కాబట్టి, మధ్యలో అక్కడక్కడ కొంత సరదాగా ఒకటి రెండు మాటలు మాట్లాడినా మొత్తం మీద ప్రేమ గురించి నా శక్తి కొలదీ నేను చేసిన ఈ గంభీర ప్రసంగాన్ని, ఫేద్రోస్, ప్రేమదేవతకు అంకితం చేస్తున్నాను' అని అన్నాడు అగధాన్.

## *23*

అగధాన్ తన ప్రసంగం ముగించగానే అక్కడొక ఉల్లాసం నెలకొనిందని అరిస్టొడెమస్ నాతో అన్నాడు. అగధాన్ తనకీ, తాను స్తుతించిన దేవతకీ తగ్గట్టుగానే చక్కగా మాట్లాడేను అనుకున్నాడు.

అప్పుడు సోక్రటీస్ ఎరిక్సిమేకస్ వైపు తిరిగి 'అకుమెనస్ పుత్రుడా, ఇప్పుడు చెప్పు, నేనిందాకా భయపడటంలో అర్థం లేదా? అగధాన్ అద్భుతమైన ప్రసంగం చేస్తాడని నేను చెప్పినప్పుడు జరగబోయేది ముందే చెప్పగలిగే ప్రవక్తని కాలేదా? అతడు ప్రసంగించాక నేను ఇబ్బందిలో పడతానని అన్నమాట నిజమయ్యింది కదా' అని అన్నాడు.

'నిజమే, అగధాన్ ప్రసంగం గురించి నువ్వు చెప్పిన జోస్యం కొంత వరకూ నిజమయినట్టే ఉంది' అని జవాబిచ్చాడు ఎరిక్సిమేకస్,

'కాని ఆ ప్రసంగం నిన్ను ఇబ్బందిలో పడేస్తుందని అనడం మాత్రం నిజం కాదు.' 'ఎందుకు కాదు మిత్రమా? అటువంటి రసరమ్యప్రసంగం విన్నాక లేచి మాట్లాడవలసి వస్తే నేనుగానీ, మరెవరైనా గానీ ఇబ్బందిలో పడకుండా ఎలా ఉంటారు?' అన్నాడు సోక్రటీస్,

'ముఖ్యంగా ఆ ప్రసంగంలో ఆ చివరి వాక్యాలు, వాటిని విని ముగ్ధులు కానివారెవరుంటారు? అటువంటి ప్రసంగంతో పోలిస్తే, నా శక్తిసామర్థ్యాలు ఏపాటివో నాకు తెలుసుకాబట్టి, నేను సిగ్గుతో పలాయనం చిత్తగించడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. అలా పారిపోడానికి వీలు చిక్కాలే గాని' అని కూడా అన్నాడు.

'నాకు గోర్గియాస్ [35] గుర్తొచ్చాడు. తన ప్రసంగంలో చివరికి వచ్చేసరికి అగథాన్ వాక్చాతుర్య మాంత్రికుడు గోర్గియాస్ లాగా నావైపు చూస్తున్నాడా అనిపించింది. హోమర్ చెప్పినట్టు ఆ గోర్గాన్ చూపు నా వాక్కుని మూగబోయేలా చేసి నన్ను శిలగా మార్చేసేటట్టే ఉంది. అప్పుడు అర్థమయింది నాకు ప్రేమ గురించిన ఈ ప్రసంగకార్యక్రమంలో నేను కూడా పాలుపంచుకోవడంలో ఎంత తెలివితక్కువతనం ఉందో. నేను కూడా వక్తనే అని అనుకున్నానుగాని, నిజంగా ఒక అంశాన్ని ఎలా ప్రశంసించాలో నాకు తెలియనే తెలియదని ఇప్పుడు తెలిసింది.'

'మనం దేన్నైనా ప్రశంసించబోతున్నప్పుడు, మన వక్తవ్యాంశాలు సత్యమై ఉండాలి అని అనుకునే అమాయకత్వం నాది. సత్యంగా ఉండే ఆ అంశాల్లోంచి ఉత్తమమైనవాటిని తీసుకుని ఉత్తమరీతిలో ప్రసంగించాలన్నది నా భావన. యథార్థమైన ప్రశంస ఎలా ఉండాలో నాకు తెలుసు కాబట్టి నేను బాగా ప్రసంగించగలనని నాకు గర్వంగా కూడా ఉండింది.

కానీ తీరా ఇప్పుడు ప్రసంగాలు వింటూ ఉంటే ప్రపంచంలోని సమస్త వైభవాల్నీ, శ్రేష్టతల్నీ, అవి నిజంగా ప్రేమదేవత గుణగణాలైనా కాకపోయినా కూడా, ఆయనకు ఆపాదించడమే ఉద్దేశ్యంగా కనబడుతోంది. అందులో సత్యమెంతో, అసత్యమెంతో పట్టించుకునే ఉద్దేశ్యమేమీ ఉన్నట్టు లేదు. చూడబోతే ఈ గోష్ఠి ఉద్దేశ్యం మనం ప్రేమదేవతని నిజంగా ప్రశంసించడం కాదు, ప్రశంసిస్తున్నట్టుగా కనిపించడమేనా అని అనుమాన మొస్తున్నది.

మీలో ప్రతి ఒక్కరూ కూడా ప్రేమదేవతని ప్రశంసించడానికి ఎక్కడ ఎటువంటి ప్రశంస కనబడితే అదంతా ఏరుకొచ్చి మరీ ఆయన్ని పొగడ్తల్తో ముంచెత్తారు. 'ఆయన

ఇవన్నీను', 'ఆయన వల్లనే ఇవన్నీను' అంటో మీరు ఆయన గురించి చెప్తున్నమాటలెలా ఉన్నాయంటే, ప్రేమ అంటే తెలియనివాళ్ళకి ఆయన్ని మించిన మంచివాడూ, అందగాడూ మరెవరూ లేరనిపించేట్టుగా ఉన్నాయి. సరే, ప్రేమ గురించి తెలిసినవాళ్ళని మీరెలానూ ప్రభావితం చెయ్యలేరు.'

'అయితే మీరు చేసిన ప్రసంగాలు మాత్రం గంభీరంగానూ, ఉదాత్తంగానే ఉన్నాయి. కానిఆ ప్రశంసాపద్ధతిని నేను సరిగ్గా అర్థం చేసుకోనందువల్ల నా వంతువచ్చేటప్పటికి నా వాగ్దానం నుంచి నన్ను తప్పించమనీ, నా అజ్ఞానాన్ని మన్నించమనీ అడిగాను. నేను కూడా ప్రసంగిస్తాను అని చెప్పిన మాట, యురిపిడిస్[36]అన్నట్టుగా, పెదాల నుంచి వచ్చిందే తప్ప, మనసులోంచి పుట్టిన మాట కాదు.

కాబట్టి ఆ తరహా ప్రసంగధోరణికి సెలవు. నేను ఆ విధంగా ప్రశంసించబోవడం లేదు. నిజానికి నేనలా ప్రసంగించలేను కూడా. కానీ మీకు నిజంగా ప్రేమ గురించి వినాలని ఉంటే, తెలుసుకోవాలని ఉంటే, నా ధోరణిలో నేను మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నాను. అలాగని మీతో వాదోపవాదాలకి దిగి నన్ను నేను చులకన చేసుకోవడం నాకిష్టం లేదు. చెప్పు ఫేద్రోస్, నువ్వు ప్రేమ గురించి సత్యం వినాలనుకుంటున్నావా? నాకు ఆ సమయానికి ఎలా స్ఫురిస్తే అలా చెప్పాలనుకుంటున్నాను. నీకది అంగీకారమేనా?'

ఫేద్రోస్, అక్కడున్న మిత్రులూ సోక్రటీస్‌ని ఆయనకు ఎలా తోస్తే అలా మాట్లాడమని అడిగారని అరిస్టొడెమస్ చెప్పాడు.

'అయితే ముందుగా అగథాన్‌ని కొన్ని ప్రశ్నలు అడగడానికి అనుమతించండి. అతను చెప్పిన జవాబుల్ని బట్టి నా ప్రసంగాన్ని ముందుకు తీసుకువెళ్తాను' అని అన్నాడట సోక్రటీస్.

'నువ్వు కోరినట్టే నీ ప్రశ్నలు మొదలుపెట్టు' అని అన్నాడు ఫేద్రోస్.

అప్పుడు సోక్రటీస్ ఇలా అడగడం మొదలుపెట్టాడు: 'నువ్విప్పుడు చేసిన గంభీరమైన ప్రసంగంలో ముందు ప్రేమస్వభావం గురించి మాట్లాడి, ఆ తర్వాత ప్రేమమార్గం గురించి మాట్లాడతాను అని అన్నావు, అది చక్కని మాట, ఏదైనా ప్రసంగాన్ని ప్రారంభించే పద్ధతి అలాగే ఉండాలని నేను కూడా అనుకుంటాను. నువ్వు ప్రేమస్వభావం గురించి అనర్గళంగా మాట్లాడేవు కూడా. అయితే నేనిన్నొక మాట అడగాలనుకుంటున్నాను.

ప్రేమ అని మనం అంటున్నప్పుడు అది ఏదో ఒకదానిపట్ల ప్రేమనా లేక దేనిగురించీ కాదా? ఇక్కడ మరికొంత స్పష్టంగా చెప్పాలి. నేనిలా అడుగుతున్నప్పుడు,

నువ్వు ప్రేమ దేనిపట్ల అంటే, తండ్రిపట్ల, తల్లిపట్ల అని చెప్పకు[36]. అలాంటి జవాబు హాస్యాస్పదంగా ఉంటుంది. తండ్రి దేనికి తండ్రిగా ఉంటున్నాడు అని అడిగితే ఎలా జవాబిస్తావో అలా జవాబివ్వు. తండ్రి దేనికి తండ్రి అంటే కొడుక్కో, కూతురికో తండ్రి అని జవాబిస్తావు చూడు, అలాగ. అలాంటి జవాబు సరైన జవాబే కదా'.

'అవును, సరైన జవాబే' అని అన్నాడు అగథాన్.

'తల్లి గురించి కూడా అదే మాట చెప్తావా?'

అవునన్నాడు.

'నా ఉద్దేశ్యం మరింత తేటతెల్లంకావడానికి మరో ప్రశ్న అడుగుతాను. ఒక సోదరుడు ప్రధానంగా ఎవరో ఒకరికి సోదరుడవుతాడు కదా.'

అవును అన్నాడతడు.

'సోదరుడుగానీ, సోదరి గానీ.'

'అవును' అని అన్నాడు.

'ఇప్పుడు ప్రేమ గురించి అడుగుతాను. ప్రేమ ఏదో ఒకదాని పట్ల ప్రేమనా లేక దేనిపట్లా కాదా?'

## 24

'అది తప్పకుండా ఏదో ఒకదాని పట్లనే అవుతుంది' అని జవాబిచ్చాడు.

'అయితే ఈ విషయం మనసులో పెట్టుకుని నేనడిగినదానికి జవాబు చెప్పు– ప్రేమ ప్రేమనే కోరుకుంటుందా?'

'అవును, అదే.'

'అది దేన్ని ప్రేమిస్తున్నదో, అది దాని దగ్గర ఉన్నట్టా లేనట్టా?'

'బహుశా లేదనే అనుకుంటాను.'

'కాదు, అక్కడ నువ్వు 'బహుశా' అని కాకుండా 'ఎంతమాత్రం కాదు' అని చెప్పొచ్చేమో చూడు. ఎవరైనా ఏదైనా కోరుకుంటున్నారంటే అర్థం అది వాళ్ళ దగ్గర లేదన్నట్టే కదా, అంటే ఎవరూ దేన్నీ కోరుకోవటం లేదంటే దాని అర్థం వాళ్ళకి దేనికీ కొరతలేదన్నట్టే కదా, కాబట్టి నా దృష్టిలో, అగథాన్, ప్రేమ దేన్ని కోరుకుంటున్నదో అది

దాని దగ్గర నిశ్చయంగా లేనట్టే. ఏమంటావు?' అనడిగాడు సోక్రటీస్.

'ఒప్పుకుంటున్నాను' అన్నాడు అగథాన్.

'మంచిమాట. అయితే ఇది చెప్పు, ఎవరన్నా గొప్పవాడు గొప్పవాడు కావాలని కోరుకుంటాడా, బలశాలి బలవంతుడు కావాలని కోరుకుంటాడా?'

'మనం ఇప్పుడు చెప్పుకున్నదాన్నిబట్టి చూస్తే వాళ్ళు అలా అనుకునే అవకాశం లేనట్టే.'

'అవును, ఎందుకంటే, అప్పటికే ఒకడికి ఆ గుణగణాలున్నాయంటే వాడు వాటిని మరింకెంతమాత్రం కావాలని అనుకోడు కదా!'

'అవును.'

'అయినా సరే ఒక బలశాలి బలం కావాలని కోరుకుంటుంటే, చురుకైనవాడు చురుగ్గా ఉండాలని కోరుకుంటూ ఉంటే, ఆరోగ్యవంతుడు ఆరోగ్యంగా కావాలని కోరుకుంటూ ఉంటే, తనకి అప్పటికే ఉన్నదాన్నే అతడు కోరుకుంటూ ఉన్నట్టు కదా.'

'మన ఆలోచనలో పొరపాటు దొర్లకుండా ఉండటానికి నేనో ఉదాహరణ చెప్తాను. ఈ గుణగణాలున్నవాళ్ళకి, అగథాన్, వాళ్ళు కోరుకున్నా కోరుకోకపోయినా వాటివల్ల అప్పటికి ఒనగూడే ప్రయోజనాలు వాళ్ళు పొందుతూ ఉండాలి కదా. కాబట్టి ఎవరేనా నేను బాగా ఉన్నాను, బాగా ఉండాలని కోరుకుంటున్నాను అనో లేదా నేను ధనవంతుడిగా ఉన్నాను, ధనవంతుడిగా ఉండాలని కోరుకుంటున్నాను అనో అంటే నేను నాకేవి ఉన్నాయో అవి ఉండాలని కోరుకుంటున్నాను అనో చెప్తే-అతడికి మనమిలా చెప్పొచ్చు:

'చూడు, మిత్రమా, సంపదలూ, ఆరోగ్యం, బలం ఉండి, అవి కొనసాగుతూ ఉండాలనికోరుకుంటున్నావు, అయితే నువ్వు అనుకున్నా, అనుకోకపోయినా నీకిప్పటికే ఆ గుణాలున్నాయి. నేను నాకేవి ఉన్నాయో వాటినే కోరుకుంటున్నాను, మరేమీ కాదు, అని అంటావనుకో, అప్పుడు నీ ఉద్దేశ్యం, ఇప్పుడు నాకేమున్నాయో, అవి భవిష్యత్తులో కూడా ఉండాలని కోరుకుంటున్నావు, అంతేనా? అనడిగామనుకో, అతడు ఒప్పుకుంటాడా లేదా?'

'ఒప్పుకుంటాడు' అన్నాడు అగథాన్.

'అంటే అతడు ఇప్పుడు తనకున్నవి భవిష్యత్తులో కూడా ఉండాలని కోరుకుంటున్నాడు. అంటే ఏమిటి? అతడు తనకి లేనిదేదో, అంటే ఇప్పటికింకా పొందని

దేదో కోరుకుంటున్నాడన్నట్టే కదా.'

'నిజమే' అన్నాడతడు.

'అంటే, వాళ్ళు ప్రతి ఒక్కరూ తమకు ప్రస్తుతం లేనిదేదో కోరుకుంటున్నారు, అంటే వర్తమానంలో లేనిది కాదు, భవిష్యత్తులో లేనిది కోరుకుంటున్నారు. అంటే అతడు కోరుకునేది అతడికి లేదన్నమాట, అతడికి అది కొరవడింది, ఇలాంటివే కదా, ప్రేమా, కాంక్షా కోరుకునేవి?'

'నిజమే' అని అన్నాడు.

'అయితే, మనమొకసారి ఇంతకుముందు చర్చించుకున్నవి గుర్తుచేసుకుందాం. మొదటిది, ప్రేమ, ఏదో ఒక దానిపట్ల, అందులోనూ మనిషికి కొరవడినదానిపట్ల ఉంటుందనేగా?'

## 25

'అవును' అని జవాబిచ్చాడతడు.

'నువ్వు నీ ప్రసంగంలో మొదట ఏమి చెప్పావో గుర్తుతెచ్చుకో. నీకు గుర్తులేకపోతే, నేను గుర్తు చేస్తాను. నువ్వేమన్నావంటే, ప్రేమ, దేవతల సామ్రాజ్యంలో సౌష్ఠవాన్నీ, సౌందర్యాన్నీ తీసుకొచ్చిందనీ, వికృతమైనవాటిపట్లా, విరూపవస్తువుల పట్లా ఎవరికీ ప్రేమ ఉండదనీ–అటువంటిదేదో అన్నావు కద?'

'అవును' అన్నాడు అగథాన్.

నిజమే, నువ్వన్నమాట సమంజసమైందే. ఈ మాటే కనక నిజమైతే, ప్రేమ అంటే సౌందర్యాన్ని ప్రేమించడం తప్ప విరూపాన్ని ప్రేమించడం కాదు కదా.'

అతడు తలూపాడు.

'మనుషులకి తమలో ఏది కొరవడిందో, దేన్ని కోరుకుంటున్నారో దానిపట్లనే కదా ప్రేమ ఉంటుందని ఇంతకు ముందు అనుకున్నాం?'

'అవును' అని అన్నాడు.

'అంటే దాని అర్థం ప్రేమలో సౌందర్యం కొరవడింది, కాబట్టే దాన్ని కోరు కుంటోందా?'

'అవును, అంతే.'

'అలా అయితే దేనిలో అందం కొరవడిందో, అందం కోసం అర్రులు చాస్తోందో దాన్ని సౌందర్యం అని అనగలవా?'

'అనలేను.'

'అలాంటప్పుడు ప్రేమ అందమైంది అని ఇంకా అనగలవా?'

'నేనేం చెప్తున్నానో నాకు తెలియట్లేదేమో అని అనుమానంగా ఉంది' అన్నాడు అగథాన్.

'నువ్వు చాలా చక్కటి ప్రసంగం చేసావు అగథాన్' అని అన్నాడు సోక్రటీస్. 'కాని ఇంకో చిన్న ప్రశ్న అడగాలనుకుంటున్నాను, మంచితనం అందమైది కూడానా?'

'అవును.'

'అంటే, సౌందర్యాన్ని కోరుకుంటున్నప్పుడు ప్రేమ మంచితనాన్ని కూడా కోరు కుంటున్నట్టేనా?'

'నీ మాటలు ఖండించలేను సోక్రటీస్, సరే, నువ్వన్నట్టే అనుకుందాం' అన్నాడు అగథాన్.

'ప్రియమిత్రమా, నువ్వు చెప్పవలసిన మాట అది కాదు, ఇది: నేను సోక్రటీస్‌ని ఖండించగలనేమోగాని, సత్యాన్ని ఖండించలేను' అని చెప్పు'.

సరే, ప్రస్తుతానికి నిన్నిక్కడ వదిలిపెట్టి, మంచినియావాసి డయోటిమా[37] ద్వారా ప్రేమ గురించి నేను విన్న కథ ఒకటి మీకు చెప్పాలనుకుంటున్నాను. ఆమె ఇలాంటి జ్ఞానరహస్యాలు మరికొన్ని తెలిసినామె. పూర్వపు రోజుల్లో ఒకసారి ఎథీనియన్లు పూజలు చేస్తే ప్లేగు వ్యాధి పదేళ్ళపాటు రాకుండా కాపాడింది.

ప్రేమవిషయాలకు సంబంధించి ఆమె నా గురువు. ఆమె నాకేమి చెప్పిందో నేనిప్పుడు మీకు చెప్పబోతున్నాను. ఆమె నన్ను ప్రేమ గురించి అడిగినప్పుడు ఇప్పుడు అగథాన్ చెప్పినమాటల్లాంటివే నేను కూడా ఆమెతో చెప్పాను. కాబట్టి ఇప్పుడు రెండు పక్షాలూ నేనే తీసుకుని ఆ రోజు మా మధ్య జరిగిన సంభాషణని మీముందుంచటానికి ప్రయత్నిస్తాను.'

'నువ్వు నీ ప్రసంగంలో చెప్పినట్టే, అగథాన్, నేను కూడా ముందు ప్రేమ స్వభావం ఎటువంటిదో నిర్వచించి, అప్పుడు ప్రేమలీల ఎటువంటిదో వివరిస్తాను.

ప్రేమ గురించి అగథాన్ ఎటువంటి మాటలు ప్రయోగించాడో దాదాపుగా అటువంటి మాటలే నేను ఆమెతో మొదట చెప్పాను. ప్రేమ ఒక మహాబలశాలి అనీ, సుందరుడనీ చెప్పాను. ఆమె కూడా నేనిప్పుడు అగథాన్‌తో ఎట్లా చెప్పించానో అలానే ప్రేమ అందమైంది కాదనీ, మంచిదేమీ కాదనీ నాతోనే నా మాటల్లో చెప్పించింది. 'అంటే ఏమిటి డయోటిమా, ప్రేమ అనాకారీ, దుష్టుడూ అంటావా?' అని అన్నాను. 'హుష్, సుందరంగా లేదంటే అర్థం అనాకారి అనేనా?' అని అనడిగిందామె.

## 26

'అంతే కదా! జ్ఞానం లేదంటే అజ్ఞాని అనే కదా' అని అన్నాను. 'ఏమి? జ్ఞానానికి, అజ్ఞానానికీ మధ్య ఒక స్థితి ఉండటం నీకు కనిపించడంలేదా?'

'ఏమిటది? అనడిగాన్నేను.

'మన అభిప్రాయం దేన్నైనా హేతుబద్ధంగా వివరించలేకపోతే దాన్ని జ్ఞానం అనం. (హేతువు తెలియనిది జ్ఞానమెలా అవుతుంది?) అలాగే అజ్ఞానం కూడా. ఎందుకంటే అజ్ఞానం సత్యాన్నెప్పటికీ అందుకోలేదు. సరైన అభిప్రాయం అజ్ఞానానికీ, జ్ఞానానికీ మధ్యస్థంగా ఉండేది.'

'నిజమే' అన్నాన్నేను.

'కాబట్టి సవ్యంగాలేనంతమాత్రాన దాన్ని అపసవ్యం అనకు, మంచిది కాకపోతే చెడు అనకు, ప్రేమ అందమైందీ, మంచిదీ కాదు కాబట్టి అతడు అనాకారీ, దుష్టుడూ అని తొందరపడి నిర్ణయించకు. అతడు ఆ రెండింటికీ మధ్యస్థుడు.'

'కాని ప్రేమ గొప్ప దేవత అని అందరూ ఒప్పుకున్నదే కద.'

'ఎవరు అలా ఒప్పుకున్నవాళ్ళు? తెలిసినవాళ్ళా? తెలియనివాళ్లా?'

'అందరూను'

ఆమె చిరునవ్వింది. 'సోక్రటీస్, అసలు ప్రేమని ఒక దేవత అనే ఒప్పుకోనివాళ్ళు అతణ్ణి గొప్ప దేవత అని ఎలా అనగలుగుతారు?'

'వాళ్ళెవరు' అనడిగాను.

'వాళ్ళల్లో నువ్వూ, నేనూ ఇద్దరమూ ఉన్నాం' అందామె.

'అదెలా' అనడిగాను.

'అర్థమవుతూనే ఉంది కదా. దేవతలు సుందరంగానూ, సంతోషంగానూ ఉంటారని నువ్వు ఒప్పుకుంటావు కదా. అటువంటప్పుడు ఏ దేవతైనా అందంగా లేడనీ, ఆనందంగా ఉండడనీ అనగలవా?'.

'ఎప్పటికీ అనలేను 'అని జవాబిచ్చాను.

'ఎవరేనా ఆనందంగా ఉంటారని నువ్వంటున్నప్పుడు వారిదగ్గర మంచితనం, సంతోషం ఉన్నాయనే కదా అర్థం'.

'అవును'.

'కాని నువ్వే కదా అన్నావు, ప్రేమదేవత దగ్గర సంతోషం, సౌందర్యం కొరవడినందు వల్లనే ఆయన వాటికోసం అన్వేషిస్తున్నాడని?'

'అవును' అన్నాను.

'అలా అయితే తనలో సంతోషమో, సౌందర్యమో కొరవడినవాడు దేవత ఎలా అవుతాడు?'

'అసంభవం'.

'అయితే ప్రేమకు దైవత్వం లేదని నువ్వు కూడా ఒప్పుకుంటున్నావన్నమాట'.

'అలాగైతే మరి ప్రేమ ఎవరు' అనడిగాను.

'అతడు మర్త్యుడా?'

'కాదు'.

'మరెవరు?'

'నేనింతకుముందు చెప్పినట్టుగా అతడు మర్త్యుడూ కాడు, అమర్త్యుడూ కాడు. ఆ రెండింటికీ మధ్యస్థంగా ఉండేవాడు'.

'అయితే అతడెవరంటావు డయొటిమా?'

' అతడొక స్ఫూర్తి, ఒక భావన, ఒక దివ్యశక్తి. తక్కిన దివ్యశక్తులందరిలానే అతడు కూడా మర్త్యులకీ, అమర్త్యులకీ మధ్య ఒక రాయబారి.'

'అతడి శక్తిసామర్థ్యాలేమిటి?'

'అతడు మనుషులకీ, దేవతలకీ మధ్య ద్విభాషి. మనుషుల ప్రార్థనల్నీ, సమర్పణల్నీ

దేవతలకు అందచేస్తాడు. వాటికి దేవతలు ఏమని బదులిచ్చారో, ఏ ఆదేశాలు సెలవిచ్చారో వాటిని మనుషులకు తీసుకొస్తాడు. బృందారకలోకాన్నుంచి నరసమూహాన్ని వేరుచేసే అగాధాన్ని కలిపే వంతెన అతడు, వాళ్ల మధ్యవర్తి.

కాబట్టి అతడిలో ఆ ఇరులోకాలూ కలిసే ఉంటాయి. అతడి ద్వారానే ప్రవక్తలూ, పూజారులూ తమ కార్యకలాపం నెరవేర్చగలుగుతారు. వారి వారి ఆహుతులు, తంత్రాలు, వశీకరణలు, అన్ని రకాల భవిష్యవాణులు, మంత్రోచ్చాటనలు అతడి ద్వారానే వారిని చేరుకుంటాయి. దేవుడెప్పటికీ నేరుగా మనుషుల్తో కలవడు. భగవంతుడికీ, మనిషికీ మధ్య జరిగే సంభాషణలన్నీ ప్రేమ ద్వారానే జరుగుతాయి. నిద్రలోనూ, మెలకువలోనూ కూడా ఆ సంభాషణ కొనసాగుతూనే ఉంటుంది.

ఈ విషయాన్ని అర్థం చేసుకున్న జ్ఞానం ఆధ్యాత్మికం అవుతుంది. తక్కిన పరిజ్ఞానాలన్నీ అంటే కళలూ, చేతికళలూ లాంటివన్నీ, సాధారణం, లౌకికం అని చెప్పవలసి ఉంటుంది. ఇలా దేవతలకీ, మనుషులకీ మధ్య రాయబారులుగా ఉండే శక్తులెన్నో ఉన్నాయి. వాటిలో ప్రేమ కూడా ఒకటి'.

'అయితే మరి అతడి తల్లిదండ్రులెవరు' అనడిగాను.

'ఆ కథ చెప్పాలంటే చాలా సమయం పడుతుంది' అందామె. 'అయినా చెప్తాను. విను. ఒకసారి ఆఫ్రొడైట్ పుట్టినరోజు నాడు దేవతలకి విందు ఏర్పాటు చేసారు. ఆ విందుకి వచ్చినవారిలో 'పోరోస్', అంటే, కలిమి అనే దేవత కూడా ఉన్నాడు. 'మెటిస్' అంటే విచక్షణకి పుట్టినవాడతడు. ఆ విందుముగిసేక 'పెనియా', అంటే, లేమి అనే ఆమె మామూలుగా అలాంటి సందర్భాల్లో కనిపించేటట్టే గుమ్మం దగ్గర అడుక్కుంటూ నిలబడింది.

ఈలోపు కలిమి దేవత అమృతం సేవించినందువల్ల మత్తెక్కి (ఆ రోజుల్లో మధువు ఉండేది కాదు) సర్వేశ్వరుడైన జ్యూస్ ఉద్యానవనంలోకి వెళ్ళి అక్కడే నిద్రపోయాడు. లేమి తన గడ్డుపరిస్థితిని తలుచుకుని కలిమి వల్ల ఒక బిడ్డని కనాలని పన్నాగం పన్ని, అతడి పక్కన పోయి పడుకుని ప్రేమని కన్నది. ఆఫ్రొడైట్ మహాసౌందర్యవతికాబట్టి, ప్రేమ ఆమె పుట్టినరోజు నాడు పుట్టాడు కాబట్టి, సహజంగానే ప్రేమ కూడా సౌందర్య ఆరాధకుడు కాబట్టి అతడు ఆఫ్రోడైటుకు అనుచరుడుగా, పరిచారకుడిగా మారాడు. అతడి తల్లిదండ్రుల్లానే అతడి భాగ్యం కూడా నిమ్నోన్నతాలతో కూడుకుంది.

మొదటిదేమంటే అతడెప్పుడూ పేదవాడిగానే ఉంటాడు. అందరూ అనుకునేట్టుగా

అతడు సుకోమలుడూ, సుందరుడూ కాడు. మొరటుగానూ, మురిగ్గానూ ఉంటాడు. కాళ్లకి చెప్పులుండవు. తలదాచుకోడానికి ఇల్లుండదు. ఆరుబయట ఆకాశం కింద కటికనేలమీదా, వీథుల్లోనూ, ఇంటిగడపలదగ్గరా పోయిపడిఉంటాడు. తన తల్లిలాగానే తాను కూడా సదా వేదనలో కూరుకుపోయి కనిపిస్తాడు.

అతడిలో తండ్రి పోలికలు కూడా లేకపోలేదు. కాబట్టి ఎప్పుడూ సుందరమైన వాళ్లమీదా, సంతోషంగా ఉండేవాళ్లమీదా ఒక కన్నేసి ఉంటాడు. సాహసుడు, చురుకైన వాడు, బలాఢ్యుడు, గొప్ప వేటగాడు, ఎప్పుడూ ఏదో ఒక తంత్రం పన్నుతూనే ఉంటాడు. జ్ఞానాన్వేషి, సారవంతుడు, సదా తాత్త్వికుడు, భయంకరమైన వశీకరణవేత్త, మాంత్రికుడు, వాక్చతురుడు.

స్వభావరీత్యా అతడు మనిషీ కాడు, అమరుడూ కాడు. కాని సదా సజీవుడు, తాను పుష్కలంగా ఉన్నప్పుడు వికసిస్తూ ఉంటాడు, మరొక క్షణం మృతుడై పడి ఉంటాడు, మళ్ళా మరుక్షణమే, తండ్రి స్వభావాన్ని అనుసరించి, సజీవుడై పైకి లేస్తాడు. ఎప్పటికీ లోపలకి వచ్చిపడుతున్నది అంతే వేగంగా బయటకి ప్రవహిస్తూ పోతుంటుంది కాబట్టి అతడెప్పుడూ లేమిలోనూ ఉండడు, అలానే కలిమిలోనూ ఉండడు. శూన్యతకూ, సంపదకూ; అజ్ఞానానికీ, జ్ఞానానికీ మధ్యస్థుడు అతడు.

ఈ మొత్తం సంగతిలో సత్యమంటూ ఉంటే అది ఇది: ఏ దేవత కూడా ఋషి కావాలనో, దార్శనికుడు కావాలనో ఆరాటపడడు. ఎందుకంటే, అతడప్పటికే ఒక ఋషి కాబట్టి. అలాగే జ్ఞాని అయిన ఏ ఒక్క మనిషి కూడా తిరిగి మళ్లా జ్ఞానాన్ని అభిలషించడు. అలాగే అజ్ఞాని కూడా జ్ఞానం కోసం ఆరాటం చెందడు.'

## 27

'అజ్ఞానంలో చెడుగు ఉందని ఇక్కడే మనం గమనించాలి. ఎవరైతే సజ్జనుడూ, వివేకీ కాడో అతడు సహజంగానే తనపట్ల తాను చాలా సంతృప్తిగా ఉంటాడు. తనకేదో లేదని అతడు అనుకోవడంలేదు కాబట్టి దానికోసం అతడికి కొత్తగా ఏ ఆరాటమూ కలగదు.

'అలా అయితే డయొటిమా, వాళ్ళు జ్ఞానులూ, అజ్ఞానులూ రెండూ కాకపోతే, మరి జ్ఞానాన్వేషులెవరు?'

'ఇది చిన్నపిల్లవాడు కూడా జవాబివ్వగల ప్రశ్న. జ్ఞానులకీ, అజ్ఞానులకీ మధ్యస్థంగా ఉండేవాళ్ళు కొందరుంటారు. ప్రేమ కూడా వాళ్ళల్లో ఒకడు. జ్ఞానం అత్యంత మనోహరం.

ప్రేమ ఒక సౌందర్యపిపాసి. కాబట్టి ప్రేమ కూడా ఒక తత్త్వవేత్తనే, జ్ఞానప్రేమినే. కాబట్టి జ్ఞానప్రేమిగా ఉండటమంటే జ్ఞానానికీ, అజ్ఞానానికీ మధ్యస్థంగా ఉండటం. అతడి పుట్టుకకి కూడా ఇదే కారణం. ఒకవైపు అతడి తండ్రి కలిగినవాడు, విజ్ఞాని. మరొకవైపు అతడి తల్లి లేమీ, అజ్ఞానీనూ. ప్రేమస్వభావం ఇటువంటిది సోక్రటీస్. అతడి గురించి నువ్వు ఊహించడంలో పొరపాట్లు దొర్లడం సహజం. ఈ పొరపాటుకి కారణం ప్రేమికుడికీ, అతడు ప్రేమిస్తున్నవాడికీ మధ్య నువ్వు పొరపడటం. అది చూసి నువ్వు ప్రేమంటే మహా సౌందర్యం అనుకున్నావు. ప్రేమించబడేవాడు నిజంగానే అందగాడు, లలితుడు, సంపూర్ణుడూ, ధన్యుడూను. కాని ప్రేమసూత్రం స్వభావరీత్యా వేరే. అది నేనిప్పటిదాకా వర్ణించానే అలానే ఉంటుంది.'

'ఓ విచిత్రవనితా! నీ మాటలు వినడానికి చాలా బావున్నాయి. కాని ప్రేమంటే నువ్వు చెప్పిందే అనుకో, అటువంటి ప్రేమవల్ల మనుషులకేమి ఉపయోగం?' అనడిగాను.

'అది కూడా వివరిస్తాను సోక్రటీస్. ఇప్పటిదాకా ప్రేమప్రాదుర్భావం గురించి చెప్పాను. ప్రేమ ఒక సౌందర్యదాహం అని నువ్వు కూడా ఒప్పుకున్నావు. కాని ఎవరేనా అడగొచ్చు: సౌందర్యదాహం, నిజమే, కాని ఎవరి సౌందర్యం పట్ల? సోక్రటీసులోనా, లేక డయొటిమాలోనా? లేదా మరోలా అడగాలంటే, ఒక మనిషి అందాన్ని ప్రేమిస్తున్నప్పుడు, అతడు కోరుకుంటున్నదేమిటి?'

'ఆ అందం తన స్వంతం కావాలని' అని అన్నాను.

'ఆ జవాబు వింటే మరో ప్రశ్న అడగాలనిపిస్తుంది. అందం స్వంతమైతే కలిగిదేమిటి?'

నువ్వడిగిన ప్రశ్నకు నా దగ్గర జవాబు సిద్ధంగా లేదన్నాను.

'అయితే ఒక పనిచేస్తాను. అందం అనే పదం స్థానంలో మంచితనం అనే మాట పెట్టి, ఆ ప్రశ్న మరోసారి అడుగుతాను: ఎవరేనా మంచిని ప్రేమిస్తుంటే అతడేమి కోరుకుంటున్నట్టు?'

'మంచివాడు కావాలని'.

'మంచివాడైతే ఏం లాభం?'

'సంతోషం' అని జవాబిచ్చేను. 'ఈ ప్రశ్నకు జవాబివ్వడం కొంత సులభంగా ఉంది' అని కూడా అన్నాను.

## 28

‘అవును. ఒకరు సంతోషంగా ఉన్నారంటే కారణం వాళ్ళు మంచివాటిని పొందడం వల్ల సంతోషంగా ఉన్నారని. అలాగే ఒక మనిషి సంతోషాన్ని ఎందుకు కోరుకుంటాడని అడగడంలో అర్థం లేదు. అది అంతిమ సమాధానం కాబట్టి’.

‘నువ్వు చెప్పింది సబబే’ అని అన్నాను.

‘అయితే ఈ కోరిక మనుషులందరికీ సమానమేనా? మనుషులంతా ఎల్లప్పుడూ తమ సంతోషాన్ని కోరుకుంటూనే ఉంటారా లేకపోతే కొంతమంది మాత్రమే కోరుకుంటూ ఉంటారా?’

‘మనుషులంతా. ఈ కోరిక అందరికీ సమానమే’ అన్నాన్నేను.

‘మరి అలాంటప్పుడు సోక్రటీస్. ఎందుకని మనుషులంతా ప్రేమికులు కావట్లేదు? వాళ్ళల్లో కొందరు మాత్రమే ప్రేమిస్తుంటారు? నువ్వేమో మనుషులంతా ఎల్లప్పుడూ ఒకటే కోరుకుంటారని అంటున్నావు?’

‘అవును. ఆలోచిస్తే నాక్కూడా ఇది ఆశ్చర్యంగానే ఉంది’ అన్నాను.

‘కాని ఇందులో ఆశ్చర్యపోడానికి ఏమీ లేదు. ఎందుకంటే మొత్తంలోంచి విడివడ్డ ఒక భాగాన్ని మాత్రమే మనం ప్రేమ అని పిలుస్తున్నాం, తక్కిన భాగాలకి రకరకాల పేర్లున్నాయి.’

‘ఏదీ ఒక ఉదాహరణ చెప్పు’ అనడిగాను.

ఆమె ఇలా చెప్పుకొచ్చింది. ‘ఉదాహరణకి కవిత్వం సంగతే చూడు. అది చాలా సంక్లిష్టంగా, పరిపరివిధాలుగా ఉంటుంది. సృష్టి మొత్తం, లేదా మరోలా చెప్పాలంటే, అనస్తిత్వం అస్తిత్వంలోకి చేసే ప్రయాణమే కవిత్వం లేదా సృజన[38]. సమస్త కళాప్రక్రియలూ సృజనాత్మకాలు. కళాకారులంతా కవులు లేదా సృజనకారులు.’

‘నిజమే’

‘కానీ వాళ్లందరినీ మనం కవులని పిలవం. వాళ్ళకి రకరకాల పేర్లున్నాయి. అయితే ఆ సృజనాత్మక కార్యకలాపంలో ఒక భాగాన్ని మాత్రమే, ఛందస్సుతోనూ, సంగీతంతోనూ ముడిపడి ఉన్నదాన్ని మాత్రమే కవిత్వం అని అంటున్నాం. అటువంటి కవిత్వానికి సంబంధించినవాళ్ళని మాత్రమే కవులని పిలుస్తున్నాం’.

'భేషైన మాట' అని అన్నాను.

'ప్రేమకి కూడా ఇదే వర్తిస్తుంది. మంచినీ, సంతోషాన్నీ కోరుకునే కాంక్షనే ప్రేమ తాలూకు మహిమోపేతసూక్ష్మశక్తి అని అంటున్నాం. కాని వేరే మార్గాల ద్వారా అంటే డబ్బు సంపాదించుకోవడం ద్వారానో లేదా క్రీడామైదానం ద్వారానో లేదా తత్త్వవివేచన ద్వారానో చేరుకోవాలని చూసేవాళ్లని ప్రేమికులని అనటం లేదు. ఎందుకంటే ఈ మొత్తం వ్యవహారంలో  అనురాగం ద్వారా వ్యక్తమయ్యేదాన్ని మాత్రమే ప్రేమ అని పిలవడానికి అలవాటు పడ్డాం. అటువంటి ప్రేమ చూపించేవాళ్లనే ప్రేమికులని అంటున్నాం.'

'నువ్వు చెప్తున్నది బాగానే ఉంది అనడానికి నాకు సంకోచం లేదు'అన్నాను.

'ప్రేమికులు తమ అర్థభాగం కోసం వెతుక్కుంటూ ఉంటారని మనుషులు చెప్పగా వినే ఉంటావు. కాని ఆ అర్థభాగం స్వతహాగా మంచిది కాకపోతే వాళ్ళు ఏ అర్థభాగం కోసంగాని, పూర్తిభాగం కోసం గాని వెతుక్కునే ప్రసక్తిలేదంటాను. తమ చేతుల్లో దోషముంటే వాళ్ళు తమ చేతుల్నే నరికి పక్కన పారేసుకోగలరు. తమది కానిదేదీ వాళ్ళు ప్రేమించలేరు గనక. తమకి సంబంధించిందంతా మంచిదీ, తమది కానిదంతా చెడ్డదీ అని ఎవరేనా అంటే మాత్రం చెప్పలేను.'

## 29

'మనుషులు మంచిగా ఉండేదాన్ని తప్ప మరొకదాన్ని ప్రేమించడం అసాధ్యం. అటువంటి దేదన్నా ఉందా?'

'అటువంటిదేదీ లేదన్నది నిశ్చయం'.

'అయితే, మన సమాధానం చాలా సులభం, సరళం. మనుషులు మంచిని ప్రేమిస్తారు'.

'అవును' అన్నాను.

'మంచిని పొందడాన్ని కూడా ప్రేమిస్తారని అనవచ్చునా?'

'అనొచ్చును'.

'కేవలం పొందడాన్ని మాత్రమే కాదు, మంచితనాన్ని శాశ్వతంగా కలిగి ఉండటాన్ని కూడా ప్రేమ అని అనవచ్చునా?'

'అనవచ్చును'.

'అయితే ప్రేమ అంటే మంచితనాన్ని శాశ్వతంగా కలిగి ఉండటమే అని నిర్వచించ వచ్చునా?'

'అవును, సత్యమే'.

'ప్రేమ స్వభావం ఇటువంటిదైనప్పుడు ఆ ప్రేమాన్వేషణ ఎటువంటిదై ఉంటుంది? ప్రేమపేరిట మనుషులు చూపించే ఈ వేడీ, ఈ ఆరాటమూ చూపిస్తున్నప్పుడు మనుషులు నిజంగా ఏం చేస్తున్నాట్టు? వాళ్ళ దృష్టి దేనిమీద ఉందంటావు? జవాబు చెప్పు.'

'ఏమో, డయొటిమా, నాకే గనుక ఇదంతా తెలిస్తే, నేనిట్లా నోరువెళ్ళబెట్టుకుని చూస్తూ ఉండేవాణ్ణే కాను, ఈ విషయం నీనుంచి తెలుసుకోడానికి ఇంతదూరం వచ్చి ఉండేవాణ్ణే కాను' అన్నాను.

'సరే, నేనే చెప్తాను. వాళ్ళు అలా ఆరాటపడుతున్నప్పుడు వాళ్ళ దృష్టి సౌందర్యసృష్టి మీద ఉంటున్నది, అది దేహంలో గానీ, ఆత్మలోగానీ.'

'నాకు అర్థం కావడంలేదు, ఈ దివ్యవాణికి మరికొంత వివరణ కావాలి.'

'నా ఉద్దేశ్యం మరింత వివరించనివ్వు. నేనేం చెప్తున్నానంటే మనుషులు ప్రేమ పేరిట ఆరాటపడుతున్నప్పుడు తమ దేహాల్లోనూ, మనసుల్లోనూ సౌందర్యాన్ని పుట్టిస్తున్నారు. మానవప్రకృతి ప్రకారం ఒక వయసులో ప్రత్యుత్పత్తి కోసం కోరిక ఉంటుంది. అది కూడా సరూపంకోసం మాత్రమే, విరూపంకోసం కాదు. ఈ ప్రత్యుత్పత్తి కార్యకలాపమే స్త్రీపురుష సంయోగం, ఇదొక దైవీప్రక్రియ. తమ సంతతిని సంభావించడం, సంతతి సంభవం ఇవి మర్త్యప్రాణిలోని అమర్త్యనియమాలు. ఇది ప్రకృతిలోని అంతర్గతలయ, ఒక ఋతం. ఈ ఋతానికి విరుద్ధంగా వారెన్నటికీ నడుచుకోలేరు.

కాని విరూపానికీ దైవత్వానికీ మధ్య ఎన్నటికీ పొసగదు. సుందరమైంది మాత్రమే సమరసంగా ఉంటుంది. కాబట్టి ప్రసూతి సౌందర్యం ఒక అధిదేవతగా ఉండి ప్రసవవేళ మంత్రసానిగా పనిచేస్తుంది. బిడ్డను కనడానికి ముందు గర్భం దాల్చినప్పుడు, సౌందర్యదేవత సన్నిధిలో, ఆ గర్భందాల్చే శక్తి అనుకూలంగానూ, వ్యాకోచశీలంగానూ, దయాళువుగానూ ఉండి, గర్భంధరించి సఫలమవుతుంది. అనాకారితనం ఎదట ఆ శక్తి ధుమధుమలాడుతూ ముడుచుకుపోతుంది. చెప్పలేని బాధకు లోనై పక్కకు తప్పుకుపోతుంది. శుష్కించిపోయి గర్భందాల్చడానికి విముఖత చెందుతుంది.

గర్భం తాల్చే తరుణం ఆసన్నమైనప్పుడు గర్భిణీ స్త్రీ ప్రకృతి సంపూర్ణతపొంది సౌందర్యంకోసం తహతహలాడుతూ ఒక భావోద్వేగాన్ని పొందటానికి కారణం ఇదే. ఆ

సందర్భంలో సౌందర్యదేవత అక్కడ అడుగుపెట్టగానే ప్రసవవేదన ఉపశమిస్తుంది. ఎందుకంటే, సోక్రటీస్, ప్రేమ నువ్వనుకున్నట్టుగా కేవలం సౌందర్యానికి సంబంధించింది మాత్రమే కాదు.'

'అదేమిటి?'

'అది సౌందర్యప్రజనానినికీ, ప్రసవానికీ సంబంధించింది'.

'అవును' అన్నాను.

'అవును, అంతే' అందామె. 'కాని ప్రజనానికీ, పుట్టుకకీ మాత్రమే ఎందుకు సంబంధించిందై ఉండాలి? ఎందుకంటే ఒక మర్త్యప్రాణికి, నశ్వరజీవికి, ప్రజననం ఒక శాశ్వతత్వం, ఒక అమరత్వం కాబట్టి. కాబట్టి మనం ఇంతకు ముందు చెప్పుకున్నట్టు ప్రేమ అంటే ఒక శాశ్వతశుభం అనుకునేట్లయితే, మనుషులంతా ఆ శుభంతోపాటు అమరత్వాన్ని కూడా కోరుకుని తీరాలి.'

## 30

'అంటే ప్రేమ అమరత్వానికి సంబంధించిందన్నమాట.'

ఆమె ప్రేమ గురించి మాట్లాడినప్పుడల్లా నాకు చెప్పిన విషయమిదే. ఆమె మరోసారి ఈ మాటలు కూడా చెప్పడం గుర్తుంది.

ఆమె అంది కదా: 'సోక్రటీస్, ప్రేమకీ, దాన్ని అనుసరించి వచ్చే కోరికకీ, కారణమేమై ఉండొచ్చంటావు? పశుపక్ష్యాదులూ, మృగాలూ కూడ ప్రత్యుత్పత్తికి పూనుకున్నప్పుడు, ప్రేమ జ్వరం వాటిని తగులుకున్నప్పుడు అవి ఎంత ఆందోళనకి లోనవుతాయో నువ్వు చూడలేదా? పరస్పరం ఏకం కావాలనే కోరికతో మొదలైన ఆ ప్రేమ తమ సంతతిని సంరక్షించుకోవాలనే కోరికదాకా, తమసంతతిలో బలహీనమైనవాటికోసం ఎంత బలవంతుల్నైనా ఎదిరించిపోరాడటం దాకా, అవసరమైతే వాటికోసం మరణించడం దాకా, తమ పిల్లలు మనుగడ సాగించడంకోసం తాము ఆకలితో మగ్గుతూ, నరకయాతన అనుభవించడందాకా– ప్రయాణించడం చూడలేదా? మనిషైతే ఏదో ఒక కారణం చెప్పుకుని అటువంటి కష్టాల్ని స్వీకరిస్తున్నాడని చెప్పవచ్చు. కాని జంతువులకి కూడా అటువంటి ప్రేమావేశం ఎందుకుండాలి? చెప్పగలవా? ఎందుకుండాలి?'.

ఈసారి కూడా నాకు తెలియదనే చెప్పాను.

'ఈ విషయం తెలీకుండానే నువ్వు ప్రేమశాస్త్రంలో పండితుడివి కావాలని కోరుకుంటున్నావా?' అనడిగిందామె.

'నేనింతకుముందే చెప్పాను కదా, డయొటిమా, నాకు ఈ విషయాలు తెలియవు కాబట్టే నేన్నీదగ్గరకు వచ్చానని. నాకు ఈ విషయంలో ఒక గురువు కావాలని స్పష్టంగా తెలుసుకాబట్టే వచ్చాను. కాబట్టి దీనికి కారణం చెప్పు, అలానే తక్కిన ప్రేమరహస్యాలు కూడా తెలియచెయ్యి.'

'ప్రేమ అమరత్వానికి చెందిందని మనం ఇంతకు ముందు చాలాసార్లు చెప్పుకున్నాం. కాబట్టి ఆశ్చర్యపోకు. ఇక్కడ కూడా అదే సూత్రం. మర్త్యస్వభావం వీలైనంతవరకూ శాశ్వతాన్నీ, అమరత్వాన్నీ కోరుకుంటూ ఉంటుంది కాబట్టి అది ప్రత్యుత్పత్తి వల్లనే సాధ్యపడుతుంది కాబట్టి, ప్రత్యుత్పత్తి ఎప్పుడూ పాతదాని స్థానంలో కొత్త అస్తిత్వాన్ని ప్రతిష్ఠిస్తూనే ఉంటుంది కాబట్టి.

ఆ మాటకొస్తే ఒక్క వ్యక్తి జీవితంలో కూడా కేవలం ఒకే ఒక్క అస్తిత్వం ఉండదు. అస్తిత్వక్షణాల పరంపర ఉంటుంది. మనిషిని మనం అన్ని దశల్లోనూ ఒకే పేరుతో పిలిచినప్పటికీ, అతడి యవ్వనానికీ, వృద్ధాప్యానికీ మధ్య, తన జీవితానికీ, గుర్తింపుకీ మధ్య, సదా ఒక వినష్టాన్నీ, ఒక పునరుద్ధరణనీ అనుభవంలోకి తెచ్చుకుంటూనే ఉంటాడు. అతడి జుత్తు, ఎముకలు, రక్తం, మొత్తం శరీరమంతా కూడా నిత్యం మార్పుకి లోనవుతూనే ఉంటుంది.

ఇది కేవలం దేహానికి మాత్రమే చెందిన విషయం కాదు, ఆత్మకి సంబంధించింది కూడా. అలవాట్లు, గుణగణాలు, అభిప్రాయాలు, కోరికలు, సంతోషాలు, దుఃఖాలు, భయాలు మనలో ఏ ఒక్కరిలోనూ కూడా ఎల్లప్పుడూ ఒక్కలానే ఉండవు. అవి సదా వస్తూ, పోతూనే ఉంటాయి. జ్ఞానానికి కూడా ఈ సూత్రమే వర్తిస్తుంది. ఇంకా మనుషులుగా మనకి ఆశ్చర్యం కలిగించేదేమంటే, ఈ పరిజ్ఞానాలన్నీ, అందరికీ సంబంధించి పుట్టి, నశిస్తూండటంతో పాటు, మనలో ప్రతి ఒక్కరం, విడివిడి వ్యక్తులుగా కూడా మన పరిజ్ఞానంలో ఎప్పటికప్పుడు ఈ మార్పుని అనుభూతి చెందుతూనే ఉంటాం.

## 31

'మనం గుర్తుతెచ్చుకుంటున్నాం అని అంటూ ఉంటామే, ఆ పునఃస్మరణ అనే మాటలో ఉన్నదేమిటి? మనం ఒకప్పుడు తెలుసుకున్న జ్ఞానం మననుంచి దూరంగా

జరిగిపోయిందనేగా, మనం దాన్ని ఎప్పటికప్పుడు మర్చిపోతున్నామనేగా, అలా మర్చిపోయిన దాన్ని మళ్ళీ మళ్ళీ గుర్తుచేసుకుంటూ కాపాడుకుంటున్నామనేగా. అది ఎప్పుడూ ఒకలానే ఉంటోందని అనిపించవచ్చుగానీ, నిజానికి దాన్ని మనం మళ్లా కొత్తగా తెలుసుకుంటున్నట్టే.

నశించే వస్తువుల్ని మనం పరిరక్షించుకుంటున్నప్పుడు, పారంపర్య సూత్రాల ప్రకారం, ఆ పాతవే ఎల్లప్పటికీ కొనసాగుతాయని లేదు, వాటిని మనం ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూనే ఉంటాం. జీర్ణమైపోయిన ఆ పాతమర్త్యత్వం స్థానంలో, అటువంటిదే, మరొక కొత్త అస్తిత్వం ఉనికిలోకి వస్తూంటుంది. కాని దైవత్వం అలాకాదు. అది ఎప్పటికీ మార్పు లేకుండా అద్వితీయంగా నిలిచి ఉంటుంది. కాదా? ఈ పద్ధతిలో సోక్రటీస్, మర్త్య దేహంగానీ, లేదా మరే మర్త్య అస్తిత్వంగానీ ఎంతోకొంత అమరత్వాన్ని సముపార్జించుకుంటుంది. కానీ అసలు అమరత్వం అనేది దీనికన్నా భిన్నం. కాబట్టి, మనుషులు తమ సంతతిపట్ల చూపించే ప్రేమని చూసి మురిసిపోకు. అది అమరత్వంకోసం జీవులన్నిటిలోనూ సార్వత్రికంగా కనవచ్చే ఒక ఆసక్తి మాత్రమే.'

ఆమె మాటలు విని నేను నివ్వెరపోయాను. 'ఓ వివేకచూడామణీ, ఇదంతా నిజమేనా?' అనడిగాను.

పరిపూర్ణమైన సోఫిస్టుకుండే సాధికారిక స్వరంతో ఆమె 'ఆ విషయంలో నువ్వు సందేహించనక్కరలేదు సోక్రటీస్, మనుషుల తాలూకు అహమిక, ఆశాపరత్వం చూడు, కాని అదంతా అమరత్వంకోసం, శాశ్వత యశంకోసం వాళ్ళు పడే పాట్లు అని తెలియకపోతే, వాళ్ళ మతిమాలిన చేష్టలు చూసి నువ్వు ఆశ్చర్యపోతూనే ఉంటావు. వాళ్ళు తమ పిల్లలకోసం పడే పాట్లకన్నా మించిన కష్టాలు కూడా కొని తెచ్చుకోడానికి సిద్ధంగా ఉంటారు, ఎటువంటి యమయాతన పడటానికేనా డబ్బు ఖర్చుపెట్టడానికి తయారుగా ఉంటారు, చివరికి చావడానికి కూడా సిద్ధమవుతారు, ఎందుకో తెలుసా?

తాము మరణించాక, తమ పేరు శాశ్వతంగా మిగిలిపోవాలని. తమ పేరు జనస్మృతిలో మిగిలిపోతుందని అనుకోకపోతే ఆల్సస్టిస్ అడ్మెటస్ కోసం మరణించి ఉండేదా? పెట్రాక్లాస్ కోసం అకిలిస్ ప్రతీకారం తీర్చుకోవాలని అనుకునేవాడా? అంత దాకా ఎందుకు? మీ కాడ్రస్[39] తన పిల్లల కోసం తన రాజ్యాన్ని రక్షించుకోవాలని అనుకుని ఉండేవాడా? లేదు. నాకు బాగా నమ్మకం కుదిరింది. అందరు మనుషులూ అన్ని పనులూ చెయ్యగలరుగానీ, శాశ్వత విలువలకోసం నిలబడ్డారనే పేరు వస్తుందని నమ్మితే మాత్రం వాళ్ళు చెయ్యగల పనులకి హద్దే ఉండదు. వాళ్లు కోరుకునేదొక్కటే, అమరత్వం.'

'తమ దేహంలో మాత్రమే అమరత్వకాంక్ష ఉన్నవాళ్ళు స్త్రీలని సమీపించి పిల్లల్ని కంటారు. వాళ్ల ప్రేమ స్వభావం ఇంతే. తమ సంతతిద్వారా తమ స్మృతి నిలిచి ఉంటుందనీ, తమ పిల్లలద్వారా భవిష్యత్తులో తమకి అమరత్వం లభించి తాము ధన్యులు కాగలుగుతామనీ నమ్ముతారు. కాని ఆత్మలో అమరత్వం కోరుకునేవారుంటారు. వాళ్లు దేహంలో కన్నా, ఆత్మలోనే ఎక్కువ సృజనాత్మకంగా ఉంటారు. వాళ్ళు తమ ఆత్మలద్వారా తాల్చడానికి సముచితమైన గర్భమేదో వెతుక్కుని దాన్నే తాలుస్తారు. అటువంటి కానుపులు ఏవై ఉండవచ్చు? జ్ఞానమూ, శీలమూనూ. అలా గర్భం దాల్చే వారెవరు? సమస్తకవులూ, సకలకళాకారులూను. నవీన రూపకర్తలని అనిపించుకునేది వారే. అటువంటి జ్ఞానంలో అత్యున్నతజ్ఞానం కుటుంబాల్నీ, రాజ్యాల్నీ చక్కదిద్దడానికి పనికొచ్చే జ్ఞానం. దాన్నే మనం న్యాయమనీ, నిగ్రహమనీ పిలుస్తాం. ఎవరి హృదయాల్లో తమ యవ్వనకాలంలో ఇటువంటి ప్రేమబీజాలు నాటి ఉంటాయో, వాటివల్ల ఉత్తేజితులై ఉంటారో, వారు పరిణత వయస్కులు కాగానే ఆ కాంక్షాబీజం అంకురించి మొగ్గతొడగడం మొదలుపెడుతుంది. తాము కూడా గర్భందాల్చి నూతన జన్మని ప్రసవించాలనే ఉద్దేశ్యంతో వారు సౌందరాన్ని వెతుక్కుంటూ బయలుదేరతారు.

సౌందర్యాన్ని మాత్రమే. ఎందుకంటే విరూపంద్వారా అతడేదీ కొత్తగా సృష్టించలేడు. కాబట్టి సహజంగానే అతడు విరూపుల్ని బదులు సురూపుల్నే హృదయానికి హత్తుకుంటాడు. ఆ అన్వేషణలో అతడికి ఏకకాలంలో సుందరుడూ, ఉదాత్తుడూ అయిన మనిషి లభించాడనుకో, ఆ రెండూ ఏకవ్యక్తిలో కనిపించినప్పుడు ఆ మనిషిని అతడు మరింత సంతోషంతో స్వాగతిస్తాడు. ఆ వ్యక్తి సన్నిధిలో అతడి వాక్కులో శీలం, సౌందర్యం ఉప్పొంగి ప్రసరిస్తాయి.

ఎటువంటి సదాచరణ ఒక మనిషిని సజ్జనుణ్ణి చేస్తుందో, అటువంటి విద్యాభ్యాసం అతడు మొదలుపెడతాడు. ఆ సౌందర్యానికి తనని తాను అనుసంధానించుకోవడం ద్వారా అతడు ఆ సన్నిధిలో లేనప్పుడు కూడా ఆ సౌందర్యాన్ని గుర్తుపెట్టుకుంటాడు, తద్వారా తన ఆత్మలో సౌందర్యానికి జన్మనిస్తాడు. అప్పుడు వారిద్దరూ కలిసి తాము జన్మనిచ్చిన ఆ సౌందర్యాన్నీ, ఉదాత్తతనీ పెంచిపోషించుకుంటారు.

మామూలు మనుషులు మామూలు కలయికలద్వారా కనే సంతతికన్నా వారిద్దరూ కనే సంతతి మరింత సుందరం గానూ, మరింత శాశ్వతంగానూ ఉంటుంది కాబట్టి మామూలు అనుబంధాల కన్నా ఈ అనుబంధం మరింత దగ్గరగానూ, మరింత గాఢంగానూ ఉంటుంది.

హోమర్‌నీ, హెసియోడ్‌నీ[40] తలుచుకున్నప్పుడు వారి సంతతిలాంటి సంతతి2 కావాలని అనిపించనిదెవరికి? వారి సంతతిలాంటి సంతతిని కనాలని కోరుకోని వాళ్ళెవరుంటారు? ఎందుకంటే వారి సంతతి వల్లనే కదా వారు ప్రజాస్మృతిలో నిలిచి, శాశ్వత యశోవైభవాన్ని పొందగలిగారు. లేదా స్పార్టానీ, ఆ మాటకొస్తే ఏథెన్సునీ కూడా రక్షించడానికి లైకాగస్[41] వదిలిపెట్టాడే అటువంటి సంతతి కావాలని ఎవరు కోరుకోరు?

ఎథీనియన్ శాసనాలకు రూపకర్త అని చెప్పదగ్గ సోలన్[42] సంగతే తీసుకోండి, అలాంటివాళ్ళే మరెంతమందో మరెన్నో చోట్ల ఉన్నారు, గ్రీకుల్లోనూ ఉన్నారు, అనాగరికుల్లోనూ ఉన్నారు, ఈ ప్రపంచానికి ఉత్తమకృతుల్ని కానుకచేసినవారు, శీలప్రదాతలు. వారి సంతతి గౌరవార్థం ఎన్నో దేవాలయాలు నిర్మించబడ్డాయి. కానీ మామూలు మర్త్యసంతతికోసం అటువంటి దేవాలయాల్ని ఎవరూ ఎక్కడా నిర్మించినట్టు చూసామా?'

## 32

'ఇవన్నీ ప్రేమ తాలూకు మామూలు రహస్యాలు. వీటిని నీ అంతట నువ్వు అర్థం చేసుకోగలవు సోక్రటీస్. కాని వీటన్నిలోనూ మకుటాయమాన మహారహస్యంలోకి సరైన మనఃస్థితితో ప్రయాణిస్తే చేరగలంగాని, దాన్ని నువ్వు అందుకోగలవో లేదో నేను చెప్పలేను. కాని చెప్పడానికి మాత్రం నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. వాటిని అర్థం చేసుకోగలవేమో చూడు.

ఈ మార్గంలో ప్రయాణించాలనుకున్నవాడు మొదట తన యవ్వనంలో సౌందర్య దర్శనంతో మొదలుపెట్టాలి. అప్పుడు అతడికి అతడి గురువు మొదటగా ఏదో ఒక సుందరాకృతిని ప్రేమించడం నేర్పితే, దాన్నుంచి అతడికి సుందరమైన భావాలు కలగడం మొదలవుతుంది. నెమ్మదిగా అతడికి ఒక ఆకృతిలోని సౌందర్యమూ, మరొక ఆకృతిలోని సౌందర్యమూ కూడా ఒక్కలాంటివే అని తేటపడుతుంది.

ఆకృతిసౌందర్యాన్నే గనక అతడు అన్వేషిస్తూన్నట్టయితే అన్ని ఆకృతుల్లోని సౌందర్యం కూడా ఒక్కలాంటిదే అని తెలియకుండా ఎలా ఉంటుంది? ఏదో ఒక్క ఆకృతిసౌందర్యాన్నే సౌందర్యంగా భావించడంలోని హింసనుంచి ఆ మెలకువ అతణ్ణి బయటపడేస్తుంది. అప్పుడతడు అన్ని ఆకృతుల్లోని సౌందర్యాన్నీ ప్రేమించగలుగుతాడు. ఆ తర్వాత దశలో అతడు బాహ్యాకృతుల్లో కనిపించే సౌందర్యం కన్నా ఆ సౌందర్యాన్ని దర్శించగల మనసు మరింత సౌందర్యమయమని గ్రహించగలుగుతాడు.'

'కాబట్టి శీలవంతమైన ఒక ఆత్మకి ఏ మాత్రం సొగసు ఉన్నా, అతడు దాన్ని ఎంతో ఇష్టంగా పెంచిపోషించుకుని, యువతని సరైన దారిలో పెట్టగల భావాలకు జన్మ నివ్వడం మొదలుపెడతాడు. నెమ్మదిగా అతడు సంస్థల్లోనూ, శాసనాల్లోనూ ఉన్న సౌందర్యాన్ని దర్శించి, ఆ సౌందర్యాలన్నీ కూడా ఒకే కుటుంబానికి చెందినవని గ్రహిస్తాడు. వాటితో పోలిస్తే వ్యక్తిసౌందర్యం చాలా అల్పమైన విషయమని అర్థం చేసుకుంటాడు. చట్టాల, సంస్థల సౌందర్యాన్ని గుర్తించిన తరువాత అతడు విజ్ఞాన శాస్త్రాల్లోని సౌందర్యాన్ని చూడడం మొదలుపెడతాడు. ఆ దర్శనం, ఆ ప్రేమ ఒక సంకుచితమనస్కుడు మరొక యువకుడికో, పురుషుడికో, సంస్థకో బానిసగా మారే సేవకుడి ప్రేమలాంటిది కాదు. అది అపారసౌందర్యపారావారాన్ని తన రెండుబాహువుల్తోనూ దగ్గరగా తీసుకునే లాంటి ప్రేమ.

అటువంటి ప్రేమలో అతడు ఎన్నో ఉదాత్త, గంభీర సత్యాల్ని కనుగొనగలుగుతాడు. అతడి జ్ఞాన ప్రేమకు ఎల్లలుండవు. ఆ తీరమ్మీదనే అతడు నానాటికీ మరింత విహరించి బలోపేతుడయ్యాక ఒకనాటికి అతడికి విశ్వరూప సాక్షాత్కారం సంభవిస్తుంది: ఒకే ఒక్క విజ్ఞానం, కంటికి కనిపించే ప్రతి ఒక్కదానిలోనూ సౌందర్యాన్ని చూడగలిగే ప్రజ్ఞానం సిద్ధిస్తుంది.

దీని గురించే ఇప్పుడు చెప్పబోతున్నాను, శ్రద్ధగా విను.'

## 33

'ఈ విధంగా ప్రేమదీక్ష పొందినవాడు, ఒక క్రమవికాసంలో, పద్ధతిలో సౌందర్యదర్శనం సిద్ధించినవాడు, చివరికి హటాత్తుగా ఒక మహాద్భుతసౌందర్యాన్ని చూడగలుగుతాడు (మన మొత్తం వెతుకులాటకి చివరి గమ్యం ఇదే సోక్రటీస్)– ఆ సౌందర్యం ఎటువంటిదంటే, అన్నిటికన్నా ముందు, అది శాశ్వతం, అమరం. దానికి వికాసం, వినాశం రెండూ లేవు, పొంగడం, కుంగడం రెండూ తెలియదు.

రెండోది, అది ఒక దృక్పథంలోంచి చూస్తే గొప్పదిగానూ, మరొక దృక్పథంలోంచి చూస్తే నీచంగానూ కనిపించేది కాదు. లేదా ఏదో ఒకచోట, ఏదో ఒకసారి, లేదా ఏదో ఒకదానికి సంబంధించి సవ్యంగానూ, మరొకసారి, మరొకచోట, మరొకరివిషయంలో అపసవ్యంగానూ కనిపించేది కాదు. అది కొందరికి ఉన్నతంగానూ, మరొకరికి అధమం గానూ గోచరించేది కాదు, ఏదో ఒక ముఖాన్నో, కరచరణ్యాదవయవాల్నో లేదా ఏదో

ఒక శరీరభాగాన్నో పోలి ఉండేది కాదు, లేదా అది ఏదో ఒక్కలానో, లేదా జ్ఞానంలోనో, లేదా ఎవరో ఒకరిలో ఉన్నదిగానో, అంటే ఒక జంతువులోనో లేదా స్వర్గంలోనో లేదా భూమ్మీదనో లేదా మరెక్కణ్ణో ఉండేది కాదు.

ఆ సౌందర్యం నిరపేక్షం, ప్రత్యేకం, సరళం, శాశ్వతం, హెచ్చుతగ్గులేనిది, మార్పులేనిది, పైగా ఈ ప్రపంచంలో వికసిస్తున్న, కృశిస్తున్న సకల సౌందర్యాలకూ అదే ఆధారభూతమైంది. నిజమైన ప్రేమ ప్రభావంలో తన శిఖరారోహణ మొదలుపెట్టినవాడు, ఆ సౌందర్యాన్ని చూడటం మొదలుపెట్టినవాడు, గమ్యానికి ఎంతో దూరంలో లేడు.

ఆ ప్రయాణం, ప్రేమసామ్రాజ్యం వైపు ఒకరి మార్గదర్శనంలో జరిగే ఆ ప్రయాణం, సాధారణ పార్థివసౌందర్యంతోటే మొదలై నెమ్మదిగా దాన్ని మించిన మరొక సౌందర్యం కోసం ఆరోహణగా కొనసాగుతుంది.

ఆ ఆరోహణలో ఇవి మెట్లు మాత్రమే. ఒకటినుంచి రెంటికి, రెంటినుంచి సమస్త సౌందర్యాలకూ, సౌందర్య ఆకృతులనుంచి సౌందర్యోపేతమైన జీవనవిధానానికీ, సౌందర్యభరితమైన ఆచరణనుంచి సౌందర్యోపేతమైన అభిప్రాయాలకూ, సౌందర్యభరిత భావాలనుంచి అప్రమేయసౌందర్యదర్శనానికీ కొనసాగి అంతిమంగా, సౌందర్యసారాంశ మేమిటో తెలుసుకోవడంతో ముగుస్తుంది.

ఇదీ సోక్రటీస్, తక్కినవాటన్నిటినీ పక్కనపెట్టి మనిషి జీవించవలసిన జీవితం. ఆ అప్రమేయ సౌందర్యధ్యానంలో గడపడం. ఒకసారి ఆ సౌందర్యాన్ని నువ్వు చూడగలిగావా, ఇంక బంగారం, వస్త్రాలు వేటిమీదా నీ దృష్టి లగ్నం కాదు.

ఇప్పుడు నిన్ను ఆకర్షిస్తున్న అందమైన యువతీయువకులు అప్పుడు నిన్ను ఆకర్షించడం మానేస్తారు. ఇప్పుడు నీగ్గాని మరెవరికైనాగానీ వాళ్లని చూస్తే చాలుతృప్తి కలుగుతుంటుంది. వీలైతే వాళ్లతో సంభాషిస్తే చాలనిపిస్తుంది, మద్యమాంసాలు అక్కర్లేని ఆ సమావేశాల్లో మీరు కేవలం అక్కడ ఉండగలిగితే చాలు, వాళ్లని చూస్తూ కూచోగలిగితే చాలనిపిస్తున్నది,

కాని ఆ యథార్థసౌందర్యాన్ని చూడటానికి కళ్ళుండాలేగాని, ఆ దివ్యసౌందర్యం, ఆ నిర్మల, స్ఫటికస్వచ్ఛసౌందర్యం– మర్త్యత్వపు మాలిన్యాలంటని, మానవజీవితపు వన్నె చిన్నెలు, హంగుపొంగులు దరిచేరలేని ఆ సౌందర్యాన్ని చూడటానికి నోచుకోగలిగితే, సదా ఆ సరళ, సత్య, దివ్యసౌందర్యం[43]తోటే సదా సంభాషిస్తో ఉండిపోగలిగితే!'

## 34

'అటువంటి దివ్యయోగంలో, మనోనేత్రంతో ఆ సౌందర్యాన్ని సంభావిస్తో, అతడు సౌందర్యాకృతుల్ని కాక, సౌందర్య సత్యాల్ని సృజించగలిగే సామర్థ్యానికి చేరుకుంటాడు (ఎందుకంటే, అతడికింక ఆకృతితో పనిలేదు, యథార్థాన్నే అతడు దర్శించాడు కాబట్టి). దేవుడికి స్నేహితుడిగా మారే క్రమంలో అమరుడయ్యే ప్రస్థానంలో, నిజమైన విలువల్ని పెంచిపోషించగలవాడు మర్త్యుడయితే మాత్రమేమి? ఆ జీవితమేమన్నా తక్కువపాటి జీవితమా?'

'ఆ యోగిని డయొటిమా నాకు చెప్పిన మాటలివీ ఫేడ్రోస్, నేన్నీకు ఒక్కడికే కాదు, అందరికీ చెప్తున్నాను. ఎందుకంటే వాటిలో సత్యముందని నాకు నమ్మకం కలిగింది. ఆ మాటలు నన్ను ఒప్పించాయి కనుక, నేను ఆ మాటల్తో తక్కినవాళ్లని కూడా ఒప్పించాలనుకుంటున్నాను. ఈ పురుషార్థాన్ని సాధించడంలో మానవస్వభావానికి ప్రేమని మించిన సహాయకుడు మరొకడు దొరకడు. కాబట్టి నేనతణ్ణి గౌరవించినట్టే ప్రతి ఒకరూ గౌరవించాలని కోరుకుంటాను. అతడి దారిలో నడవాలని కోరుకుంటాను, తక్కినవాళ్ళని కూడా అలా నడవమని ప్రోత్సహించాలంటాను. ఇప్పుడు కీర్తించినట్టే ప్రేమగుణగానాన్ని నేనెన్నటికీ ఇలానే కీర్తిస్తూ ఉండాలని కోరుకుంటాను.'

'నేను చెప్పిన ఈ మాటల్ని, ఫేడ్రోస్, నువ్వు ప్రేమదేవతా స్తోత్రమను లేదా నీకు నచ్చిన మరేపేరుతోనైనా పిలు' అని అన్నాడు సోక్రటీస్.

సోక్రటీస్ తన ప్రసంగం ముగించగానే అందరూ కరతాళధ్వనుల్తో అభినందించారు. సోక్రటీస్ తన ప్రసంగంలో అరిస్టాఫెనీజ్ ప్రసంగంలోంచి ఎత్తిచూపినవాటికి అరిస్టాఫెనీస్ జవాబుగా ఏదో చెప్పడం మొదలుపెట్టాడు.

ఇంతలో ఎవరో బయటనుంచి తలుపు బాదడం వినిపించింది. పానోన్మత్తులసందడీ, పిల్లంగోవి ఊదే అమ్మాయి సంగీతమూ వినవచ్చాయి. అలా తలుపు తడుతున్నవాళ్ళెవరో చూసి రమ్మని అగథాన్ తన పరిచారకుల్ని పంపించాడు.

'వాళ్లు మనవాళ్ళే అయితే లోపలకి తీసుకురండి. మనకు తెలియనివాళ్లయితే, ఇక్కడ పానగోష్ఠి ముగిసిపోయిందని చెప్పండి' అని అన్నాడు.

కొన్ని క్షణాల తర్వాత ఆ గోష్ఠిలో ఆల్సిబయడిస్ కంఠస్వరం పెద్దగా ప్రతిధ్వనించడం వినిపించింది. అతడు పూర్తిగా పానోన్మత్తుడై ఉన్నాడు.

'ఏడి అగథాన్? నన్ను అగథాన్‌దగ్గరికి తీసుకెళ్ళండి' అని అరుస్తున్నాడు.

మొత్తానికి, ఆ పరిచారకులూ, పిల్లంగోవి ఊదే అమ్మాయీ దారి చూపిస్తుండగా, అతడు అగథాన్ దగ్గరకు రాగలిగాడు.

'అభినందనలు మిత్రులారా!' అన్నాడతడు గడప దగ్గర ప్రత్యక్షమవుతూ. అతడి గళసీమలో పెద్ద పూలమాల వేలాడుతూ ఉండి. శిరసుమీంచి రంగురంగుల పట్టీలు వేలాడుతున్నాయి.

'ఇవాళ మీ బృందంలో ఒక పచ్చితాగుబోతుకి కూడా స్థానం కల్పించగలరా? లేదా అగథాన్ నెత్తిన ఒక పూలకిరీటం తగిలించి వెళ్ళిపొమ్మంటారా? నేనిక్కడికి వచ్చింది అగథాన్‌ని సన్మానించడానికే అనుకోండి. నిన్న రాలేకపోయాను. అందుకని ఇవాళ వచ్చాను. ఇదుగో, నా నెత్తిన ఈ పట్టీలు తగిలించుకొచ్చాను. వీటిని నా తలమీంచి తీసి అగథాన్ శిరసుని అలంకరిస్తాను. అత్యంత సుందరుడు, జ్ఞానసంపన్నుడూ అని అతణ్ణి స్తుతిస్తాను. నేను తప్పతాగి ఉన్నానుకాబట్టి మీరు నన్ను చూసి నవ్వుతున్నారా? నవ్వితే నవ్వండిగాని నేను నిజమే చెప్తున్నానని నాకు బాగా తెలుసు'.

## 35

'కానీ ముందిది చెప్పండి, నేను లోపలకి రావచ్చా? అప్పుడే నేనింతకుముందు చెప్పిన మాటలు బాగా అర్థమవుతాయేమో? మీరు నాతో కలిసి మధుపానం మొదలుపెడతారా?'

అతడి మాటలు వింటూనే ఆ మిత్రబృందమంతా ముక్తకంఠంతో అతణ్ణి లోపలకి రమ్మనీ, వచ్చి తమ మధ్య కూచోమనీ ఆహ్వానించేరు. అగథాన్ అతణ్ణి మరీ ప్రత్యేకంగా ఆహ్వానించేడు. అప్పుడు పరిచారకులు అతణ్ణి లోపలకి తీసుకువచ్చారు.

అతడు తన శిరసుమీద ఉన్న రంగురంగుల తురాయిలు, పతకాలు తీసి తన కళ్ళముందు పెట్టుకుని చూసుకున్నాడు. అలా చూడటం వల్ల అతడికి అక్కడ సోక్రటీస్ ఉన్నట్టు కనబడలేదు. కాని సోక్రటీస్ తాను పక్కకు తప్పుకుని అతడికి కూచోడానికి చోటుచేసాడు. ఆల్సిబయడిస్ అగథాన్‌కీ, సోక్రటీస్‌కీ మధ్య ఉన్న జాగాలో కూచుని అగథాన్‌ని కౌగిలించుకుని అతడిశిరసును విజయలాంఛనాలతో అలంకరించాడు.

'అతడి చెప్పులు తీసి పక్కన పెట్టండి, ఈ శయ్యమీదనే మూడోమనిషి కూచోడానికి సిద్ధం చెయ్యండి' అని ఆదేశించాడు అగథాన్.

'చాలా సంతోషం. కానీ మన ఉత్సాహంలో ఆ మూడో మనిషి ఎవరు' అనడుగుతూ ఆల్సిబయడిస్ పక్కకి తిరిగి సోక్రటీస్‌ని చూసాడు.

'హో హెర్క్యులస్! ఏమిటిది? ఇక్కడ సోక్రటీస్ నాకోసం వేచి ఉండటమేమిటి? ఆయన ఎప్పుడూ ఇంతే, అనుకోని తావుల్లో అనుకోని విధంగా ప్రత్యక్షమవుతూ ఉంటాడు. ఇప్పుడేమి చెప్తావు? ఎందుకున్నావిక్కడ? ఈ బృందంలో నువ్వు కూడా ఎలానో చోటు సంపాదించావే. అది కూడా అరిస్టొఫెనీస్ లాగా హాస్య, వ్యంగ్య ప్రేమికుడి పక్కన కాదు, అత్యంత సత్సాంగత్యంలో కనబడుతున్నావే!'అని అరిచాడు.

సోక్రటీస్ అగథాన్ వైపు తిరిగి 'అగథాన్, ఇవ్వాళ నువ్వు నన్ను రక్షించక తప్పదు. నా మీద ఈ మనిషికి మోహం నానాటికీ ముదిరిపోతోంది. ఇతణ్ణి నేను ఏ ముహూర్తాన అభిమానించడం మొదలుపెట్టానోగాని, అప్పణ్ణుంచీ నన్ను మరొకరెవరితోనూ మాటాడ నివ్వడు, ఏ అందగాడి వంకా కన్నెత్తి చూడనివ్వడు. ఎవరినైనా చూసేనే అనుకో, అసూయతో రగిలిపోతాడు, నన్ను తిట్టడం మొదలుపెడతాడు, అక్కడితో ఆగడు, నన్ను పట్టుకునే ఉంటాడు, ఇంకేమి అఘాయిత్యం చేస్తాడో అని భయం కూడా వేస్తుంది. కాబట్టి మమ్మల్ని సమాధానపరుచు లేదా అతడేదన్నా అఘాయిత్యానికి పూనుకుంటే నన్ను రక్షించు. అతడి మోహావాలకం చూస్తే నాకు ప్రాణాలమీదకొచ్చినట్టే ఉంటుంది' అని అన్నాడు.

'నీకూ నాకూ మధ్య శాంతికుదరడం పొసగని పని' అని అన్నాడు ఆల్సిబయడిస్.

'ప్రస్తుతానికైతే నేను నీ శిక్షను వాయిదా వేస్తున్నాను. అగథాన్ ఇప్పుడు నిన్ను అలంకరించిన ఆ తురాయిల్లో కొన్ని నాకు వెనక్కివ్వు, ఈ సార్వత్రికనియంత అద్భుత శిరాన్ని అలంకరిస్తాను. లేకపోతే తనని పట్టించుకోకుండా నిన్నొక్కణ్ణే సన్మానించానని నామీద అలుగుతాడు. సంభాషించడం మొదలుపెడితే అతడు సమస్తమానవాళినీ పాదాక్రాంతం చేసుకోగలడు. ఏదో ఒక్కసారి కాదు, లేదా మొన్న నువ్వు చేసినట్టుకాదు, ఎప్పుడు మాట్లాడినా అతడే విజేత' అని అగథాన్ శిరసుని అలంకరించిన తురాయిలు కొన్ని తీసి సోక్రటీస్ శిరసుని అలంకరించి, అప్పుడు శయ్యమీద విశ్రాంతిగా వెనక్కి ఆనుకున్నాడు.

మళ్ళా ఆ బృందం కేసి చూసి 'ఏమిటిది మిత్రులారా మిమ్మల్ని చూస్తుంటే చాలా గంభీరంగా కనిపిస్తున్నారు? మీ వాలకం ఇలా ఉండకూడదే. మీరు తాగడం మొదలుపెట్టాలి కదా, నన్ను లోపలకి రమ్మన్నప్పుడు మన ఒప్పందం అదే కదా. మీరు పీకలదాకా తాగే దాకా, ఈ విందుకి అధినేతను నేనే. అగాథాన్, పెద్ద పానకలశం తెప్పించు, లేదా–' అని పరిచారకుడికేసి తిరిగి' 'ఆ పానపాత్ర ఇటు పట్టుకురా' అని అన్నాడు.

అతడి దృష్టిని ఆకర్షించిన ఆ పానపాత్ర చిన్నదేమీ కాదు. అతడు దాన్ని పూర్తిగా నింపుకుని, ఒక్క గుక్కలో ఖాళీ చేసి దాన్ని సోక్రటీస్ కోసం మళ్ళా నింపమని ఆ పరిచారకుణ్ణి ఆదేశించాడు.

## 36

'గమనించండి మిత్రులారా నేనెంతో తెలివిగా ప్రదర్శిస్తున్న ఈ యుక్తి సోక్రటీస్ మీద ఎటువంటి ప్రభావం చూపించలేదు. ఆయన ఎంతైనా తాగనివ్వు, ఏమీ తాగనట్టే ఉండగలడు' అని అన్నాడు. ఆ పరిచారకుడు తనకు అందించిన పానపాత్రను సోక్రటీస్ చవిచూసాడు.

'ఆల్సిబయడిస్? ఏమిటిది? ఏదో దాహంపట్టినట్టు తాగుతూపోడమేనా? ఒక గోష్ఠి ఉండదా? ఒక గానం ఉండదా?' అనడిగాడు ఎరిక్సిమేకస్.

'హాహాహా! గొప్ప వంశానికి చెందిన గొప్ప మనిషికి తగ్గట్టే ఉన్నాయి నీ మాటలు' అన్నాడు ఆల్సిబయడిస్.

'నువ్వు కూడా గొప్పవాడివేలే! కానీ ఇంతకీ ఏం చేద్దామంటావు' అనడిగాడు ఎరిక్సిమేకస్.

'అది మీ ఇష్టానికే వదిలేస్తున్నాను' అన్నాడు ఆల్సిబయడిస్.

'హోమర్ చెప్పినట్టుగా ఆ వైద్యుడు మన గాయాల్ని నయం చేయగలడు. కాబట్టి ఆ వైద్యుడెలా చెప్తే అలా నడుచుకుందాం మనం. చెప్పు, ఏం చేద్దామంటావు?'

'సరే, విను, నువ్వు రాడానికి ముందు మేమొక తీర్మానం చేసుకున్నాం. మాలో ప్రతి ఒక్కరం ప్రేమదేవతను స్తుతిస్తూ ఒక్కొక్కరూ ఒక ప్రసంగం చెయ్యాలని అనుకున్నాం. ఎవరికి చాతనయినట్లు వాళ్ళు. ఇక్కడ కూచున్నవాళ్ళంతా ఎడమనుంచి కుడికి ఎవరి వంతు వచ్చినప్పుడు వాళ్ళు మాట్లాడేరు. మేమంతా మాట్లాడేం. నువ్వు తప్ప. ఇప్పుడు పానసంతోషం చవిచూసావుకాబట్టి నువ్వు కూడా మాట్లాడకతప్పదు. ఆ తర్వాత సోక్రటీస్ ఏం చెయ్యోచ్చో చెప్పు, ఆయన తన కుడివైపు ఉన్నాయనకి ఏం చెయ్యాలో చెప్తాడు, అలా వంతులవారీ మన గోష్ఠి సాగిద్దాం' అని అన్నాడు ఎరిక్సిమేకస్.

'ఇది చాలా బావుంది ఎరిక్సిమేకస్' అన్నాడు ఆల్సిబయడిస్.

'కాని ఒక తాగుబోతు ప్రసంగాన్ని, తక్కినపెద్దమనుషుల్తో ప్రసంగాల్తో పోలిస్తే మాత్రం అంతకన్నా అన్యాయం మరొకటి ఉండబోదు. అయితే ప్రియమిత్రమా, ఒకటి

చెప్పు, సోక్రటీస్ ఇప్పుడే చెప్పాడే ఆ మాటలు నువ్వు నిజంగా నమ్ముతున్నావా? కానీ సత్యం అందుకు విరుద్ధం అని గట్టిగా చెప్పగలను. అతడి సన్నిధిలో నేను అతణ్ణి కాక మరెవర్ని ప్రశంసించినా, మనిషిగాని, దేవుణ్ణిగాని, అతడు నన్ను వదిలిపెట్టడు' అని కూడ అన్నాడు.

'నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలుస్తోందా?' అనడిగాడు సోక్రటీస్.

'నీ మాటలు కట్టిపెట్టు. పొసైడన్ మీద ఒట్టు, నువ్విక్కడ ఉండగా నేను మరొకర్ని ప్రశంసించే ప్రసక్తేలేదు' అన్నాడు ఆల్సిబయడిస్.

'మంచిది, అలాగయితే సోక్రటీస్‌నే స్తుతించు' అన్నాడు ఎరిక్సిమేకస్.

'ఏమంటున్నావు ఎరిక్సిమేకస్? మీ అందరిముందూ నేను నిజంగానే ఈ పెద్దమనిషి మీద దాడిచెయ్యగలననుకుంటున్నావా?'

'ఇప్పుడేం మాట్లాడాలనుకుంటున్నావు నువ్వు? వీళ్ళందరిముందూ నన్ను నవ్వులపాలు చెయ్యబోతున్నావా? అదేనా నువ్వు స్తుతిస్తానంటే అర్థం?' అన్నాడు సోక్రటీస్.

'నువ్వనుమతిస్తే నేను సత్యం మాట్లాదామనుకుంటున్నాను.'

'అనుమతించడం కాదు, సత్యం మటుకే చెప్పమని మొత్తుకుంటున్నాను'.

'అయితే ఇదుగో ఇప్పుడే మొదలుపెడుతున్నాను' అన్నాడు ఆల్సిబయడిస్. 'నేను మాట్లాడబోయేది నిజంకాకపోతే నువ్వు వెంటనే నాకు అడ్డుపడి అది అబద్ధమని అప్పుడే చెప్పెయ్యి. కాని నేను సత్యమే చెప్పాలనుకుంటున్నాను. అయితే నా మనసుకి ఎలా తోస్తే అలా చెప్తాను. ఎందుకంటే నీ అద్వితీయ గుణగణాల్ని ధారాళంగానూ, ఒక క్రమపద్ధతి లోనూ చెప్పుకుంటూ రావడం నేనున్నపరిస్థితిలో ఏమంత సులభం కాదు'.

## 37

'మిత్రులారా నేనిప్పుడు సోక్రటీస్ గురించి చేపట్టబోయే ప్రశంసలో అతడి ముఖచిత్రం కొద్దిగా విచిత్రంగా కనిపించవచ్చు, కాని అది అతణ్ణి తక్కువచెయ్యడానికి కాదు, సత్యం చెప్పడంకోసమే మాత్రమే అని గ్రహించండి.'

'అతణ్ణి చూస్తే అర్థాకృతిలో మలిచిన సిలనోస్ [44] శిల్పాలు గుర్తొస్తాయి. చూడండి విగ్రహాలమ్మే దుకాణాల్లో కనిపిస్తుంటాయి, నోట్లో పిల్లంగోవులూ, సన్నాయిలూ పెట్టుకుని ఊదుతున్నట్టుంటాయి. వాటిని మధ్యలో చీల్చి చూడవచ్చు. అలా చీల్చినప్పుడు ఆ విగ్రహాల మధ్యలో దేవతాప్రతిమలుంటాయి. అతడు మర్స్యాస్[45] లాంటి శాటర్ [46]. నీ ముఖం

శాటర్‌లాగా ఉంటుందంటే నువ్వు కూడా కాదనలేవు సోక్రటీస్. ఇలాంటి పోలికలు ఇంకా చాలా ఉన్నాయనుకో.'

'మనుషుల్ని లొంగదీసుకోడంలో నిన్నుమించినవాళ్ళు లేరు. ఈ సంగతి నువ్వొప్పుకోకపోతే, సాక్షుల్ని పట్టుకొస్తాను. నువ్వు పిల్లంగోవి ఊదుతావు కదా. నువ్వు మర్స్యాస్ కన్న అద్భుతమైన గాయకుడివి. అతడు తన శ్వాసబలంతో మనుషుల ఆత్మల్ని మురిపించగలిగేవాడు. అతడి సంగీతాన్ని ఆలపించే గాయకులు ఇప్పటికీ శ్రోతల్ని మంత్రముగ్ధుల్ని చేయగలరు. ఒలింపస్ మధురగీతాలు[47] అతడు నేర్పినవే. ఆ గీతాల్ని గొప్ప విద్వాంసుడు ఆలపించనివ్వండి లేదా అభం శుభం తెలియని పిల్ల[48] ఆలపించ నివ్వండి, ఎవరు ఆలపించినా వాటి ప్రభావం అద్వితీయమే. అవి దైవగీతాలు. దేవతల గురించీ, దేవతారహస్యాల గురించీ తెలుసుకోవాలనుకునేవారిని పట్టుకుని వారి అంతరంగాల్ని వారికే ఎరుకపర్చగల శక్తి వాటిది.

కానీ, నువ్వో, నీకు వేణువు అవసరమే లేదు, వట్టి మాటలతోటే అలాంటి ప్రభావం చూపించగలవు. అతడికీ నీకూ తేడా అది. మేము మరెవరైనా వక్తని విన్నప్పుడు, అతడెంత మంచి వక్తగానీ, అతడి మాటలు మామీద ఎలాంటి ప్రభావం చూపించలేవు. అదే నువ్వయితేనా, నీ మాటలు, నీ సంభాషణాశకలాలు, అవి రెండోమనిషిద్వారా విన్నా కూడా, వాళ్ళు వాటిని సరిగ్గా చెప్పలేకపోయినా కూడా, వాటిని విన్న ప్రతి ఒక్కర్నీ, స్త్రీనీ, పురుషుణ్ణీ, శిశువునీ అవి సంభ్రమంలో ముంచెత్తుతాయి.

నేను మరీ తప్పతాగి మాట్లాడుతున్నానని నువ్వెక్కడ అనుకుంటావో అని భయంగా ఉందిగానీ, లేకపోతే నీ మాటల ప్రభావం నా మీద ఎంత ఉందో మరింత గట్టిగా చెప్పి ఉండేవాణ్ణి. ఎందుకంటే నా హృదయం కోరిబంటియన్ ఉన్మత్త నర్తకుల[49] కన్నా మిన్నగా నాట్యం చేస్తుంటుంది. నీ మాటలు విన్నప్పుడల్లా నా కళ్ళు ఆనందాశ్రువులు వర్షిస్తూనే ఉంటాయి.

నాలాగే చాలామంది ఆ మాటలనియెడి మంత్రమహిమకు లోనవుతుంటారని నాకు తెలుసు. నేను పెరిక్లీస్[50] ని విన్నాను, మరెందరో గొప్ప వక్తల్ని విన్నాను. వాళ్లని విన్నప్పుడు బాగానే మాట్లాడారనిపిస్తుంది. కాని నిన్ను విన్నప్పుడు కలిగేలాంటి అనుభూతి మాత్రం వారిని విన్నప్పుడు కలగలేదు. వాళ్ళ మాటలు నా ఆత్మని ఉద్రేకించలేదు. అలాగని నేను నీ వాక్సుధకి ఇంతలా బానిసగా మారిపోయానేమిటా అని నా పట్ల నాకెప్పుడూ కోపం కూడా కలగలేదు.'

# 38

'ఈ మర్స్యాస్ నన్నెలాంటి స్థితిలోకి నెట్టాడంటే, నేనతడిపట్ల బధిరుణ్ణి కాకపోతే, సైరన్ల[51] సంగీతం వినకుండా పారిపోయినట్టు పారిపోగలిగితే తప్ప నేను బతకలేనేమో, నాక్కూడా తక్కినవాళ్ళకిపట్టిన గతే పడుతుందేమో అనిపించేది (సోక్రటీస్, ఇది నువ్వు ఒప్పుకుంటావని నాకు తెలుసు). ఎందుకంటే అతడు నన్ను నిశ్చలుణ్ణి చేసేస్తాడు. అతడి పాదాల దగ్గర కూచుని ఉండగానే నా వయసు గడిచిపోతుందనిపిస్తుంది.'

నేను ప్రస్తుతం బతుకున్న పద్ధతి సరైంది కాదని ఆయన నాకు పరోక్షంగా పదేపదే గుర్తుచేస్తుంటాడు. నా ఆత్మికఅవసరాల్ని నిర్లక్ష్యం చేసి ఎథీనియన్ల గొడవల్లో నేను కూరుకు పోతున్నానని నాకు గుర్తుచేస్తుంటాడు కాబట్టే నేను నా చెవులు మూసుకుని అతణ్ణుంచి దూరంగా పారిపోతుంటాను.

సిగ్గుపడటం నా స్వభావంలోనే లేదని మీరనుకోవచ్చు, కాని ఈ ప్రపంచంలో నన్ను సిగ్గుపడేట్టు చేసిందంటూ ఎవరన్నా ఉంటే అతడొక్కడే. నాకు తెలుసు నేనతడిమాటకి ఎదురుచెప్పలేనని. ఆయన చెప్పినట్టు చెయ్యడం నాకు చాతకాదని చెప్పలేను. కాని అతని దగ్గరనుంచి బయటిరాగానే ప్రజాదరణా, ప్రజామోదం పొందాలన్న కోరిక వరదలాగా నన్ను ముంచెత్తుతుంది.

అందుకని నేనతణ్ణుంచి పారిపోతాను, తీరా అతణ్ణి చూడగానే అతడిముందు ఏమేం చెప్పానో అదంతా గుర్తొచ్చి సిగ్గనిపిస్తుంది. అతడు చచ్చిపోతే బాగుణ్ణని చాలా సార్లు అనిపించింది. కాని నాకు ఇది కూడా తెలుసు, నిజంగా అతడు మరణిస్తే నాక్కలిగేది సంతోషంకాదు, అంతులేని దుఃఖం. అందుకని నాకేమీ పాలుపోదు.

ఈ గంధర్వుడి వేణుగానం విని నేనూ నాలాంటి వాళ్లం మరెందరమో అనుభవిస్తున్న నరకం ఇది. అయినా కూడా అతడి మూర్తిమత్వం ఎటువంటిదో, అతడి శక్తిసామర్థ్యాలు ఎటువంటివో మరొకమారు చెప్పనివ్వండి. అవును, నేను చెప్పితీరాలి, ఎందుకంటే మీకెవ్వరికీ ఆయన ఏమిటో నిజంగా తెలియదు. కాబట్టే నేను ఆయన్ని మీముందు ఆవిష్కరించాలనుకుంటున్నాను.

ఎలానూ మొదలుపెట్టాను కాబట్టి నన్ను పూర్తిగా చెప్పనివ్వండి. సౌందర్యమంటే అతడికెంత మక్కువనో మీరందరూ చూసారు కదా. అందగాళ్ళ అందం తనని కాటువేస్తోందా అన్నట్టు వాళ్ల దగ్గరే తిష్ఠవేసుక్కూచుంటాడు. కాని మళ్లా తనకేమీ తెలియదన్నట్టూ, అసలు

అటువంటి విషయాల పట్ల ధ్యాసనే లేదన్నట్టూ కనిపిస్తాడు. అతడు పైకి కనిపించే రూపం అది. ఈ విషయంలో అతడు సిలనస్ లాంటివాడే కాదంటారా?

నిజంచెప్పాలంటే అతడి బాహ్యాకృతి సిలనస్ అర్ధాకృతిప్రతిమలాగా ఉంటుంది. కానీ, ఓ నా పానగోష్ఠిమిత్రులారా, అతడి గుండె చీల్చి చూడండి! ఎటువంటి జితేంద్రియుడు సాక్షాత్కరిస్తాడు మీకక్కడ!

తక్కిన ప్రపంచం ఏ సౌందర్యం ఎదట, సిరిసంపదల ఎదట, గౌరవప్రతిష్టల ఎదట సాష్టాంగపడిపోతుందో, వాటిపట్ల అతడికి కించిత్తు కూడా దృష్టిలేదు. ఇంకా చెప్పాలంటే వాటి పట్ల అతడికి చెప్పలేనంత ఏహ్యత. అందం, సంపద, హోదా ఉన్నవారు గొప్ప భాగ్యశాలురని అతడు ఎన్నటికీ అనుకోలేడు. అసలు మానవాళిని తృప్తిపరచడం పట్ల అతడికెటువంటి ఆసక్తీ లేదు. పైగా వాళ్ళని ఎగతాళిచెయ్యడంలోనూ, తీసిపక్కన పారెయ్యడంలోనే అతడు జీవితమంతా గడిపేసాడు.'

## 39

'కాని నేనతడి హృదయాన్ని చీల్చి చూసాను. అందులో దాగిఉన్న గంభీరప్రయోజనాన్ని దర్శించాను. ఆయన మహాకర్షసౌందర్యాన్ని నేనెటువంటి దైవీయ, స్వర్ణాకృతుల్లో గమనించా నంటే ఆ క్షణాన సోక్రటీస్ నన్నేం చెయ్యమని ఆజ్ఞాపిస్తే అది చేసేసి ఉండేవాణ్ణి. తక్కిన వాళ్ళు ఆ సౌందర్యదర్శనాన్ని చూడకపోయి ఉండవచ్చు, కాని నేను చూసాను. అప్పుడు ఆయన నా అందాన్ని చూసి మోహితుడై ఉన్నాడని అనుకునేవాణ్ణి. నా యవ్వనం మనుషుల మీద చూపించే ఆకర్షణ పట్ల నాకు గొప్ప నమ్మకం ఉండేది కాబట్టి, అతడు నాతో సంభాషించే అవకాశం నాకు లభించిందని అనుకునేవాణ్ణి.

ఆ ఉద్దేశ్యంలోనే ఉన్నాను కాబట్టి ఆయన దగ్గరికి వెళ్ళినప్పుడు, నాతో పాటు ఉన్న పరిచారకుణ్ణి వెళ్ళిపొమ్మని చెప్పాను (ఈ సందర్భంగా నేను మొత్తం సత్యం చెప్పాలను కుంటున్నాను, కాబట్టి దయచేసి వినండి, నేనేదైనా తప్పు చెప్తే, సోక్రటీస్, వెంటనే చెప్పేసెయ్యి).'

"సరే. అప్పుడు మేమిద్దరమే ఉన్నాం. మరొకరెవరూ మా పక్కన లేరు కాబట్టి, అలాంటి ఏకాంతంలో ఆయన నాతో ప్రేమికులు మాట్లాడుకునేమాటలు మాట్లడతాడు అనిపించి సంతోషం కలిగింది. కాని అటువంటిదేమీ లేకపోగా, ఆయన ఎప్పటిలానే మామూలుగానే మాటలాడేడు. ఆ తర్వాత నేనాయన్ని కుస్తీపడదాం రమ్మని పిలిచాను.

అతడు నాతో మల్లయుద్ధానికి తలపడ్డాడు, ఆ కుస్తీలో నన్ను చాలాసార్లు చుట్టుముట్టాడుగానీ, అక్కడెవరు మేమిద్దరమే తప్ప మరెవరూ లేనప్పుడైనా నాతో ప్రేమ సంభాషణ మొదలు పెడతాడేమోనని చూసాను.

ఒక్కపిసరు కూడా అలాంటి పనిచెయ్యలేదు. ఇప్పటిదాకా నేనీ విషయంలో నెగ్గలేదుకాబట్టి, ఇకమీదట మరింతగా తెగించాలనుకున్నాను. ఎలానూ ఈ ప్రయత్నాలు మొదలుపెట్టానుకాబట్టి, సంగతేమిటో చూసేదాకా, ఈ విషయాన్ని ఇక్కడితో వదిలిపెట్టకూడదనుకున్నాను.

అందుకని ఒక సాయంకాలం ఆయన్ని మా ఇంటికి భోజనానికి ఆహ్వానించేను. ఆయనొక అందగాడైన యువకుడన్నట్టూ, నేనతడి వెంటపడుతున్న ప్రేమికుడిలానూ ఊహించుకుని పిలిచానుగాని, అతడు రాడానికి ఇష్టపడలేదు. ఏమయితేనేం చివరికి ఒప్పుకున్నాడుగాని, మొదటిసారి వచ్చినప్పుడు, భోజనం పూర్తవగానే వెళ్ళిపోడానికి సిద్ధమయ్యాడు. ఆయన్ని ఆపడానికి నాకు శక్తి చాలింది కాదు.

రెండోసారి వచ్చినప్పుడు, నా మనసులో ఇంకా నా ప్రణాళిక బలంగానే ఉంది కాబట్టి, భోజనం పూర్తయ్యాక, రాత్రి చాలాసేపటిదాకా నేనతణ్ణి సంభాషణల్తో కట్టి పడేసాను. ఇక అతడు వెళ్ళొస్తానని చెప్పగానే, అప్పటికే బాగా పొద్దుపోయిందనీ, అంతరాత్రివేళ వెళ్లడం కన్నా ఉండిపోతేనే మంచిదనీ అనునయించాను. ఇక ఆయన చేసేదేమీ లేక, అక్కడే శయ్యమీద నా పక్కనే కూచున్నాడు. మేము భోంచేసింది కూడా అక్కడే. ఆ గృహంలో ఆ రాత్రివేళ మేమిద్దరం తప్ప మరెవరూ లేరు.

ఇక్కడిదాకా ఈ విషయమంతా ఎవరికేనా చెప్పడానికి సంకోచపడవలసిన పనిలేదు, సిగ్గపడవలసిన అవసరం అంతకన్నా లేదు. కాని ఇవాళ నేను తాగకుండా మామూలుగా ఉండి ఉంటే ఆ తర్వాత ఏమి జరిగిందో ఎంతమాత్రం చెప్పలేకపోయేవాణ్ణి. కాని ఏదో సామెత చెప్పినట్టు, పిల్లలముందూ, మద్యం ముందూ నిజందాగదని, అలాగ, సరే, ఇప్పుడు పిల్లల్ని పక్కనపెట్టండి, మద్యం ప్రభావంలో నేను నిజం చెప్పక తప్పదు.

అందులోనూ సోక్రటీస్ ఉదాత్తత గురించి ప్రసంగించడానికి సిద్ధపడ్డప్పుడు ఇలాంటి విషయాలు అస్సలు దాచలేను. అదీకాక నేను ప్రేమసర్పం కాటుతిన్నవాణ్ణి. గాయపడ్డవాడు తన గాయాన్ని తనలాగా గాయపడ్డవాడితోటే కదా పంచుకుంటాడు. ఎందుకంటే వాళ్ళు మాత్రమే కదా, అతడి బాధ అర్థం చేసుకోగలుగుతారు. అతడి వేదనలోంచి తమతో చెప్పుకున్నమాటల్ని బట్టి అతడిమీద తీర్పు తీర్చడానికి ఇష్టపడరు కదా వాళ్ళు.'

## 40

'సరే, మోహసర్పాన్ని మించినకోరలు కాటువేసి ఉన్నవాణ్ణి. యవ్వనంపెట్టే హింసని మించిన క్రూరమైన దంష్ట్రల కాటు ఎలా ఉంటుందో నా ఆత్మలోనో, నా హృదయంలోనో లేదా నాలోపల ఎక్కడో నాకు తెలుసు. అది తత్త్వశాస్త్రం తాలూకు దంష్ట్రల కాటు. అది తిన్నవాడు ఏదైనా చెయ్యగలడు, ఏమైనా చెప్పగలడు. నా చుట్టూ నాకు కనిపిస్తున్నవాళ్ళు, ఫేద్రోస్, అగధాన్, ఎరిక్సిమేకస్, పౌసనియస్, అరిస్టొడెమస్, అరిస్టొఫెనీస్ మీరంతా, ఇక సోక్రటీస్ సంగతి చెప్పనవసరం లేదు, మీరంతా కూడా జ్ఞానాన్వేషణలోని ఉన్మాదాన్నీ, వ్యామోహాన్నీ చవిచూసినవారే. కాబట్టి అప్పటి నా చేష్టల్ని క్షమించి ఇప్పుడు నేను చెప్పేది వినండి. ఇక్కడున్న పరిచారకులూ, ఇలాంటి విషయాల్ని అర్థం చేసుకునేశక్తిలేనివాళ్లూ కొంతసేపు చెవులు మూసుకోండి.'

'ఆ రాత్రి దీపాలు ఆర్పేసి పరిచారకులు వెళ్ళిపోయిన తర్వాత నేను ఇంక ముసుగులో గుద్దులాట మాని నేరుగా నా మనసులో ఉన్న విషయం బయట పెట్టేద్దామనుకున్నాను. అందుకని నా పక్కన పడుకున్న సోక్రటీస్ ని ఒకసారి కుదిపి 'సోక్రటీస్, నిద్రపోతున్నావా?' అనడిగాను. 'లేదు' అన్నాడు.

'నా మనసులో కదలాడుతున్నదేమిటో తెలుసా' అనడిగాను.

'దేని గురించి ఆలోచిస్తున్నావు' అని అడిగాడు.

'నేనింతదాకా నా జీవితంలో చూసిన ప్రేమికులందరిలోనూ నాకు తగినవాడివి నువ్వే. కాని చూడబోతే నువ్వు నీ ప్రేమని మాటల్లో పెట్టడానికి సిగ్గుపడుతున్నట్టుంది. కాని ఇప్పుడు నువ్వు నన్ను ఏమి కోరినా కాదనేటంత మూర్ఖుణ్ణి కానని మాత్రం చెప్పగలను. అందుకని ఇదుగో ఈ క్షణాన నాకూ, నా స్నేహితులకీ ఉన్నదంతా కూడా నీ పాదాలదగ్గర పెట్టడానికి సిద్ధంగా ఉన్నాను. నువ్వు చెప్పే ఆ ప్రేమమార్గాన్ని అందుకోడానికి నాకు చెయ్యగల సాయమంతా చెయ్యమని కోరుకుంటున్నాను. ఈ విషయంలో నాకు నీకన్నా చక్కగా దారిచూపించగలవాడు మరొకడు లేడ'న్నాను.

'ఈ సమయంలో నువ్వు నన్నేమి కోరినా నేను తిరస్కరిస్తే, వివేకవంతులూ, జ్ఞానులూ నన్ను తప్పుపడతారేమోనని భయంగా ఉంది. ఇక ప్రపంచం సంగతంటావా, మూర్ఖజనసందోహం, వాళ్ళేమనుకుంటే నాకేమిటి?' అని అన్నాను.

నా మాటలకి అతడిలా జవాబిచ్చాడు. అతడి మాటల్లో అదే సూక్ష్మవ్యంగ్యం.

'మిత్రమా, ఆల్సిబయడిస్, నువ్వు చెప్పే మాటలేగనక నిజమైతే, నిన్ను మరింత ఉన్నతివైపు నడిపించగల ఆ శక్తి ఏదో నిజంగా నాలో ఉంటే, నీ ఉద్దేశ్యాలు ఘనమైనవే అని ఒప్పుకుని తీరాలి. నేను నీలో చూస్తున్న అందాన్ని మించిన అరుదైన సౌందర్యాన్ని దేన్నో నువ్వు నాలో చూస్తున్నావన్నమాట.

నువ్వు నానుంచి దాన్ని అందుకోవాలని అనుకుంటున్నట్టయితే, సౌందర్యాన్ని సౌందర్యంతో వినిమయం చెయ్యబోతున్నట్టయితే, అది నీకే ఎక్కువ లాభదాయకంగా మారే అవకాశం ఉంది. ఎందుకంటే నువ్వు మామూలు అందాన్నిచ్చి యథార్థసౌందర్యాన్ని ప్రతిఫలంగా పొందబోతున్నావన్నమాట. ఇత్తడినిచ్చి పుత్తడికైవసం చేసుకోబోతున్నావు'.

## 41

'కాని చూడు మిత్రమా, నన్ను చూసి మోసపోతున్నావేమో మరోసారి చూసుకో. మానవదృష్టి మందగించినప్పుడు మటుకే మనోనేత్రం పనిచెయ్యడం మొదలుపెడుతుంది. కాని, చూడబోతే ఇప్పటిప్పట్లో నీకు వార్థక్యం ముంచుకొచ్చే సూచనలేవీ లేవు' అని అన్నాడు.

ఆ మాటలు విని 'నా ఉద్దేశ్యమేమిటో నీకు స్పష్టంగా చెప్పాను. అందులో ఎటువంటి దాపరికం లేదు. కాబట్టి ఆలోచించి నీకూ, నాకూ ఏది మంచి అనిపిస్తే, అలా చెయ్యి' అని అన్నాను.

'బావుంది అన్నాడాయన. 'మనం మరోసారి తీరిగ్గా కూచుని, ఈ విషయంలోనూ, ఇంకా ఇలాంటి విషయాల్లోనూ ఏది మంచిదో నిదానంగా నిర్ణయిద్దాం' అని అన్నాడు.

ఆయనలా అనడం విని, అతడు కూడా మోహావిష్టుడయ్యాడనీ, నా మాటలు అతణ్ణి వలపుశరాలుగా తాకాయనీ అనుకుని, ఇంక ఆయన్ని మరేమీ మాటాడనివ్వక, నేను నా అంగీ తీసి పక్కనపారేసి, అతడి అంగీకిందకు దొరబడ్డాను. అది నడిశీతాకాలం కాబట్టి, ఆ రాత్రంతా నేను ఆ అద్భుతరాక్షసుణ్ణి నా చేతుల్తో బంధించే ఉన్నాను. సోక్రటీస్, ఈ విషయం నువ్వు కాదనలేవు, నాకు తెలుసు.'

'అయినా కూడా నా వేడికోళ్ళు అతడిని ఇసుమంతైనా కదిలించలేదు. అంతదాకా అతణ్ణి సమ్మోహితుణ్ణి చేస్తూ వచ్చిందనుకున్న నా అందంపట్ల అతడెంత తూష్ణీంభావం వహించాడంటే, ఆ రాత్రి అంతకుమించి మరేమీ జరగలేదు.

ఆ మర్నాడు పొద్దున్నే నేను ఆ శయ్యమీంచి మేల్కొన్నప్పుడు ఒక అన్నదమ్ముడి పక్కనో లేదా తండ్రిపక్కనో పడుకుని లేచినట్టుగా నిద్రలేచాను. (నా మాటలకి సమస్త

దేవీదేవతలు సాక్ష్యముందురుగాక!) ఓ న్యాయవేత్తలారా, ఇప్పుడు చెప్పండి మీరు సోక్రటీస్ శీలమ్మీద తీర్పు!.'

'అటువంటి తిరస్కారం పొందిన తరువాత, నా గౌరవం నా కళ్ళముందే అలా కుప్పకూలిపోయిన తర్వాత నా భావాలేమై ఉండవచ్చనుకుంటున్నారు? కాని నేనతడి స్వాభావిక నిగ్రహాన్నీ, సంయమనాన్నీ, వ్యక్తిత్వాన్నీ చూసి అబ్బురపడకుండా ఉండలేక పోయాను. తన వివేకంలోనూ, తన సహిష్ణుతలోనూ అంత స్థితప్రజ్ఞుడిగా ఉండగల ఒక మనిషిని నేను నా జీవితంలో చూస్తానని ఎన్నడూ అనుకోలేదు. కాబట్టి నాకు అతని మీద కోపం రాలేదు సరికదా, అతడి స్నేహాన్ని తెంచుకోవాలని కూడా అనిపించలేదు. కాని అతణ్ణి గెలుచుకోవడమూ నాకు సాధ్యం కాలేదు.

ఆ ఎయాస్[52] ని ఆయుధంతోనూ గెలవలేం, డబ్బుతోనూ కొనలేం, ఇక నా అందాన్ని ఆకర్షణగా పెట్టి గెలుచుకోగల ప్రయత్నం కూడా విఫలమైపోయింది. నేను పూర్తిగా ఓడిపోయాను. నేనతడికి లొంగిపోయినంతగా ఎవరూ ఎవరికీ పాదాక్రాంతం కారేమో. ఇదంతా కూడా మేమిద్దరం కలిసి పొటిడియా[53] కి వెళ్ళకముందు జరిగింది. అక్కడ మేమిద్దరం కలిసే భోంచేసేవాళ్ళం. ఎటువంటి కష్టానికైనా ఓర్చగల అతడి ఓపిక ఎంత అసాధారణమో అక్కడ ప్రత్యక్షంగా చూసాను.'

## 42

'అక్కడ మాకు ఆహారపదార్థాలు దొరక్కపోయినా, మామూలుగా యుద్ధకాలంలో జరిగేటట్టే, రోజుల తరబడి పస్తులుండవలసి వచ్చినా కూడా, తితిక్షలో అతడు నాకన్నామాత్రమే కాదు, ప్రతి ఒక్కరికన్నా కూడా ఎంతో మిన్నగా కనిపించాడు. అటువంటి ఓపికలో అతడికి ఎవరితోటీ పోలికలేదు.'

అయినా కూడా ఒక పండగ వచ్చిందంటే, ఆ వేడుకని మనఃపూర్వకంగా స్వాగతించేది ఆయనొక్కడే ఉండేవాడు. తాగడం పట్ల అతడికి ఇష్టం లేకపోయినా, ఒకవేళ తాగితీరాలని నిర్బంధిస్తే మాత్రం మా అందర్నీ మించిపోయేవాడు. ఇవన్నీ తలచుకుంటూ ఉంటే నాకెంత సంతోషంగా ఉందో చెప్పలేను. సోక్రటీస్ తప్పతాగిపడిఉండటం చూసిన వాడొక్కడూ లేడని చెప్పగలను. నేను చెప్తున్న మాటల్లో నిజమేమిటో ఈ రాత్రి గడిచేలోపే మీకు తెలిసిపోతుంది.

అలాగే చలిని తట్టుకోడంలో కూడా అతడి ధృతి అమోఘం. ఒకసారి తట్టుకోలేనంత హిమపాతం సంభవించింది. ఆ ప్రాంతాల్లో శీతాకాలం భయంకరంగా ఉంటుంది. ప్రతి

ఒక్కరూ తమ తమ గదుల్లోనే గడియలు బిగించుకు కూచున్నారు. ఒకవేళ బయటికి వెళ్ళవలసి వస్తే రకరకాల దుస్తులు కప్పుకుని మరీ వెళ్ళేవాళ్ళు, పాదాల్ని పూర్తిగా ఉన్నితో కప్పుకోకుండా బయటకి అడుగుపెట్టేవారు కాదు. కాని అటువంటి పరిస్థితిలో కూడా సోక్రటీస్ కాళ్లకి చెప్పుల్లేకుండానే ఆ మంచులో తిరుగాడుతుండేవాడు. నిండా వస్త్రాలూ, ఉన్నీ, మేజోళ్ళూ ధరించిన సైనికుల కన్నా వేగంగా, అతడు, తన మామూలు దుస్తుల్తోనే నడిచేవాడు. తమని చిన్నచూపు చూస్తున్నాడని ఆ సైనికులకి ఆయనంటే కడుపులో మంటగా ఉండేది.

ఇంతకు ముందు నేను మీకో సంఘటన చెప్పాను. ఇప్పుడు మరొకటి చెప్పాలని ఉంది. అది మీరు వినదగ్గది.

యుద్ధరంగంలో ఉన్నప్పుడు 'స్థితప్రజ్ఞుడి భాషా, సమాధి' ఎలా ఉంటాయో చెప్పే కథ అన్నమాట. ఒకరోజు పొద్దున్నే ఆయనేదో సమస్యగురించి ధ్యానిస్తూ ఉన్నాడు. బహుశా ఆ చిక్కుముడి ఎలా విప్పాలా అని ఆలోచిస్తూండవచ్చు. దాన్ని వదిలిపెట్టలేదు. ఆ రోజు తెల్లవారకముందే ఆలోచనలో పడ్డవాడు, మధ్యాహ్నం దాకా కూడా అదే ఆలోచనలో కూరుకుపోయి ఉన్నాడు. మధ్యాహ్నమయ్యేటప్పటికి ఆ చోద్యం అందరి కళ్ళల్లోనూ పడింది. తెల్లవారినప్పణ్ణుంచీ సోక్రటీస్ దేనిగురించో ఆలోచనలో పడి ఎక్కడ నిలబడ్డవాడు అక్కడే నిలబడిపోయి ఉన్నాడని ఒక పుకారు చెలరేగింది.

ఎలాగైతేనేం, సాయంకాలం భోజనం పూర్తయ్యేక కొంతమంది అయోనియన్లు[54] కుతూహలం కొద్దీ (నేనింతకుముందే చెప్పినట్టు, అది వేసవి కాదు, శీతాకాలం అని గుర్తుపెట్టుకోవాలి) ఆ రాత్రంతా కూడా ఆయనలానే నిలబడిఉంటాడో లేదో చూద్దామని, తమ చాపలు తెచ్చుకుని ఆరుబయట పడుకున్నారు. ఆయన మర్నాడు పొద్దున్నదాకా కూడా అక్కడే నిలబడ్డాడు. పొద్దున్నే తెల్లవారగానే సూర్యోదయ ప్రార్థనలు చేసుకుని తన దారిన తాను వెళ్ళిపోయాడు.'

'మీరు వింటానంటే యుద్ధరంగంలో ఆయన సాహసం గురించి కూడా చెప్తాను. చెప్పితీరాలి. ఎందుకంటే నా ప్రాణాల్ని రక్షించింది ఆయన కాక మరెవరు? నా శౌర్యానికి బహుమతి లభించిన యుద్ధఘట్టం అదే. నేను గాయపడి ఉన్నాను, ఆయన నన్ను విడవకుండా కనిపెట్టుకుని ఉన్నాడు. నన్నూ, నా భుజాల్నీ కాచిరక్షించాడు. ఆరోజు సాహససత్కారం నాకు లభించడానికి కొంతవరకూ నా సైనిక హోదా కారణం. కాని నిజానికి ఆ సత్కారం అందించవలసింది ఆయనకి.

ఆ మాటే నేను సైనికాధికారులకి చెప్పాను కూడా (ఈ మాటలు కూడా సోక్రటీస్ తప్పని చెప్పలేదు). కాని ఆ సత్కారం నేను పొందాలని సైనికాధికారులకన్నా కూడా ఆయనే ఎక్కువ ఆత్రుత కనపరిచాడు.'

## 43

'ఆయన తీరు కొట్టొచ్చినట్టు కనబడిన మరో సంఘటన కూడా ఉంది. డేలియా[55] లో యుద్ధరంగంలో సైన్యం పలాయనం చిత్తగిస్తున్నప్పుడు, పొటిడియా దగ్గర కన్నా ఆయన్ని మరింతబాగా చూడగలిగాను. అప్పుడు ఆయన ఒంటినిండా ఆయుధాలు ధరించి పోరాడే కాల్బలంలో ఉన్నాడు. నేను అశ్వదళంలో ఉన్నాను కాబట్టి ప్రమాదానికి దూరంగా ఉన్నాను. ఆయనా, లాచెస్[56] యుద్ధభూమి నుంచి వెనక్కి మరలుతున్నారు. అప్పటికే సైన్యం చెల్లాచెదురై పోయింది. నేను వాళ్లని కలిసి నిరుత్సాహపడవద్దనీ, నేను కూడా వాళ్లతో పాటే ఉంటాననీ చెప్పాను. అప్పుడు నువ్వు ఆయన్ని చూసి ఉండాల్సింది, అరిస్టొఫెనీస్, అచ్చం నువ్వు వర్ణించినట్టే 'గంభీరంగా, అటూ ఇటూ చూస్తో' కొంగలాగా నడిచిపోతున్నాడు. శత్రుమిత్రులిద్దరినీ కూడా జాగ్రత్తగా కనిపెడుతో, దూరం నుంచి చూసినా కూడా పోల్చుకోగలిగేట్టుగా, ఎవరేనా తనమీద దాడిచేస్తే తీవ్రంగా ప్రతిఘటించడానికి సిద్ధంగా, ఆయనా, ఆయనతోటి సైనికుడూ నెమ్మదిగా తప్పించుకుపోయేరు. ఇలాంటి మనుషుల్ని యుద్ధం ఏమీ చేయజాలదు కదా. ఎవరు యుద్ధభూమినుంచి పారిపోతుంటారో శత్రువు కూడా వాళ్ళవెనకనే పడుతుంటాడు.

సమయస్ఫూర్తి విషయానికి వచ్చేటప్పటికి లాచెస్ కన్నా కూడా ఆయన ఎంత చురుకైనవాడో మరీ స్పష్టంగా చూసాను. సోక్రటీస్‌ని స్తుతిస్తూ ఇలా నేను చెప్పగల అద్భుతాలెన్నో ఉన్నాయి. చాలావారకూ అతడు చేసే పనుల్లో మనం ఆయన్ని మరెవరితోనైనా పోల్చగలం. కానీ, ఆయన అద్వితీయత ఉందే, అందులో మాత్రం ఆయనలాంటి మనిషి మరొకడు కనబడడు.

మీరు బ్రసీడసూ[57], ఇంకా అతనిలాగే మరికొంతమంది కూడా అకిలస్‌లాగా ఉన్నారని అనుకోవచ్చు. నెస్టరూ[58], అంటేనర్లు[59] పెరిక్లీస్ లాగా ఉంటారని ఊహించవచ్చు. ఇంకా సుప్రసిద్ధులైనవాళ్ల గురించి కూడా ఇలాంటి పోలికలే తేవచ్చు. కానీ ఈ విచిత్రవ్యక్తిని పోల్చడానికి మాత్రం మీకు ఎంత వెతికినా ఎవరూ కనబడరు. ఇప్పుడు మనమధ్య ఉన్నవాళ్ళల్లోగానీ, గతంలో ఉన్నవాళ్ళల్లోగాని. ఎంత ఆలోచించినా ఇద్దరే మనకు పోలిక స్ఫురిస్తారు. నేనింతకుముందే చెప్పినట్టుగా సిలనసూ, శాటరూ వాళ్ళతో ఆయనకి

రూపంలోనే కాదు, మాటల్లో కూడా పోలిక తేవచ్చు.'

'ఇంతకుముందు మీకు చెప్పడం మర్చిపోయాను. సోక్రటీస్ మాట్లాడుతుంటే, సిలనస్ ప్రతిమల్ని బార్లాతెరుస్తున్నట్టు ఉంటుంది. ఆ చప్పుడు మొదట్లో వినడానికి నవ్వు పుట్టించేట్టుగా ఉంటుంది. ఆయన కావాలనే తన భాషని ఒక అల్లరిచిల్లరి గంధర్వుడి తొడుగుతో కప్పిపుచ్చుకుంటాడు. ఆయన నోరుతెరిస్తే చాలు, గాడిదబరువు గురించీ, వడ్రంగులగురించీ, చెప్పులుకుట్టేవాళ్ల గురించీ, తోళ్ళు సాపుచేసేవాళ్ల గురించీ మాట్లాడు తుంటాడు. ఎప్పుడూ అవే విషయాలు, అవే మాటలు. విషయం తెలియనివాళ్ళు అదాటుగా ఆయన మాటలు వింటే నవ్విపోవడం ఖాయం.

కాని ఒక సారి ఆ ప్రతిమవక్షం చీల్చి అందులో ఏముందో చూసారా, ఇక నిజంగా అర్థవంతమైన మాటలంటూ ఉంటే అవి మాత్రమే అనిపిస్తుంది. అంతకన్నా దివ్యభాష, అంతకన్నా శీలసమన్వితమైన భాష మరొకటి లేదనిపిస్తుంది. అంత సమగ్ర అవగాహనతో, ఆ మాటకొస్తే, ఒక సజ్జనుడు, వందనీయుడు మాట్లాడవలసిన పద్ధతి అదే అనిపిస్తుంది.'

## 44

'మిత్రులారా, ఇదీ సోక్రటీస్ గురించిన నా ప్రశంస. ఇందులో కొంత నింద కూడా కలిపాను, ఎందుకంటే ఆయన నన్ను తీసిపారేసాడు కాబట్టి. ఆయన నన్ను మాత్రమే కాదు, గ్లోకన్ కొడుకు చార్మిడెస్[60] నీ, డయోక్లీజ్ కొడుకు యుథిడెమస్[61] నీ, ఇంకా చాలామందిని ఇలాగే కించపరిచాడు. ముందేమో వాళ్ల ప్రేమికుడన్నట్టు మొదలుపెడతాడు, కాని చివరికొచ్చేసరికి వాళ్ళని తన పాదాక్రాంతుల్ని చేసేసుకుంటాడు. ఇంతకీ నేను చెప్పొచ్చేదంటే అగథాన్, ఆయన మాటలు వినిమోసపోకు. నా సంగతి చూసి నేర్చుకో. నా కథ ఒక హెచ్చరికగా తీసుకో. అనుభవం మీంచి నేర్చుకొమ్మనే కదా పెద్దవాళ్ళు చెప్పింది.'

ఆల్సిబయడస్ ప్రసంగం పూర్తవుతూనే అక్కడున్నవాళ్ళంతా గొల్లుమని నవ్వారు. చూడబోతే అతడింకా సోక్రటీస్‌తో పీకల్లోతుదాకా ప్రేమలో కూరుకుపోయినట్టే కనిపిస్తున్నాడు.

'నువ్వు చాలా నిబ్బరంగా మాట్లాడేవు అల్సియడస్' అన్నాడు సోక్రటీస్. 'లేకపోతే నువ్వు ఈ శాటర్‌ని ఎందుకింతలా ప్రశంసిస్తున్నావో ఆ ఉద్దేశాన్ని మాత్రం ఇంతలా మరుగుపర్చగలిగి ఉండేవాడివి కావు. నువ్వు చెప్పిన ఈ సుదీర్ఘప్రసంగమంతా ముక్కెక్కడుందో చూపించడానికి చుట్టూ తిప్పి చూపించినట్టే ఉంది. నువ్వు చెప్పాలను

కున్నదేదో చిట్టచివరికి బయటపెట్టావు. నాకూ, అగధాన్‌కీ మధ్య కలహం రేపిపెట్టడానికి కాకపోతే మరిదేనికి ఇదంతా? నేను నిన్ను తప్ప మరెవరినీ ప్రేమించకూడదు, నువ్వు, నువ్వు మాత్రమే, నువ్వొక్కడివే అగధాన్ ని ప్రేమించాలి. ఇంతే కదా. కాని ఈ గాంధర్వ రూపకరహస్యం, ఈ సిలనీయ నాటక సారాంశం బయటపడిపోయింది. కాబట్టి అగధాన్, ఇతగాడు మనమధ్య చిచ్చుపెట్టకుండా చూడు' అని కూడా అన్నాడు.

'నీ మాటలు నమ్మదగ్గట్టుగానే ఉన్నాయ'న్నాడు అగధాన్.

'ఈయనొచ్చి మనిద్దరి మధ్యా ఎందుకు కూచున్నాడో ఇప్పుడర్థమవుతోంది, మనల్ని విడదీయడానికే అని. కాని ఆ పప్పులేమీ ఉడకవు. నేనిప్పుడొచ్చి నీ పక్కనే కూచుంటాను' అని కూడా అన్నాడు.

'రా, రా, వెంటనే వచ్చి ఇదుగో నా పక్కన కూచో' అన్నాడు సోక్రటీస్.

'అయ్యో, ఈ పెద్దమనిషి చేతుల్లో మళ్ళా మోసపోయాను. ఆయన ప్రతిసారీ నాకన్నా తనే ఎక్కువ లాభం మూటగట్టుకోడానికే కంకణం కట్టుకున్నాడు. అగధాన్, దయ ఉంచి మా మధ్యలో కూచో, నన్ను వదిలిపెట్టకు' అని వేడుకున్నాడు ఆల్సిబయడిస్.

'ఎంతమాత్రం ఒప్పుకోను' అన్నాడు సోక్రటీస్,

'నువ్వు నన్ను పొగిడినట్టే నేను నా కుడిపక్కన కూచున్నాయన్ని పొగడాలి కదా. ఇప్పుడొచ్చి అగధాన్ మన మధ్య కూచుంటే ఆయన మళ్ళా నన్ను పొగడటం మొదలుపెడతాడు. కాబట్టి అసూయపడకు, దయ ఉంచి ఇందుకొప్పుకో. ఎందుకంటే యువతరాన్ని ప్రశంసించాలని నాకు చాలా కోరిగ్గా ఉంది' అని అన్నాడు సోక్రటీస్.

## 45

'ఆహా! అలా అయితే వెంటనే పరుగెత్తుకొస్తాను. సోక్రటీసుతో పొగిడించుకోడం కన్నా కావలసిందేముంది' అన్నాడు అగధాన్.

'మళ్లా ఎప్పటి కథనే అన్నమాట. సోక్రటీస్ ఉన్నాడంటే అక్కడింక మరొకడికి అవకాశమే ఉండదు. చూడండి, అగధాన్‌ని తన దగ్గరికి రప్పించుకోడానికి ఎంత సొగసైన కారణం వెతికాడో' అని అన్నాడు ఆల్సిబయడిస్.

ఆ తల్పమ్మీద సోక్రటీస్ పక్కన కూచోడానికి అగధాన్ లేచాడు. ఇంతలో ఒక తాగుబోతుల గుంపు ఆ ఇంట్లో చొరబడి ఆ విందుసందడిని కలగాపులగం చేసేసారు. ఎవరో ఆ ఇంట్లోంచి బయటికి వెళ్తూ తలుపు మూయడం మర్చిపోయారు, దాంతో ఆ

గుంపు ఆ ఇంట్లోకి చొరబడి తమ ఇష్టం వచ్చినట్టు తందనాలాడటం మొదలుపెట్టారు. అంతా గందరగోళంగా తయారయ్యింది. ప్రతి ఒక్కరూ అడ్డూఅదుపూ లేకుండా తాగడం మొదలుపెట్టారు. ఎరిక్సిమేకస్, ఫెద్రోస్ ఇంకా తక్కినవాళ్ళు కూడా అక్కణ్ణుంచి వెళ్ళిపోయారని అరిస్టొడెమస్ చెప్పాడు.

తను కూడా నిద్రలోకి జారుకున్నానని చెప్పాడు. ఆ రాత్రులు దీర్ఘమైనవి కావడంతో బాగా నిద్రపట్టేసిందని కూడా చెప్పాడు. తెల్లవారి కోళ్ళు కూసేటప్పటికి తనకి మెలకువ వచ్చిందనీ, లేచి చూసేటప్పటికి రాత్రి వెళ్ళిపోయినవాళ్ళు వెళ్ళిపోగా, అక్కడే నిద్రలోకి జారుకున్నవాళ్ళు నిద్రలోకి జారిపోయి ఉండటం కనిపించిందని చెప్పాడు. అక్కడ మిగిలి ఉన్నవాళ్ళు సోక్రటీస్, అరిస్టొఫెనీస్, అగథాన్‌లు మాత్రమే. వాళ్ళు పెద్ద కలశంలోంచి మధువు తీసుకుని తాగుతూనే ఉన్నారు, సోక్రటీస్ వాళ్ళతో సంభాషిస్తోనే ఉన్నాడు.

అరిస్టొడెమస్ ఇంకా నిద్రమత్తులోంచి పూర్తిగా బయటపడనందువల్ల ఆ సంభాషణ ఎక్కడ మొదలయ్యిందో అతడు వినలేదు. కాని ఆ చర్చలో సోక్రటీస్ ప్రధానంగా మోదాంత నాటకాలు కూడా ప్రతిభలో విషాదాంతనాటకాలకీ ఏమీ తీసిపోవనీ, నిజమైన నాటకకర్త రెండింటిలోనూ సమానమైన శిల్పచాతుర్యమే చూపిస్తాడనీ తన తక్కిన ఇద్దరు శ్రోతల్నీ ఒప్పించే ప్రయత్నం చేస్తున్నట్టు అర్థమయింది. ఆ శ్రోతలిద్దరూ కూడా ఆయన మాటల్ని అంగీకరిస్తున్నట్టే కనబడింది. కానీ మరీ నిద్రమత్తులో ఉన్నందువల్ల ఆ చర్చ ఎటు నడిచిందో అరిస్టొడెమస్ పూర్తిగా గ్రహించలేకపోయాడు.

వాళ్ళల్లో ముందు అరిస్టొఫెనీస్ నిద్రకి ఉపక్రమించాడు. ఇక తూర్పు తెల్లవారుతుండగా, అగథాన్‌కి కూడా కళ్ళు మూతలు పడటం మొదలయ్యింది. వాళ్ళిద్దరూ నిద్రకి ఉపక్రమించాక, సోక్రటీస్ అక్కణ్ణుంచి సెలవుతీసుకోడానికి లేచాడు. ఎప్పట్లానే అరిస్టొడెమస్ కూడా ఆయన్ని అనుసరించాడు. అక్కణ్ణుంచి సోక్రటీస్ నేరుగా లైసియం[62] కి వెళ్ళి స్నానం చేసి తన యథావిధి దినచర్యలో మునిగిపోయాడు. సాయంకాలమయాక ఇంటికి పోయి హాయిగా నిద్రపొయ్యాడు.

# వివరణలు

1. **ప్లేటో** (క్రీ.పూ. 428-348) : సోక్రటీస్‌శిష్యుల్లో అగ్రగణ్యుడు. సోక్రటీస్ సంభాషణల పేరిట ఆయన దాదాపు 35 సంభాషణలు రాసాడు. వాటిల్లో రిపబ్లిక్ పదిఅధ్యాయాల తోనూ, Laws పన్నెండు అధ్యాయాలతోనూ నడిచే సుదీర్ఘ సంభాషణలు. తక్కినవన్నీ ఒకొక్క అధ్యాయం నిడివి కలిగిన సంభాషణలు. ఉపనిషత్తుల్లాగా, బుద్ధుడి దీర్ఘసంభాషణల్లాగా ప్లేటో సంభాషణలు కూడా ప్రశ్నోత్తరాలరూపంలో తాత్త్వికచర్చ చేపడతాయి. అయితే అప్పటికే గ్రీకు నాటకం ఉచ్చస్థితిలో ఉన్నందువల్ల ఈ సంభాషణల్లో కూడా సజీవ పాత్రలు, నాటకీయ సన్నివేశాలు, సాహిత్యచర్చలు చోటుచేసుకున్నాయి. కాబట్టి, ఇవి తాత్త్వికంగా ఎంత విలువైనవో, సాహిత్యపరంగా కూడా అంతే విలువైన రచనలు.

2. **సింపోజియం** : సింపోజియం అనే పదం symposion అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. విద్యావంతులు చేపట్టే పానగోష్ఠి అని దానికి అర్థం. పూర్వకాలపు గ్రీసులో ఒక విందు తర్వాత, తర్పణలూ, ప్రార్థనలూ ముగిసాక పానగోష్ఠి మొదలయ్యేది. దానిలో భాగంగా సంగీతం, నృత్యం, శాస్త్రచర్చలు కొనసాగేవి.

3. **నాటకానికి బహుమతి** : ప్రాచీన గ్రీసులో డయోనిసస్‌కి ఆరాధనగా అయిదురోజుల నాటక మహోత్సవాలు జరిగేవి. అందులో భాగంగా నాటకకర్తలు నాటకాలు రాసి ఏథెన్సు ప్రజల ముందు ప్రదర్శించేవారు. న్యాయనిర్ణేతలబృందాలు ఆ నాటకాల్ని పరిశీలించి ఉత్తమ నాటకాలకి బహుమతులు ప్రకటించేవారు. అయితే న్యాయనిర్ణేతల్ని లాటరీపద్ధతిలో ఎంచుకునే వారు. ఆ నాటకాలు మోదాంతాలు, విషాందాంతాలు, ప్రహసనాలు అని మూడు రకాలుగా ఉండేవి.

4. **హోమర్** : క్రీ.పూ. ఎనిమిదవ శతాబ్దానికి చెందిన గ్రీకు మహాకవి. ఆయన ఇలియడ్, ఒడెస్సీ అనే రెండు ఇతిహాసాలతో పాటు, కొన్ని స్తోత్రాలు కూడా రాసాడు. సోక్రటీస్ హోమర్

అభిమాని. ఆయన సంభాషణల్లో హోమర్ కవిత్వం నుంచి ఎన్నో పంక్తులు పదే పదే ప్రస్తావనకి వస్తూ ఉంటాయి.

5. **అగమెమ్నాన్, మీనిలాస్** : అగమెమ్నాన్, మీనిలాస్ అన్నదమ్ములు. హోమర్ రాసిన ఇలియడ్‌లో పాత్రలు. మీనిలాస్ భార్య హెలెన్ కోసమే ట్రోజన్‌యుద్ధం జరిగింది. ఇక్కడ సంభాషణలో అతణ్ణి తక్కువస్థాయి వీరుడిగా చూపించినప్పటికీ హోమర్ అలా చిత్రించలేదు. ఆ తర్వాత ఎస్కిలస్, సోఫోక్లిస్, యురిపిడిస్ రాసిన నాటకాల్లో కూడా వారిద్దరూ పాత్రలుగా కనిపిస్తారు.

6. **యురిపిడిస్** (క్రీ.పూ. 480-406) : గ్రీకు విషాదాంతనాటకకర్తల్లో ఒకడు. మానవ దుఃఖాన్ని, ముఖ్యంగా స్త్రీదుఃఖాన్ని గాఢంగా చిత్రించాడు. కఠోరమైన జీవితవాస్తవాన్ని అత్యంత వాస్తవికంగా చిత్రించినందువల్ల ఆధునిక ఐరోపీయనాటకం యురిపిడిస్‌కి ఎంతో ఋణపడి ఉందని చెప్తారు. 'మెలనిప్పి' యురిపిడిస్ నాటకశకలంలోని ఒక పాత్ర.

7. **ప్రేమ** : గ్రీకు పదాలు ఇంగ్లిషు అనువాదాల్లోకి వచ్చినప్పుడు వాటి నిర్దిష్టతను పోగొట్టుకుని సార్వత్రిక పదాలుగా మారిపోయాయి. వాటిల్లో Eros కూడా ఒకటి. ఈ సంభాషణ మొత్తం ఎరోస్ గురించిన చర్చ. గ్రీకుల దర్శనం ప్రకారం ఎరోస్ పూర్తిగా మనిషి కాదు, పూర్తిగా దేవత కాదు, కొన్నిసార్లు అది ఒక భావన, ఒక శక్తి, ఒక సంకల్పం కూడా. గ్రీకుల సృష్టి దర్శనం ప్రకారం మొదట అవ్యవస్థ, దాన్నుంచి పృథ్వి (Gaea), ప్రేమ (Eros) రెండూ పుట్టుకొచ్చాయి. ఈ ప్రేమ ఒకరకంగా సంకల్పశక్తి, ప్రజననశక్తి కూడా. అంటే ఆ కోరికలోంచి సమస్త అస్తిత్వం పుట్టుకొచ్చిందని చెప్పవచ్చు. 'సో కామయత, ద్వితీయో మ ఆత్మజాయేతేతి' అని ఉపనిషత్తు (బృహదారణ్యకం, 1.2.4) మాట్లాడిన కామ్యత అది. అలాగని ఎరోస్‌ని మనం కామదేవత అని అనువదిస్తే, అప్పుడు అది గ్రీకునిర్దిష్టతను పోగొట్టుకుని 'కామం' అనే మాటలోని నిర్దిష్టతను సంతరించుకునే ప్రమాదం ఉంది. ఈ అర్థాలన్నిటికీ మధ్యస్థంగా ఎరోస్ ను God of Desire అనవచ్చు గానీ, నేను బెంజమిన్ జోవెట్ దారిలోనే 'ప్రేమ' అనే అంటున్నాను. ఆ 'ప్రేమ' ఏమిటో, ఆమెని సోక్రటీస్ ఏ విధంగా దర్శించాడో ముందు ముందు ఈ సంభాషణలో ఎలానూ చూడబోతున్నాం.

8. **ప్రోడికస్** : ప్రోడికస్ సియోస్‌కి చెందిన సోఫిస్టు. ఏథెన్స్‌కి రాయబారిగా వచ్చాడు. అతడి పట్ల ప్లేటో తన రచనల్లో ప్రత్యేకమైన గౌరవం చూపిస్తాడు.

9. **హెసియోద్** : మన వ్యాసవాల్మీకుల్లాగా గ్రీకు సాహిత్యానికి, సంస్కృతికి రూపురేఖలిచ్చిన ఇద్దరు సాహిత్యకారుల్లో ఒకరు హోమర్, మరొకరు హెసియోద్. అతడు రాసిన గ్రంథాల్లో Works and Days, Theogony అనే రెండు రచనలు మాత్రమే లభ్యమవు తున్నాయి.

10. **పార్మనెడిస్**: ఏలియాకి చెందిన తత్త్వవేత్త. అతడు క్రీ.పూ. 450 లో ఏథెన్స్‌కి వచ్చి సోక్రటీస్‌ని కలిసాడు. ఈ సంభాషణలో సృష్టిక్రమాన్ని వివరించిన రచయితగా పార్మెనిడిస్ గురించి చెప్పినప్పటికీ అతడు ఆ రకమైన వివేచన చేసినట్టుగా మనకి అంతగా తెలియదు. అతడి పేరు మీద లభ్యమవుతున్న గ్రంథంలో నమ్మకాలకు బదులు ఆలోచనకూ, తర్కానికీ ప్రాధాన్యత నిచ్చినవాడిగా కనిపిస్తాడు.

11. **అకుసిలాస్** : ఆరవశతాబ్దికి చెందిన గ్రీకు వచనరచయిత. వంశవృక్షాల సంకలనకర్త.

12. **ఆల్సస్**: గ్రీకు పురాణగాథల్లో అడ్మిటోస్ అనేవాడి భార్య. విధివశాత్తూ అతడికి మరణం తప్పనప్పుడు అతడి బదులు మరొకరు మరణిస్తే అతణ్ణి రక్షించవచ్చనే ఉద్దేశ్యంతో ఆమె ప్రాణత్యాగం చేస్తుంది. ఇదే ఇతివృత్తంతో యురిపిడిస్ కూడా ఒక నాటకం రాసాడు.

13. **ఆఫియస్** : ఒక పురాణ పాత్ర. అతడొక తంత్రీవాద్యకారుడు. తన ప్రియురాలు యురీడైస్ మరణించినప్పుడు ఆమెని పాతాళలోకం నుంచి బయటకు తీసుకురావడానికి ప్రయత్నించాడు. పాతాళలోకాధిపతి ఆమెని తిరిగి అతడితో పంపడానికి ఒప్పుకుంటాడు గాని అతడు వెనుదిరిగి చూడకూడదని షరతు పెడతాడు. కాని తన ప్రయాణంలో ఆఫియస్ ఆ షరతుని ఉల్లంఘించి ఆమెను శాశ్వతంగా కోల్పోతాడు. ఇక్కడ ఫేద్రోస్ ఆమెకి బదులు ఆమె నీడని మాత్రమే అతడికి చూపించినట్టుగా చెప్తాడు.

14. **పెట్రాక్లస్** : ఇలియడ్‌లో ఒక ముఖ్యపాత్ర. గ్రీకువీరుడు. అకిలిస్ స్నేహితుడు.

15. **అకిలిస్** : హోమర్ రాసిన ఇతిహాసం ఇలియడ్‌లో గ్రీకుల తరఫున పోరాడిన మహావీరుడు.

16. **ఎస్కిలస్** : ఆరవశతాబ్దానికి చెందిన గ్రీకు విషాదాంత నాటకకర్త. ప్రసిద్ధి చెందిన ముగ్గురు మహానాటకకర్తల్లో ఒకడు. తక్కినవారిద్దరూ సోఫోక్లీస్, యురిపిడిస్.

17. **హెక్టర్** : హోమర్ రాసిన గ్రీకు ఇతిహాసం ఇలియడ్‌లో ప్రధానపాత్ర. ట్రోజన్ సేనాధిపతి. అతడు గ్రీకువీరుడు పెట్రాక్లస్‌ని చంపినప్పుడు అకిలిస్ అతణ్ణి చంపేస్తాడు. అంతకుముందే అకిలిస్ ఆగమెమ్నాన్‌తో గొడవపడి యుద్ధానికి దూరంగా ఉంటాడు. కాని తన మిత్రుణ్ణి హెక్టర్ చంపాడని విన్నాక వెంటనే యుద్ధంలో అడుగుపెడతాడు. తను హెక్టర్‌ని చంపితే తనకి ప్రాణాపాయమని తెలిసికూడా స్నేహితుడి కోసం అతడు యుద్ధం చేసి ప్రాణాలు త్యజిస్తాడు.

18. **అనుగ్రహం పొంగిపొర్లేద్వీపం** : గ్రీకు పురాణగాథల్లో వీరులు చేరుకునే వీరస్వర్గం. అది గ్రీసుకు పశ్చిమంగా దూరంగా ఉండే ఒక ద్వీపం. పాతాళలోకానికి భిన్నంగా శాంతి,

సంతోషం దొరికే మరణానంతరజీవితానికి అది ఆవాసం.

19. **ఎల్లిస్** : గ్రీసుకి వాయవ్యప్రాంతంలో ఉండే ఒక గ్రామీణరాజ్యం. అయిదోశతాబ్ది రాజకీయపరిణామాలకు దూరంగా గడిపిన రాజ్యం.

20. **బొవొతియా** : మధ్యగ్రీసులో ఉండే ఒక స్వతంత్రరాజ్యం.

21. **అయోనియా** : గ్రీకు పశ్చిమతీరంలో మధ్యభాగంలో ఉన్న వివిధ రాజ్యాల సమాహారం. మొదట్లో గ్రీకులు వాటిని ఆక్రమించారు. తర్వాత పర్షియన్‌పాలనలోకి వెళ్ళాయి. సింపోజియంలోని కథాసందర్భం నాటికి అవి ఏథెన్స్‌పాలనలోకి వచ్చాయి. ప్లేటో సింపోజియం రాయడానికి కూచున్నప్పుడు అవి మళ్ళా పర్షియన్‌పాలనలోకి వెళ్లిపోయాయి.

22. **అరిస్టోజిటన్, హార్మోడియస్** : అరిస్టొజిటన్ హార్మోడియస్ ప్రియుడు. ఏథెన్సు నియంతా, హిపియస్ సోదరుడూ హిపార్కస్ అతడి వెంటపడ్డాడు. ఆ ప్రేమికులిద్దరూ ఆ అన్నదమ్ములిద్దర్నీ హతమార్చాలనుకున్నారు గాని, హిపార్కస్‌ని మాత్రమే వధించారు. దాంతో హిపియస్ వాళ్ళిద్దర్నీ పట్టుకుని మరణశిక్ష విధించాడు. కాని నియంతృత్వాన్ని ఎదిరించిన వాళ్లుగా ఆ ప్రేమికులు అమరులయ్యారు. చివరికి హిపియస్‌ని కూడా ప్రజలు ఏథెన్స్ నుంచి వెళ్ళగొట్టారు.

23. **ప్రేమికుడూ, ప్రేమకు నోచుకున్నవాడూ** : ఈ ప్రసంగాల్లో వక్తలు మాట్లాడుతున్నప్పుడు ఇద్దరు ప్రేమికుల్నీ పురుషులుగానే ప్రస్తావించడం పాఠకుల్ని కొంత అయోమయానికి గురిచేయడంలో ఆశ్చర్యం లేదు. అందుకని ఈ విషయాన్ని మరికొంత వివరించాలి. ప్రాచీన గ్రీసులో స్త్రీలని పురుషుల్తో సమానంగా గుర్తించలేదు. స్త్రీలకీ, పురుషులకీ మధ్య ఉండే సంబంధాలు ప్రధానంగా ప్రత్యుత్పత్తి కోసం ఏర్పరుచుకునే లైంగికసంబంధాలు గానే ఉండేవి. కాబట్టి చైతన్యవంతుడైన ప్రాచీన గ్రీకుపురుషుడు తన సత్యాన్వేషణనీ, సౌందర్యదృష్టినీ మరొకరితో పంచుకోవాలను కున్నప్పుడు స్త్రీలు అందుకు తగినవారు కారని భావించడంతో మరొక పురుషుడివైపు చూసేవాడు. అందులో వయసులో పెద్దవాడైన పురుషుడు అటువంటి సహచరుడికోసం తనకన్నా వయసులో చిన్నవాడు, అప్పుడప్పుడే కౌమారదశదాటి యవ్వనంలోకి అడుగు పెడుతున్న యువకుడివైపు చూసేవాడు. దాన్ని ప్రేమానుబంధంగా మలుచుకునేవాడు. అందులో వయసులో పెద్దవాడైన పురుషుణ్ణి ప్రేమికుడనీ (erastes), చిన్నవాడైన యువకుణ్ణి ప్రేమపొందుతున్నవాడనీ (eromenos) వ్యవహరించేవారు. వారిద్దరి మధ్యా ఏర్పడే ఆ అనుబంధంలో శారీరికసంతోషానికి అవకాశం లేకపోలేదు. అందుకని ఆ అనుబంధాన్ని pederasty అని పిలిచేవారు. ప్రాచీనగ్రీకు ప్రేమకవిత్వమంతా దాదాపుగా ఒక పురుష ప్రేమికుడు తాను ప్రేమిస్తున్న యువకుణ్ణి ఉద్దేశించి చెప్పేదిగానే ఉంటుంది. దాదాపుగా ప్రాచీన రోమ్‌లో కూడా ఇదే పరిస్థితి. పర్షియాలో కూడా ఈ సంప్రదాయం ఉన్నందువల్లనే

పారశీకప్రేమకవిత్వంలో సాఖీ అంటే మద్యశాలలో మద్యంపోసే యువకుడు అనే అర్థం వచ్చింది. కానీ, మధ్యయుగాల్లోనూ, ఆధునికయుగం ప్రారంభంలోనూ ప్రాచీన గ్రీకు, రోమన్, పర్షియన్ కవిత్వాల్ని ఇంగ్లిషులోకి లేదా తక్కిన యూరపియన్ భాషల్లోకి అనువదిస్తున్నప్పుడు, ఈ అంశాన్ని అస్పష్టంగా అనువదిస్తూ వచ్చారు. కానీ ప్రాచీన గ్రీకు సంస్కృతిలో, విద్యా వ్యవస్థలో ఈ అనుబంధం చాలా కీలకపాత్ర పోషించింది. అలాగని అన్ని గ్రీకురాజ్యాలూ దీన్ని సమానంగా అనుసరించాయని చెప్పడానికి లేదు. ఉదాహరణకి స్పార్టా ఈ అనుబంధంలో పూర్తి స్వేచ్ఛని అనుమతిస్తే, ఏథెన్సు దీన్ని నియంత్రిస్తూ చట్టాలు చేసింది. ఒకవైపు ఈ అనుబంధాన్ని అంగీకరిస్తూనే మరొకవైపు దీనిలోని పర్యవసానాలపట్ల మెలకువ చూపిస్తుండటం ఈ ప్రసంగాల్లో మనం గమనించవచ్చు.

24. ఇక్కడ రెటొరిక్ సూత్రాల్ని పేర్కోడానికి కారణం గ్రీకు మూలంలో 'పౌసనియస్ విరమించాడు' అనే వాక్యంలోని రెండుపదాలూ సమంగా నాలుగేసి అక్షరాలతో కూడుకుని ఉండటం. ఆ అందం ఇంగ్లిషులోనూ, తెలుగులోనూ తేగలిగింది కాదు.

25. **అస్క్లిపియస్** : మన ధన్వంతరిలాగా పురాణపురుషుడు. వైద్యశాస్త్రప్రదాత. ముఖ్యంగా వైద్యంలోని స్వస్థతకు అతడు అధిదేవత.

26. **హెరాక్లిటస్** : క్రీ.పూ. అయిదవశతాబ్దానికి చెందిన గ్రీకుతత్త్వవేత్త. సోక్రటీస్ కన్నా పూర్వుడు. వైరుధ్యాల మధ్య ఏకతని చూడటం అతని దర్శనప్రత్యేకత. ప్రవహిస్తున్న నదిలో ఎవరూ రెండుసార్లు అడుగుపెట్టలేరు అనేది అతడి వాక్యమే.

27. **స్త్రీ పురుషమూర్తి** : ఇంగ్లిషులో androgyne. ఇది ప్లేటో అరిస్టొఫెనీస్ ద్వారా చెప్పించిన ఒక పురాణకథ. ఈ కథని ప్లేటోనే కల్పించాడు. కాని, స్త్రీ-పురుషులిద్దరూ ఒకే దేహంలో ఇమిడి ఉండే భావన ప్రపంచవ్యాప్తంగా దాదాపుగా అన్ని నాగరికతల్లోనూ, ఆదిమసంస్కృతుల్లో కూడా కనిపిస్తుంది. స్త్రీ-పురుషులిద్దరూ ఒకే దేహంలో, horizontal గా అంటే, పైన వక్షోజాలు, కింద శిశ్నం ఉండే రూపంలోనూ లేదా vertical గా, అంటే, సగంభాగం స్త్రీగానూ, సగంభాగం పురుషుడిగానూ ఉండే రూపాలు వివిధ సంస్కృతుల్లో కనిపిస్తున్నాయి. మన అర్ధనారీశ్వరమూర్తి కూడా ఇటువంటి స్త్రీ-పురుషమూర్తినే. అయితే, సృష్ట్యాదిలో ప్రజాపతికూడా ఒకడుగానే అంటే androgyne గానే ఉన్నాడనీ, తర్వాత అతడులో రెండుగా మారి, సృష్టి మొదలుపెట్టాడనీ బృహదారణ్యకం చెప్తున్నది. బైబిలు కూడా మొదట ఆడమ్ ఒకడే ఉన్నాడనీ, ఆ తర్వాత తననుంచి ఈవ్‌ను వేరుచేసుకున్నాడనీ చెప్తున్నది. స్త్రీ-పురుషులిద్దరూ ఒకేదేహంలో ఉండి ఆ తర్వాత విడివడ్డారని చెప్పే ఈ భావనని splitting androgyne అనీ, అలాకాక, స్త్రీపురుషులిద్దరూ ఒకేదేహంగా కలిసిపోయి ఉండే

స్థితిగురించిన భావనల్ని fusing androgyne అనీ అంటారు. ఉదాహరణకి, మన శివలింగం fused androgyne కి ఉదాహరణ అని చెప్పవచ్చు. లింగపరంగా స్త్రీ, పురుషవిభేదాలవల్ల మానవజీవితంలో తలెత్తిన ఆందోళనకి అతీతమైనస్థితి పూర్వం ఉండేదనీ లేదా రాగలదనీ అనుకోవడంలోంచే స్త్రీ-పురుషమూర్తి భావన రూపుదిద్దుకుంది.

28. **ఒటస్, ఎఫియాల్టస్** : గ్రీకు పురాణకథల్లో అలావోడే అనే జీవులు అతృప్తజీవులు, దుస్స్వప్నసమానులు. వాళ్ళు అలోఇయస్ భార్య ఇఫిమేడియాకీ, సముద్రాధిదేవత పొసైడన్‌కీ పుట్టినవాళ్ళు. రాక్షసకాయులు. వాళ్ళు ప్రతినెలా తొమ్మిదేసి అంగుళాల చొప్పున పెరుగుతూ దేవతలకి ప్రమాదకరంగా మారారు.

29. **అపోలో** : గ్రీకు దేవత. గ్రీకు ద్వాదశాదిత్యుల్లో ఒకడు. కవిత్వానికీ, స్వస్థతకీ, సంగీతానికీ, జ్ఞానానికీ, సౌందర్యానికీ, యవ్వనానికీ, వ్యవస్థానిర్మాణాలకీ అధిదేవత. గ్రీకుస్వభావంలోని సౌకుమార్యానికీ, నైతికతకీ, క్రమశిక్షణకీ అతడు ప్రతీక కాగా, విశృంఖలత్వానికీ, అడ్డులేని భావోద్వేగాలకీ డయోనిసిస్ ప్రతీక.

30. **హెఫిస్టస్** : గ్రీకు పురాణాల్లో ఒక దేవత. అగ్నికీ, అగ్నిపర్వతాలకీ, కమ్మరానికీ అధిదేవత. జ్యూస్‌కి పుత్రుడు.

31. **స్పార్టన్లు అర్కాడియన్లని గ్రామాల్లోకి తరిమేసినట్టు** : ఇది సింపోజియం కథాకాలం (క్రీ.పూ. 416) కన్నా తర్వాతా, కాని సింపోజియం రచనకన్నా ముందూ, అంటే క్రీ.పూ. 385లో జరిగిన సంఘటన. కాని పొరపాటున రచయిత, కథాకాలం కన్నా తర్వాతి సంఘటనని కథలో పేర్కొన్నాడు. ఈ ప్రస్తావన వల్లనే సింపోజియం రచనాకాలం క్రీ. పూ. 385 తర్వాత అని చెప్పడానికి ఆధారం దొరికింది.

32. **ఎట్** : గ్రీకు పురాణాల్లో ఒక దేవత. పొరపాట్లకీ, సర్వనాశనానికీ, మోసపోడానికీ అధిదేవత.

33. **కథలో చెప్పినట్టు** : హోమర్ ఒడెస్సీలో వర్ణించినట్టుగా.

34. **ఎథీనా** : గ్రీకు పురాణగాథల్లో దేవత. వీరులకి సంరక్షకురాలు.

35. **గోర్గియాస్** : హోమర్ రాసిన ఒడెస్సీలో ఒడెస్యూస్ పాతాళలోకానికి వెళ్ళినప్పుడు అక్కడ గోర్గాన్ మెడుసా శిరసుని చూడవలసి వస్తుందని భయపడి చూడకుండా వచ్చేస్తాడు. ఆ శిరసు చూసినవారిని ఆమె శిలగా మార్చేస్తుందని ప్రతీతి. ఇక్కడ సోక్రటీస్ గోర్గాన్ అనే పేరుకీ, సిసిలీకి చెందిన గ్రీకువక్త, వాక్చాతుర్యానికి పెట్టింది పేరైన గోర్గియాస్‌కీ మధ్య ఉన్న పోలిక మీద శ్లేష చేస్తున్నాడు. అగధాన్ తన వక్తృత్వంలో గోర్గియాని తలపిస్తున్నాడని ఆయన

భావం.

36. **యురిపిడిస్ చెప్పినట్టుగా** : యురిపిడిస్ రాసిన నాటకంలోని ఒక పంక్తిని గుర్తు చేసుకుంటూ. గ్రీకు నుడికారం ప్రకారం love is of అంటే, love is the child of అనే అర్థం వస్తుంది. కాబట్టి సోక్రటీస్, తాను కోరుకుంటున్న జవాబు ఆ అర్థంలో కాకుండా, ప్రేమ 'దేనికో ఒకదానికి సంబంధించిన' అనే అర్థంలో జవాబిమ్మని చెప్తున్నాడు.

37. **డయోటిమా** : డయోటిమా అనే ఆమె ప్లేటో సృష్టించిన ఒక పాత్ర అని కొందరు వ్యాఖ్యాతల ఉద్దేశ్యం. ఆమె ప్లేటో తాత్త్వికచింతనని సోక్రటీస్‌కి నేర్పి ఉంటుందని మనం అనుకోలేం కదా అని వాళ్ళ భావన. ఆమె మంచినియా నుంచి వచ్చింది అని అనడంలో గ్రీకులో mantis అనే పదానికి ఋషి అనే అర్థం కూడా ఉండటం ఒక కారణం. డయోటిమా అంటే 'జ్యూస్ చేత గౌరవించబడ్డ' అని అర్థం. ఈ కథనంలోని నిజానిజాలు ఎలా ఉన్నా, స్త్రీలు పురుషుల్తో సమానంగా సత్యాన్వేషణ చెయ్యలేరు అని నమ్మే గ్రీకు కులీనసమాజానికి సోక్రటీస్ తాను ఒక స్త్రీ ద్వారా శిక్షణ పొందాను అని చెప్పడం చిన్న విషయం కాదు. నేనేమనుకుంటానంటే సోక్రటీస్ జీవితంలో అటువంటి సంఘటన ఏదో ఒకటి సంభవించి ఉండకపోతే ప్లేటో సింపోజియం లాంటి సంభాషణలో ఆమెకి అంత కీలకమైన స్థానాన్ని ఇచ్చి ఉండడు. ఆమె చెప్పిన మాటలు, సోక్రటీస్ ద్వారా విన్నవి, ప్లేటో తన శైలిలో రాసి ఉండి ఉంటే అందులో ఆశ్చర్యమేమీ లేదు. ఒక స్త్రీ ద్వారా ప్రేమ గురించీ, తాంత్రిక విద్యల గురించీ తెలుసుకోవడానికి మనకి తెలిసిన మరొక ఉదాహరణ రామకృష్ణ పరమహంస. ఆయన జీవితంలో తంత్రసాధనకు ఒక భైరవి తోడ్పడి, ఆ సాధన ముగియగానే ఆయన జీవితంలోంచి అదృశ్యమైపోయింది.

38. గ్రీకు భాషలో poiesis అంటే అర్థం తయారుచేయడం, రూపొందించడం అని. మనం అల్లసానివాని అల్లిక జిగిబిగి అన్నట్టుగా అల్లిక. అలాగే ఒక కళ కూడా.

39. **కాడ్రస్** : ఏథెన్సుని పరిపాలించాడని చెప్పుకునే ఒక పురాణపాత్ర. ఒక శత్రువు తనమీద చేసే దాడిని తాను తట్టుకుని బతికితే ఏథెన్సు పరపాలనలోకి పోతుందని ఒక భవిష్యవాణి చెప్పడంతో, ఏథెన్సు క్షేమం కోసం, తన సంతతి మాత్రమే ఏథెన్సు పాలకులుగా కొనసాగడం కోసం అతడు ఐచ్ఛికంగా మరణించాడు.

40. **హోమర్, హెసియోడ్‌ల సంతతి** : అంటే వాళ్ళు రాసిన ఇతిహాసాలూ, కావ్యాలూనూ.

41. **లైకాగస్** : స్పార్టాకు రాజ్యాంగాన్నీ, శాసనాల్నీ రూపొందించాడని భావించే ఒక పురాణ చక్రవర్తి. అతడి శాసనాలు మొత్తం గ్రీసుకే మేలు చేసాయి కాబట్టి, ఏథెన్సుని డయోటిమా ప్రస్తావించింది.

42. **సోలన్** : ఏథెన్స్‌కి చెందిన పూర్వ శాసనకర్త, సంఘసంస్కర్త, కవి. అతడి పేరుమీద అథీనియన్ శాసనాల్ని సోలన్ శాసనాలని వ్యవహరిస్తారు.

43. **సరళ, సత్య, దివ్యసౌందర్యం** : ఈ అద్భుతమైన దర్శనాన్ని మాండూక్య ఉపనిషత్తులోని ఈ దర్శనంతో పోల్చుకోకుండా ఉండలేకపోతున్నాను.

> నాన్తః ప్రజ్ఞం న బహిః ప్రజ్ఞః నోభయతః ప్రజ్ఞ న
> ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞమ్ నా ప్రజ్ఞమ్ అదృష్టమ్ అవ్యవహార్యమ్
> అగ్రాహ్యమ్ అలక్షణమ్ అచిన్త్యమ్ అవ్యపదేశ్యమ్
> ఏకాత్మప్రత్యయసారం ప్రపంచోపశమం శాంతం శివం
> అద్వైతం చతుర్థం మన్యన్తే స ఆత్మా సి విజ్ఞేయః (7)

(అది అంతఃప్రజ్ఞ కాదు. బహిఃప్రజ్ఞ కాదు. రెండూ కలిసిన ప్రజ్ఞ కూడా కాదు. అది ప్రజ్ఞానఘనమూ కాదు. ప్రజ్ఞాకాదు, అప్రజ్ఞా కాదు. కనిపించేదికాదు, పనుల్తో గుర్తుపట్టగలిగేదికాదు, అసలు గ్రహించగలిగేదీ కాదు, దాన్ని కనుక్కోడానికి గుర్తులుండేదీ కాదు. ఆలోచిస్తే అర్థమయ్యేది కాదు, ఫలానా అని పేరుపెట్టగలిగేది కాదు, ఒకే ఒక్క సత్యాన్ని గ్రహించినప్పుడు తెలిసే సారాంశం అది. అక్కడ ప్రపంచం సద్దుమణిగిపోతుంది. అది శాంతం, శివం, రెండు కానిది. ఆ నాలుగవస్థితినే ఆత్మ అని తెలుసుకో).

44. **సిలనోస్** : గ్రీకు పురాణాల్లో సిలనోస్ డయోనిసిస్‌కి సహచరుడూ, గురువూ కూడా. కొద్ది వయసుమీదపడ్డట్టు కనబడే అతడి మూర్తిని చూస్తే సోక్రటీస్‌ని చూసినట్టే ఉంటుంది.

45. **మర్స్యాస్** : గ్రీకు పురాణపాత్ర. మన గంధర్వుడి వంటివాడు. సంగీతానికి సంబంధించిన రెండు పురాణగాథల్లో అతడు ముఖ్యపాత్ర. ఒకసారి సాక్షాత్తూ సంగీత అధిదేవత అపోలోనే సంగీతంలో పోటీకి పిలిచాడు.

46. **శాటర్** : గ్రీకు పురాణాల్లో గంధర్వుల్లాంటివాళ్ళు. బండముక్కు, జంతువుల్లాంటి ముఖాలు, సదా నగ్నంగా ఉండే రూపాలు వాళ్ళవి. సంగీతాన్ని, మద్యాన్నీ, స్త్రీలనీ, నాట్యాన్నీ ఇష్ట పడతారు. సాధారణంగా పచ్చికబయళ్ళలో, అడవుల్లో, కొండల దగ్గరా సంచరిస్తుంటారు.

47. **ఒలింపస్** : ఫ్రిగియాకి చెందిన సంగీతకర్త. సగం పురాణాలనుంచీ, సగం చరిత్రనుంచీ వచ్చిన పాత్ర. ట్రోజన్‌యుద్ధం కంటే ముందటివాడు.

48. **అభం శుభం తెలియని పిల్ల** : మామూలుగా పానగోష్ఠుల్లో భాగంగా పిల్లంగోవి ఊదే పిల్లల గురించి ప్రస్తావన.

49. **కోరిబంటియన్ నర్తకులు** : ఫ్రిగియాకి చెందిన ఒక రహస్య క్రతువులకి చెందిన నర్తకగణం. మతిస్తిమితం లేనివారిని స్వస్థపరిచే గుణం ఆ నర్తకుల నాట్యానికి ఉందని నమ్మేవారు.

50. **పెరిక్లీస్** : అయిదవ శతాబ్దానికి చెందిన గ్రీకు రాజ్యాధినేత. సేనాని. మహావక్త. గ్రీకు చరిత్రలో స్వర్ణయుగంతో అతడి పేరుముడివడి ఉంది. థ్యూసిడైడ్స్ వంటివాడు అతణ్ణి ఏథెన్సు ప్రథమపౌరుడని కీర్తించాడు.

51. **సైరన్లు** : గ్రీకు పురాణాల్లో మనుషుల్ని పోలిన, మనుషుల్ని సమ్మోహితుల్ని చెయ్యగల గాయికలు. హోమర్ రాసిన ఒడెస్సీలో ఒడెస్యూస్ తన దేశానికి తిరిగివెళ్తున్నప్పుడు మార్గ మధ్యంలో సైరన్ల సంగీతం వినబడుతుందనీ, అది చెవినపడితే, నావికులు దారిమర్చి పోతారనీ, కాబట్టి వాళ్ల చెవుల్లో మైనం పెట్టమనీ ఒడెస్యూస్‌కి ముందే హెచ్చరిక లభిస్తుంది. అతడు తన నావికుల చెవుల్లో మైనం పెడతాడుగానీ, తాను మాత్రం ఆ గానం వినాలను కుంటాడు. అందుకని తనని ఆ తెరచాపకొయ్యకి తాళ్ళతో కట్టెయ్యమని చెప్తాడు. అలా ఆ గానం వింటాడుగాని, ఆ తాళ్ళు తెంచుకోకుండా ఉండటం అసాధ్యమనిపించిదని చెప్తాడు ఆ తర్వాత.

52. **ఎజాక్స్ లేదా ఎయాస్** : గ్రీకు ఇతిహాసం ఇలియడ్‌లో ఒక ముఖ్యపాత్ర. వీరాధివీరుడు. శౌర్యంలో అకిలిస్ తర్వాత అతడే గుర్తొస్తాడు.

53. **పొటిడియా** : కొరింత్‌కు చెందిన ఒక వలసనగరం. కొరింత్‌కూ, ఏథెన్సుకూ మధ్య జరిగిన యుద్ధంలో ఏథెన్సు ఆ నగరాన్ని పూర్తిగా వశపర్చుకునే ముందు రెండేళ్ళపాటు ముట్టడి కొనసాగించింది. ఆ ముట్టడిలో పాల్గొన్నప్పటి విషయాల్ని ఇక్కడ గుర్తుచేసు కుంటున్నాడు.

54. **అయోనియన్లు** : అయోనియాకి చెందిన సైనికులు. ఆ ద్వీపం కొన్నాళ్లు ఏథెన్స్ పాలనలోనూ, కొన్నాళ్లు పర్షియా ఆధిపత్యం కిందా, మరికొన్నాళ్ళు ఏథెన్స్ కిందా ఉంటూ వచ్చింది.

55. **దేలియా** : బొవొతియన్లకీ, ఎథీనియన్లకీ మధ్య యుద్ధం జరిగిన చోటు.

56. **లాచెస్** : పెలొపొన్నీసియన్ యుద్ధాల్లో పోరాడిన సేనాధిపతి. సోక్రటీస్ మిత్రుడు. అతడి పేరు మీద ప్లేటో ఒక సంభాషణ కూడా రాసాడు.

57. **బ్రసీడస్** : పెలొపొన్నీషియన్ యుద్ధాల తొలిరోజుల్లో సాహసోపేతంగా పోరాడిన స్పార్టన్ సేనాధిపతి.

58. **నెస్టర్** : ఇలియడ్‌లో ఒక కురువృద్ధుడి వంటి పాత్ర. గ్రీకుల తరఫున పోరాడేడు.

59. **ఆంటెనర్** : ఇలియడ్‌లో పాత్ర. ట్రోజన్ల తరఫున పోరాడేడు.

60. **చార్మిడస్** : అందమైన యువకుడు, సోక్రటీస్‌అభిమానుల్లో ఒకడు, ప్లేటో అతడి పేరుమీద కూడా ఒక సంభాషణ రాసాడు.

61. **యుథిడెమస్** : అందమైన యువకుడు, సోక్రటీస్ అభిమానుల్లో ఒకడు. అదే పేరుతో ఒక సోఫిస్టు కూడా ఉన్నాడు.

62. **లైసియం** : ఏథెన్సులో తూర్పుపక్కన, నగర ప్రాకారానికి ఆవల ఉండే ఒక వ్యాయామశాల, ప్రజాస్నానశాల.

# ప్లేటో

# ప్రేమగోష్ఠి

## వాడ్రేవు చినవీరభద్రుడు

సుప్రసిద్ధ గ్రీకు తత్త్వవేత్త ప్లేటో రాసిన సంభాషణల్లో సింపోజియం అత్యున్నత రచన. కేవలం తాత్త్విక సంభాషణగానే కాక, సాహిత్య గౌరవాన్నీ, కావ్యత్వాన్నీ అందుకున్న రచన. రెండున్నరవేల ఏళ్ల కిందట ఏథెన్సులో ఒక మిత్రుడి ఇంట్లో కొందరు సత్యాన్వేషులు ప్రేమగురించి ఒక చర్చ మొదలుపెడతారు. ప్రేమదేవత ప్రశంసగా మారుతున్న ఆ చర్చను సోక్రటీస్ అమరత్వం గురించీ, జీవిత పరమార్థం గురించీ చర్చగా మారుస్తాడు. ఉపనిషత్తుల్నీ, బుద్ధుడి దీర్ఘసంభాషణల్నీ, కన్ఫ్యూసియస్ సుభాషితాల్నీ గుర్తుకు తెచ్చే ఈ సంభాషణ విద్యావంతులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చదవవలసిన రచన. దీన్ని తెలుగులోకి మొదటిసారిగా అనువదించి అందిస్తున్న వాడ్రేవు చినవీరభద్రుడు రాసిన ఒక విపుల పరిచయ వ్యాసం ఈ పుస్తకానికి ప్రత్యేక ఆకర్షణ.

